# శ్రీ వేంకటేశ్వరస్వామివారు

## (అర్చామూర్తి (మూలవిగ్రహం) విశేషాలు)

రచన

**శ్రీమాన్ అర్చకం రామకృష్ణ దీక్షితులు**

అనువంశిక అర్చకులు & వైఖానస ఆగమ సలహాదారు

శ్రీవారి ఆలయం, తిరుమల

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2023**

**SRI VENKATESWARASWAMY VARU**
**(Archamoorthy (Moolavigraham) Viseshalu)**

**by**
**Sriman Archakam Ramakrishna Deekshithulu**

T.T.D. Religious Publications Series No. 1462
© All Rights Reserved

First Edition : 2023

Copies : 500

*Published by*
**Sri A.V. Dharma Reddy,** IDES
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati - 517 507.

***D.T.P:***
Publications Division
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.

# ముందుమాట

**"వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన ।**
**వేంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి" ॥**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రంకాని, వేంకటేశ్వర స్వామివారికి సాటిరాగల మరో దైవంకాని ఈ బ్రహ్మాండంలో ఇంతవరకు ఎక్కడా లేరు. ఇకమీద కూడా ఉండరు అని అర్థం.

కలియుగ ప్రత్యక్షదైవము కోరిన వరాలరాయుడు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలో స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్ర తీర్థాలు, స్వామివారికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి ఆయా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటిస్తున్నది.

ఈ కలియుగంలో మానవులకు ధర్మసూక్ష్మాలను బోధించి మోక్షోపాయాన్ని చూపించడానికి ఆ పరమాత్మ పర, వ్యూహ, విభవ, అన్తర్యామి అర్చారూపాలలో సాక్షాత్కరిస్తాడని శాస్త్రం చెబుతున్నది. ఆవిధంగా అర్చారూపంలో ఈ కలియుగంలో భక్తులకోసం కొలువైనవాడే శ్రీనివాస భగవానుడు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరుడు.


'కలౌ వేంకటనాయకః' అన్న పురాణోక్తిని సార్థకం చేస్తూ కలిపురుషుడి మాయలో మానవాళిని పడకుండా తన పాదాలను శరణాగతి చేస్తే పాపవిముక్తి చేయడానికి వేంకటాచలక్షేత్రంలో కొలువై ఉన్నాడు. ఆ శ్రీనివాసుని మించిన దైవము, శ్రీ వేంకటేశ్వర మంత్రము కన్న గొప్పదైన మంత్రము, శ్రీనివాసుని దర్శనముకంటే భక్తి, శ్రీనివాసుని

కృపను పొందుటకంటే ఉత్తమగతి మరొకటిలేదు. రామ, కృష్ణాది అవతారాలు దేవతలు, ఋషులు ప్రార్థిస్తే దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి ధర్మసంస్థాపన చేయడానికి విష్ణుమూర్తి ధరించిన అవతారాలు. శ్రీ వేంకటేశ్వరస్వామి అవతారం అలాకాదు. భక్తులను తరింపజేయడానికే శ్రీవైకుంఠవిరక్తుడై తిరుమలలో సాలగ్రామ శిలారూపంలో స్వయంభూ మూర్తిగా అవతరించాడు. ప్రతి భక్తుడూ శ్రీవారి సన్నిధిలో పొందే ఆధ్యాత్మిక అలౌకిక అనుభూతులు ఇంకెక్కడా పొందలేడు. ఈ నేపథ్యంలో ఆ సుందరరూపం తిరుమల కొండల్లోకి ఎలా వచ్చింది? స్వామిని ఎవరు మొదట చూశారు? ఎవరు ముందుగా అర్చించారు, శిల్పశాస్త్రపరంగా, ఆగమశాస్త్రపరంగా శ్రీవారి విగ్రహలక్షణాలు ఎలా సమన్వయమవుతాయి? ఇలా ఎన్నో ప్రశ్నలు భక్తుల మదిలో ఉదయిస్తాయి.

వీటన్నింటికి సమాధానంగా శ్రీవారి ఆలయ, ఆనువంశిక అర్చకులు, వైఖానస ఆగమ సలహాదారులైన శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులుగారు **'శ్రీ వేంకటేశ్వరస్వామివారు'** అనే పేరుతో **'తిరుమల క్షేత్రదర్శిని'** అనే గ్రంథమాల క్రింద ఈ చిన్ని పొత్తమును భక్తులందరి ప్రశ్నలకు సమాధానంగా రూపొందించారు. వీరికి తి.తి.దే. తరపున శ్రీవారి అనుగ్రహం కలగాలని ఆశిస్తూ... **'శ్రీ వేంకటేశ్వరస్వామివారు'** అనే ఈ చిన్నిపుస్తకం భక్తుల ఆదరణను పొందగలదని ఆశిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో...*

**శ్రీకార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.



# అవతారిక - ఉపోద్ఘాతం

ఈ లోకంలో మానవుడిగా జన్మించడం చాలా దుర్లభమైన విషయంగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే పరమాత్మ సృజించిన సృష్టిలో మానవులతోపాటు జరాయుజములు, అండజములు, స్వేదజములు, ఉద్భిజములనే భేదంతో ఇతర ప్రాణులెన్నో ఉన్నప్పటికినీ, కిందటి జన్మలలో అనేక పాప, పుణ్యకర్మలు చేసి, తత్ఫలితంగా మళ్ళీ ఏదో ఒకరూపంలో జన్మించి... ఇలా మళ్ళీ మళ్ళీ పుడుతూ, నిష్క్రమిస్తూ, మన పుణ్యకర్మల శాతం పెరిగి పెరిగి పరిపక్వతకు వచ్చినప్పుడు, పరమాత్మ అనుగ్రహంతో మానవజన్మ లభిస్తుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అని ఆర్యోక్తి. మరియెన్నో లక్షల, కోట్లజన్మల తర్వాత ప్రాణికోటిలో దుర్లభమైన మానవజన్మ లభించింది. మరి ఈ మానవజన్మను ఎలా సార్థకం చేసుకోవాలి? ఏం చేస్తే నిరంతర జనన-మరణ చక్రం నుండి విముక్తి లభిస్తుంది? అసలు మానవజన్మ అంతిమ లక్ష్యం ఏమిటి? అని ఒకసారి అంతర్ముఖంగా మనల్ని మనం ప్రశ్నించుకున్నప్పుడు, మన మనస్సు అప్రయత్నంగా సమాధానాల కొరకు అన్వేషించడం ప్రారంభిస్తుంది.

భారతీయ సనాతన ధర్మం మానవుడి అంతిమ లక్ష్యం మోక్షాన్ని పొందడమే అని తెలియజేస్తున్నది. మోక్షం అంటే ఏమిటి? అది ఎలా ఉంటుంది? అంటే

**తచ్చ నిత్యానంద మమృతరసపానవ త్సర్వదా తృప్తికరం**
**పరమాత్మనో నిత్యనిషేవణం పరంజ్యోతిః ప్రవేశనం ॥**

అని వైఖానసీయ మరీచి విమానార్చనాకల్పం మోక్షస్వరూపాన్ని వివరిస్తున్నది. నిత్యమూ, ప్రతి క్షణమూ ఆనందకరమైనది. అమృతాన్ని

సేవిస్తే ఎటువంటి సంతృప్తి లభిస్తుందో అట్టి మనఃస్థితిని కలిగి, ఎటువంటి వ్యతిరేకభావనలు – కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదివికారములు అంటకుండా, నిత్యం పరమాత్మ యొక్క దివ్యసౌందర్యాన్ని దర్శిస్తూ, సేవిస్తూ, తరిస్తూ చివరికి పరంజ్యోతిని ప్రవేశించడాన్నే మోక్షంగా శాస్త్రం తెలియజేస్తోంది. ఇటువంటి అత్యుత్తమమైన మోక్షాన్ని పొందడమే మానవజన్మ లక్ష్యం. పరమాత్మ యొక్క అపారమైన కృపాకటాక్షముల వలన మానవజన్మ పొందటం. దీనినే ఒక సోపానంగా మలచుకుని మోక్షాన్ని పొందటానికి ప్రతి మానవుడు సాధన చేయాలి. మనం మాములుగా వింటూ ఉంటాం కృతయుగంలో ధర్మం నాలుగు పాదాల మీద, త్రేతాయుగంలో మూడు పాదాల మీద, ద్వాపరయుగంలో రెండు పాదాల మీద, కలియుగంలో ఒక పాదం మీద ధర్మం నడుస్తుంది అని. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాల మీద నడుస్తుంది కనుక ఆ యుగంలో మోక్షసాధన చేసేవారికి దివ్యమైన, మహామహిమాన్వితమైన మహర్షులు, తపోధనులు మార్గనిర్దేశం చేస్తారు. అంతేగాక కృత, త్రేతా, ద్వాపర యుగాలలో సాక్షాత్తూ పరమాత్మే విభవ అవతారాలను ధరించి, ధర్మస్థాపన చేసి, తరుణోపాయాన్ని, అనేక ధర్మసూక్ష్మాలను తన బోధనల ద్వారా లోకానికి అందించి దారిని చూపించాడు. మరి కలియుగం పరిస్థితి ఏమిటి? ఎక్కడ చూసినా పాపం, కలిపురుషుడి ప్రభావంతో మానవజీవితం గతి తప్పి అల్లకల్లోలమై, అసలు ఏది సరైన ధర్మమో, ఎవరు చెప్పేది వినాలో తెలియని ఒక గాఢాంధకారమైన స్థితి ఆవరించి ఉన్నది. మరి ఇక ఏది దారి?

పరమాత్మయైన శ్రీమహావిష్ణువు లోకంలోని సమస్త ప్రాణికోటిని కటాక్షించడానికి పర, వ్యూహ, విభవ, అన్తర్యామి, అర్చారూపాలలో సాక్షాత్కరిస్తాడని శాస్త్రవచనం. ఇందులోని పర, వ్యూహ రూపాల్లో



భగవంతుడైన మహావిష్ణువుని దర్శించడం దేవతలకు కూడా దుర్లభమైనది, బహు కష్టసాధ్యం కూడా. ఇక విభవ అవతారాలలో స్వామిని సేవించుకోవాలంటే, ఆయా యుగాలలో పుట్టి ఉండాలి. అన్తర్యామిగా ప్రతి జీవి హృదయకమలంలో కొలువై ఉన్న శ్రీమన్నారాయణుడిని దర్శించుకోవాలంటే కఠినమైన యోగసాధన ద్వారానే సాధ్యం. ఇక చివరిది, ఐదవదియైన అర్చారూపం అంటే విగ్రహరూపంలో దేవాలయాలలో కొలువైన రూపాన్ని, ప్రతి ఒక్కరూ సేవించుకోవచ్చు. అర్చారూపంలోని శ్రీమన్నారాయణుణ్ణి దర్శించుకుంటే పరరూపంలోని స్వామివారిని సేవించిన ఫలితం లభిస్తుందని, 'కట్టెదురా వైకుంఠము...' అనే కీర్తనలో అన్నమాచార్యుల వారు వర్ణిస్తూ

**"కొండకాదిలి బ్రహ్మాది లోకములకొనల కొండ..."**

**"శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ..."**

అని కీర్తిస్తూ, వేంకటాద్రి కొండ ఈ భూలోకంలో ఉన్నప్పటికీనీ, ఇది విశ్వంలోని సమస్త బ్రహ్మాండాలను దాటితే వచ్చే పరమపదంతో (శ్రీవైకుంఠం) సమానమైనది అని, కొండపై కొలువైన ఉన్న స్వామి, పరస్వరూపంతో శ్రీవైకుంఠంలో విరాజిల్లే నారాయణుడే అని కీర్తిస్తాడు. అర్చావతారంలోని ప్రధాన సౌలభ్యం, సమస్త మానవులందరికీ, అందుబాటులో ఉండి దర్శనమిస్తూ తరింపజేస్తాడు. తన సౌశీల్యంతో తన భక్తులను వదలకుండా వారి వెన్నంటే నిలిచి అభయాన్నిస్తాడు.

**వైకుంఠం వా పరిత్యజ్యే న భక్తాన్ త్యక్తుముత్సహే ।**
**అతిప్రియా హి మే భక్తా ఇతి సంకల్పవానసి ॥ (ఆదిత్యపురాణం)**

వైకుంఠాన్నైనా విడిచిపెడతాను కానీ నా భక్తులను విడిచి ఒక్క క్షణమైనా ఉండను అనే ప్రతిజ్ఞతో తిరుమలలో కొలువైన వరప్రసాది శ్రీనివాస భగవానుడు.

కలౌ వేంకటనాయకః అనే పురాణోక్తిని సార్థకం చేస్తూ ఈ కలియుగంలో, కలిపురుషుడి మాయనుండి సమస్త మానవాళిని రక్షిస్తూ, వారు మోక్షసాధన కోసం ఇంకెటువంటి ప్రయత్నం చేయకుండా, కేవలం తన పాదాలయందు శరణాగతి చేస్తే చాలు అనే సందేశాన్నిస్తూ, మనలందరినీ అనుగ్రహిస్తున్నాడు. అందుకే శ్రీవైష్ణవ సంప్రదాయంలో తిరుమల దివ్యక్షేత్రాన్ని భగవద్గీతలోని చరమశ్లోకానికి ప్రతీకగా అభివర్ణిస్తారు.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

అన్ని విధములైన ధర్మములను విడిచిపెట్టి, కేవలం నాకే శరణాగతి చేయుము. నేను నిన్ను అన్ని పాపముల నుండి విముక్తి చేసెదను భయపడకుము అని పరమాత్మే అభయమిచ్చాడు. అంతేకాక ఈ కలియుగంలో,

**విశేషతః క్రూరకలౌ నరాణాం పాపాకరాణాం పరిపీడితానామ్ ।**
**భూగోళమధ్యే ద్రవిడే చ పుణ్యే శ్రీవేంకటాద్రిర్గతిరేవ నాన్యా ॥**
**(భవిష్యోత్తర పురాణం)**

అతిముఖ్యంగా, భయంకరమైన ఈ కలియుగంలో పాపాత్ములకు, పాపకర్మలచే పీడించబడుతున్నవారికి, ఈ ప్రపంచంలో పవిత్ర దక్షిణ భారతదేశంలోనున్న వేంకటాచలక్షేత్రంలోని శ్రీనివాస భగవానుడే శరణ్యం తప్ప మరే ఉపాయము లేదని పురాణాలు ఉద్ఘోషిస్తున్నాయి. ఇదే విషయాన్ని వేదం కూడా ధ్రువీకరిస్తూ

**అరాయికాణే వికటే గిరిం గచ్ఛ సదాన్వే**
**శిరింబిఠస్య సత్త్వభి స్తేభిష్ట్వా ఛాతయామసి ॥**
**(ఋగ్వేదం, 10.155.1)**



ఓ పురుషార్థకాముకుడా! నీవు ఐశ్వర్యహీనుడైనను, బాహ్యాంతర దృష్టిహీనుడవైనను, లక్ష్మీసంపత్కరమైన శ్రీ వేంకటాచలం అనే పేరుగల కొండకు వెళ్ళుము. అక్కడ పరమనిష్ఠాగరిష్ఠులు, వేదమార్గానుయాయులైన శ్రీవైఖానస అర్చకుల చేత ఆరాధింపబడుచున్న జగత్ప్రభువైన శ్రీ శ్రీనివాసస్వామి సన్నిధి ఉంది. శ్రీవారి అనుగ్రహం వలన, కొండపై అడుగుమోపిన తత్క్షణమే, సమస్త పాపములు దహించుకుని పోయి, శ్రీవారి దర్శనభాగ్యం వలన సకల ఐశ్వర్యములు సిద్ధిస్తుంది అని పై మంత్రం వివరిస్తున్నది.

ఇటువంటి మహత్తరమైన దివ్యవైభవం కలిగిన దైవం కనుకనే 'వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి' అని పురాణాలు స్తుతిస్తున్నాయి. అర్చారూపంలో శ్రీ వేంకటేశ్వరునిగా అపరిమితమైన దయను భక్తుల మీద ప్రసరింపజేస్తూ వారందరినీ కేవలం దర్శనమాత్రం చేతనే తరింపజేస్తున్నాడు వేంకటాద్రి విభుడు. అందుకే పురాణాలు, శ్రుతులు ఇతిహాసాలు శ్రీవారి వైభవాన్ని కీర్తిస్తూ,

**సత్యం సత్యం పునస్సత్యం న దేవో వేంకటేశ్వరాత్ ।**
**బ్రహ్మాణ్డే నాస్తి యత్కించిత్ న భూతం న భవిష్యతి ॥**

**యం దృష్ట్వా నాపరో దేవో యం దృష్ట్వా నాపరో మనుః ।**
**యం దృష్ట్వా నాపరా భక్తిః యం దృష్ట్వా నాపరో గతిః ॥**
**(భవిష్యోత్తర పురాణం)**

శ్రీనివాసుని మించిన దైవము, శ్రీ వేంకటేశ్వర మంత్రము కన్నా గొప్పదైన మంత్రము, శ్రీనివాసుని దర్శనముకంటే భక్తి, శ్రీనివాసుని కృపను పొందుటకంటే ఉత్తమగతి మరొకటి లేదు. శ్రీ వేంకటేశ్వరుని మించిన దైవము, ఈ ప్రపంచంలో మరొకరు లేరు. శ్రీ వేంకటేశ్వరుని మించిన దైవము, ఈ ప్రపంచంలో భూత భవిష్యత్ కాలములలో

మరొకరు లేనేలేరు. ఇది ముమ్మాటికి సత్యము, సత్యము అని నొక్కి వక్కాణిస్తున్నవి.

శ్రీమన్నారాయణుని రామ, కృష్ణాది అవతారాలు, లోకంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి ధర్మసంస్థాపన చేయమని దేవతలు, మునులు, భక్తులు ప్రార్థిస్తే, స్వామి ఆ రూపంలో వచ్చి తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. కానీ ఎవ్వరూ పిలువలేదు, ఎవ్వరూ రమ్మని అడగలేదు, అయినా పిల్లలకున్న బాధ కన్నతల్లికే తెలుస్తుందన్న చందంగా, శ్రీ వేంకటేశ్వర స్వామివారు, శ్రీ వైకుంఠవిరక్తుడై, లక్ష్మీసమేతంగా, తిరుమలలో వేంచేసి, కేవలం తన భక్తులను తరింపజేయాలి అని ప్రతిజ్ఞ చేసుకుని ఈ పవిత్రమైన వేంకటాచల కొండలపై, సుమారు 8 అడుగుల పైగా ఉండే, మహిమాన్వితమై, అణువణువూ విష్ణుదేవతామయంగా భాసిల్లే సాలగ్రామ శిలారూపంలో శ్రీ శ్రీనివాస భగవానుడు అవతరించాడు.

'పిలిస్తే పలికే దైవం' అన్న పేరుని సార్థకం చేస్తూ, ఇక్కడ స్వామివారు తన భక్తులతో మాట్లాడుతాడు, ఆటలాడుతాడు, అలుగుతాడు, పరాచికాలాడుతాడు, ఇలా ఒక్కటేమిటి... ప్రతి భక్తుడూ కూడా, తిరుమల శ్రీవారి సన్నిధిలో పొందే ఆధ్యాత్మిక, అలౌకిక అనుభూతులు ప్రపంచంలో మరెక్కడా పొందలేరంటే ఏమాత్రం అతిశయోక్తి కాదేమో. కొన్నివేల సంవత్సరాలుగా, చెక్కు చెదరకుండా, అలుపు సొలుపు లేకుండా, తన భక్తులను కటాక్షించడమే పరమావధిగా, ప్రథమ కర్తవ్యంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారు తిరుమల దివ్యక్షేత్రంలో నిలిచి ఉన్నాడు. అయితే ఈ సుందరమైన దివ్యరూపం, తిరుమల కొండల్లోకి ఎలా వచ్చింది? స్వామివారిని మొదటగా ఎవరు చూశారు? ఎవరు ప్రతిష్ఠించి మొదటగా అర్చించారు? శ్రీవారి దివ్యమైన రూపం అణువణువు ఎలా ఉంటుంది? శ్రీవారి దివ్యతిరుమేనిలో విశేషమైన లక్షణాలు శిల్ప శాస్త్రపరంగా, ఆగమశాస్త్రపరంగా ఏవిధంగా సమన్వయ



మవుతాయి? అసలు శ్రీవారి విగ్రహరూపం గురించి ప్రచారమవుతున్న అనేక విషయాల వెనకున్న నిజాలేంటి? స్వామివారి రూపం దర్శనం తర్వాత మన మనస్సులలో నుండి ఎందుకు అదృశ్యమవుతుంది? ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రశ్నలు, ప్రతి భక్తుడి మదిలో మెదలుతాయి. వాటన్నింటినీ క్లుప్తంగా, సంతృప్తికరంగా వివరించే ప్రయత్నమే ఈ చిన్ని పుస్తకం. కొన్ని వేల సంవత్సరాలుగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి పూజాకైంకర్యాలతో నిమగ్నమైన పరంపరకు చెందిన వంశపారంపర్య అర్చకునిగా, ప్రతినిత్యం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని గర్భాలయంలో స్పృశించి, అన్నీ పూజాకైంకర్యాలు నిర్వహించే మహద్భాగ్యం లభించినవాడిగా, శ్రీవారి నిజరూప సౌందర్యాన్ని నఖశిఖపర్యంతం దర్శించి, సేవించి, తత్ఫలితంగా క్షీర నీర న్యాయముతో, శ్రీవారిని గురించిన అనేక విశేషాలతో ఏరికూర్చిన ఈ చిన్ని పుస్తకం, శ్రీవారి భక్తులందరి ఆదరణ పొందగలదని ఆశిస్తున్నాను.

**శ్రీనివాసో విజయతే**

**అర్చకం రామకృష్ణ దీక్షితులు**
అనువంశిక అర్చకులు &
వైఖానస ఆగమ సలహాదారు
శ్రీవారి ఆలయం, తిరుమల.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ఉపోద్ఘాతం | vii |
| 1. | శ్రీవారి విగ్రహం ఎప్పటిది? | 1-26 |
| 2. | పురాణాలలో శ్రీనివాసుని విగ్రహవర్ణన | 26-34 |
| 3. | చారిత్రక గ్రంథములలో శ్రీవారివర్ణన | 34-42 |
| 4. | ఆళ్వార్ల పాశురాలలో శ్రీవారి మూర్తివర్ణన | 42-47 |
| 5. | ధ్రువబేర వర్ణన | 47-52 |
| 6. | గర్భాలయ వాస్తు పదవిన్యాసం | 52-54 |
| 7. | బేరములు - రకములు | 54-58 |
| 8. | శ్రీనివాసుని దివ్య స్వయంవ్యక్త సాలగ్రామ రూపం | 58-62 |
| 9. | వ్యూహలక్ష్మీ | 62-65 |
| 10. | సమ్మోహనం - ధ్రువబేర సౌందర్యం | 66-69 |
| 11. | శ్రీవారి పరుగు | 70-72 |
| 12. | శ్రీవత్సం - ప్రలంబ సూత్రం | 72-77 |
| 13. | ధ్రువబేరం - కైంకర్యాలు | 77-92 |
| 14. | ధ్రువబేరం - అపోహలు - వాస్తవాలు | 92-98 |
| 15. | ఉపయుక్త గ్రంథాలు | 99-100 |

# శ్రీవారి విగ్రహం ఎప్పటిది?

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారు, భక్తుల ఇలవేల్పుగా, ఆపదమ్రొక్కులవాడిగా తిరుమల దివ్యక్షేత్రంలో పూజలందుకుంటున్నాడు. సర్వజగద్రక్షకుడైన శ్రీవారు భక్తులచే ఈ విధంగా ప్రార్థింపబడుతాడు.

**ఊర్ధ్వౌ హస్తౌ యదీయౌ సురరిపుదలనే బిభ్రతౌ శంఖచక్రే**
**సేవ్యావంఘ్రీ స్వకీయావభిదధ దధరో దక్షిణో యస్య పాణిః ।**
**తావన్మాత్రం భవాబ్ధిం గమయతి భజతామూరుగో వామపాణిః**
**శ్రీవత్సాంకశ్చ లక్ష్మీర్యదురసి లసతస్తం భజే వేంకటేశమ్ ॥**

దుష్టశిక్షణార్థం, శిష్టరక్షణార్థం రాక్షసులను సంహరించడానికి తన రెండు పై చేతులలో శంఖ, చక్రములు ధరించిన, తన కుడిచేతితో పరమ పవిత్రమైన దివ్య శ్రీ పాదపద్మములను సేవించమని చూపుతూ, తన ఎడమతొడ మీద ఉంచిన, కట్యవలంబిత ముద్రగల ఎడమచేయి, తనను ఆశ్రయించిన వారికి సంసారసముద్రము మొలబంటి లోతు మాత్రమే అని సూచించిన, వక్షఃస్థలములో నిత్య అనపాయినీ లక్ష్మీదేవి దివ్య శ్రీవత్సరూపములో ప్రకాశించుచున్నదో అట్టి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని సేవించుచున్నాను అని పై శ్లోకార్థము.

ధగద్ధగాయమానమైన దివ్యకాంతులతో వెలుగులీనే స్వర్ణశోభిత ఆనందనిలయ విమాన శిఖరం క్రింద, పరమ పావనమైన గర్భగృహంలో, ఠీవిగా, గంభీరంగా వేంచేసిన నిలువెత్తు సాలగ్రామ శిలా అర్చారూపంలో, దర్శించిన ప్రతి భక్తుడి చూపులు త్రిప్పుకోలేనంత దివ్యమైన సౌందర్యంతో, శ్రీ శ్రీనివాస భగవానుడు ప్రకాశిస్తూ తన భక్తులకు నిత్యం దర్శనమిస్తూ ఉంటాడు. తండోపతండాలుగా తరలివచ్చే భక్తజనసాగరం, తమను

సంసారసాగరాన్ని సులభంగా దాటిస్తాడు నా స్వామి అనే నమ్మకంతో విచ్చేసే భక్తులు, దూరంతో సంబంధం లేకుండా శ్రీవారిని దర్శించి పులకించిపోతారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి, తనమీద ప్రేమతో, వాత్సల్యంతో, భక్తితో, ఆర్తితో సేవించుకునే అశేష భక్తులకు స్వామివారు దివ్యమైన దర్శనాన్ని ప్రసాదిస్తారు. శ్రీవైష్ణవ పరంపరలోని గొప్ప ఆచార్యులైన శ్రీ నమ్మాళ్వార్లు శ్రీవారు మనకు అనుగ్రహించే దర్శనాన్ని గురించి అద్భుతంగా వర్ణిస్తాడు. శ్రీ వైకుంఠంలో బ్రహ్మాది దేవతలు, ఇతర దేవతాగణములతో కలిసి ఎలా ఐతే స్వామివారిని దర్శించి, పూజిస్తారో, అలాగే ఈ భూమిమీదున్న మానవులకు కూడా, దేవదేవుడైన శ్రీమహావిష్ణువు అటువంటి అవకాశాన్ని కల్పించటం కోసం, భూమి మీదున్న తిరుమల దివ్యక్షేత్రంపై కొలువైనారట. శ్రీ వైకుంఠమును వీడిన శ్రీమహావిష్ణువు, భూమిపైన వేంకటాచల పర్వతంపై దివ్య అర్చారూపంలో వేంచేసి, దేవతలు కూడా మానవుల సహచరులై పూజాకైంకర్యాల విషయంలో భాగస్వామ్యం వహించి, వైకుంఠంలో ఏఏ సేవలు జరుపుతారో, ఇక్కడ కూడా తన భక్తులచే అదేవిధమైన పూజాకైంకర్యాలు చేయించుకోవడానికే, మహావిష్ణువు వేంకటేశ్వరునిగా ఇక్కడ కొలువై ఉన్నాడట. స్వర్గలోకవాసులైన దేవతలు వారికి గల పరిమిత శక్తులతో శ్రీవారిని ఎలా పూజిస్తారో అలాగే మానవమాత్రులైన మనం కూడా మనకు గల పరిమిత శక్తులతో, మన సమస్యలు, కోరికలను తీర్చమని శ్రీవారిని ప్రార్థిస్తూ సేవిస్తాము. మనం ఈ శరీరంతో స్వర్గాన్ని చేరలేం కనుక, మనమీద అపరిమితమైన కరుణ, దయతో మనలను అనుగ్రహించడానికే శ్రీవారు వైకుంఠమును విడిచి వేంకటాద్రిపై వెలసినాడు. అందుకే పురాణాలు

**మాయావీ పరమానందం త్యక్త్వా వైకుంఠముత్తమం ।**
**స్వామిపుష్కరిణీతీరే రమయా సహ మోదతే ॥**



భగవంతుడు మాయావి. ఆయన లీలలను అర్థం చేసుకోవడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఉత్తమోత్తమమైన, ఆనందస్వరూపమైన శ్రీ వైకుంఠాన్ని వదిలిపెట్టి, శ్రీమహావిష్ణువు వేంకటాద్రిపై స్వామిపుష్కరిణీ తీరంలో, ఆనందనిలయమున శ్రీదేవితో కూడి ఆనందిస్తున్నాడు అని వర్ణిస్తున్నాయి.

అనేక మహిమలకు నెలవైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి అర్చారూపమును దర్శించి, సేవించి తరించిపోవడం కోసమే లక్షలాది మంది భక్తులు, కాలము మరియు వాతావరణ ఇబ్బందులకు వెరవకుండా నిత్యం తరలివస్తూ ఉంటారు. ఆనందనిలయవాసుడి ముగ్ధమోహన రూపాన్ని దర్శించి, పులకించిపోయి, అలా బంగారువాకిలి దాటి భక్తులు విమానప్రాకారంలోకి ప్రవేశిస్తారు. సంప్రదాయాన్ననుసరించి, ఆ ప్రాకారంలో స్వామివారిని ధ్యానిస్తూ కొద్దిసేపు కూర్చుంటారు. అలా కూర్చుని శ్రీవారి మీద దృష్టి నిలిపి ఆలోచిస్తున్నప్పుడు, అసలు దివ్యమైన శ్రీవారి అర్చారూపం ఎప్పటిది, ఏ కాలం నాటిది? స్వామివారి రూపం గురించి శాస్త్రాలు, పురాణాలు, స్థల మాహాత్మ్యాలు, చరిత్ర, శాసనాలు ఎటువంటి విషయాలు తెలుపుతున్నాయి, అని పరి పరి విధాలుగా భక్తుల ఆలోచనలు సాగుతూ ఉంటాయి.

తిరుమల శ్రీవారి ఆలయంలో అత్యంత ప్రాచీనకాలం నుండి, శ్రీవారికి జరిపే అనేక కైంకర్యాలన్నీ కూడా, సాక్షాత్తూ విష్ణువు హృదయం నుండి ఉద్భవించిన, భగవాన్ విఖనస మహర్షులవారు ప్రవచించిన శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా జరుగుతుంది. మొట్టమొదటగా ఒక ఆలయాన్ని నిర్మించాలంటే, ముందుగా ఒక ఆచార్యుని ఎన్నుకుని, ఆయనకు ఆలయ నిర్మాణ బాధ్యతలు ఇవ్వాలని (ఆలయాన్ని నిర్మించాలని సంకల్పించిన యజమాని ద్వారా) వైఖానస సంహితలు పేర్కొంటున్నాయి. దీనినే ఆగమశాస్త్రం 'ఆచార్యవరణం' అని పేర్కొంటోంది.

ఆచార్యం సర్వకార్యోపదేశకం శ్రీవైఖానససూత్రోక్తివిధినా నిషేకాది సంస్కారై స్సంస్కృతం విప్రం వేదవిదం నిత్యస్వాధ్యాయయుతం గృహస్థం పత్న్యగ్న్యపత్యసహితం... భూపరీక్షాది సర్వక్రియా విశేషజ్ఞం జ్ఞానయోగవిదం జితేంద్రియం నిత్యధ్యానపరం నిశ్చలం నిత్యార్చనాపరం వైష్ణవం భక్తిమన్తమేకం వరయిత్వా ॥ (భగవాన్ మరీచి విమానార్చనా కల్పం)

ఆలయానికి భూపరీక్ష చేయుట ప్రారంభించడానికి ముందుగా యజమాని ప్రధాన ఆచార్యుని నియమించాలి. ఆ ఆచార్యునికి ఉండాల్సిన శుభలక్షణాలు పై శ్లోకంలో తెలుపబడుతున్నది. సర్వకార్యములను గురూపదేశం ద్వారా పొందినవాడు, శ్రీవైఖానస సూత్రములో చెప్పబడిన విధిప్రకారము నిషేకాది సంస్కారములచే సంస్కరించబడినవాడు, సాంగ వేదాధ్యయనము చేసిన బ్రాహ్మణుడు, నిత్యము వేదమును అధ్యయనము చేయువాడును, సతీసమేతుడైన గృహస్థుడును, సంతానము కలిగినవాడు, కరుణస్వభావము కలిగినవాడు, శుభలక్షణములు కలిగినవాడు, ఇంద్రియాలను జయించినవాడు, నిత్యధ్యానము చేయువాడు, నిశ్చల మనస్కుడు, నిత్యారాధనాతత్పరుడు, భక్తిమంతుడును ఐన గర్భవైష్ణవుని (వైఖానసుడిని) ఆచార్యునిగా నియమించి, వారికి నమస్కరించి, పూజించి భూపరీక్షాది ఆలయ నిర్మాణ ప్రతిష్ఠోత్సవ అర్చనా ప్రాయశ్చిత్తాది సర్వ కార్యములను నిర్వహించుట నిమిత్తం ఆచార్యునిగా ఉండవలెనని ప్రార్థించాలని వైఖానససంహితయైన మరీచి విమానార్చనాకల్పం తెలియజేస్తున్నది.

అయితే ఈ విషయాలన్నీ ఇక్కడ ఎందుకు ప్రస్తావించారనే సందేహం కలగవచ్చు. మనం ప్రస్తుతం శ్రీవారి విగ్రహం ఏనాటిది? అనే విషయాన్ని గురించి చర్చిస్తున్నాం. ఈ విషయాన్ని రెండు భాగాలుగా ఇక్కడ తెలియజేయబడుతుంది. మొదటగా మనం ప్రస్తుతం కలియుగంలో



ఉన్నాం కనుక, శ్రీవారి విగ్రహం కలియుగ ప్రారంభంలో మొట్టమొదటగా ఎవ్వరు చూసి పూజించారనే విషయం తెలుసుకుందాం. ఇక రెండవది, కలియుగానికన్నా ముందునుండి స్వామి వారిక్కడ కొలువై ఉన్నారా, ఉంటే వాటి వివరాలు ఏమిటి అన్న విషయాన్ని రెండవ భాగంలో తెలుసుకుందాం.

ద్వాపరయుగంలో శ్రీ వేదవ్యాసుల వారు లోకకళ్యాణార్థం అనేక విషయాలను గ్రంథాల రూపంలో తెలియజేశారు. అందులో అష్టాదశ పురాణాలున్నాయి. ఈ అష్టాదశ పురాణాలలో, 12 అంటే ద్వాదశ పురాణాలలో తిరుమల శ్రీవారి గురించి, శ్రీనివాసుడి ఆవిర్భావం, పద్మావతీ శ్రీనివాసుల పరిణయం, తిరుమలలో పవిత్రమైన తీర్థాలు మొదలైన అనేక విషయాలను గురించి తెలియజేయబడి ఉన్నది. ఈ ద్వాదశ పురాణాలలో శ్రీవారి గురించిన విషయాలను సేకరించిన సంకలన గ్రంథానికి 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యం' అని పేరు. శ్రీవారిని గురించిన విషయాలను తెలుసుకోవడానికి పురాణస్థ ఆధారమే శ్రీ వేంకటాచల మాహాత్మ్యం గ్రంథం. ద్వాదశ పురాణాలలోని విషయాలను సేకరించి, మొట్టమొదటిసారిగా సంకలనం చేసి, తాటియాకు పత్రాలపై వ్రాసి శ్రీవారికి అంకితమిచ్చిన తొలివ్యక్తి, శ్రీమాన్ పసిండి వేంకటత్తురైవార్.

శ్రీ వేంకటేశ్వర స్వామివారిని అర్చావిగ్రహరూపంలో ఈ కలియుగంలో, శ్రీవారి ఆలయ మొట్టమొదటి వైఖానస అర్చకుడైన శ్రీమాన్ గోపీనాథ దీక్షితులవారు కనుగొన్నట్లు, శ్రీ వేంకటాచల మాహాత్మ్యం తెలియజేస్తున్నది. సాక్షాత్తూ భగవంతుడి పరిపూర్ణ అనుగ్రహం పొందినవాడు. శ్రీవారి ఆజ్ఞమేరకు, శ్రీ వేంకటేశ్వర స్వామివారి అర్చారూపానికి మొదటిసారిగా ఆరాధనాదులను ప్రారంభించినవాడు.

కలియుగ ప్రారంభంలో గోపీనాథ దీక్షితుల మహత్కైంకర్యం వలన, అప్పటినుండి ఇప్పటివరకూ మానవాళి శ్రీవారిని పూజిస్తూ, శ్రీవారి అనుగ్రహాన్ని పొందగలుగుతున్నాము.

**యతః స్సర్వాని భూతాని భవంత్యాది యుగాగమే ।**
**యస్మింశ్చ ప్రలయం యాంతి పునరేవ యుగక్షయే ॥**
**(శ్రీ విష్ణుసహస్ర నామస్తోత్రము)**

సృష్టిప్రారంభంలో సమస్త జీవములు పరమాత్మయైన శ్రీమన్నారాయణుని నుండే ఉద్భవించాయి. అలాగే ప్రళయం వచ్చినప్పుడు ఎవ్వరి దగ్గరనుండి సమస్త జీవరాశి ఉద్భవించిందో, ఆ విష్ణుభగవానుడిలోనే లయమవుతాయి అని శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్రం విశదీకరిస్తున్నది. ఈ శ్లోకం మనకు ప్రళయం గురించి తెలియజేస్తున్నది. మరియు ఈ ప్రళయమే ఒక విధంగా మహిమాన్వితమైన శ్రీవారి అర్చారూపాన్ని మనకు తెలిసేటట్లు చేసిందని చెప్పవచ్చు.

అది సుమారు 3102వ సంవత్సరం (సామాన్య శకానికి ముందు) ద్వాపరయుగం నాటి చివరి క్షణాలు. దుష్టశిక్షణార్థం, ధర్మసంస్థాపన కోసం తాను ధరించిన శ్రీకృష్ణావతార సమాప్తి చేయాల్సిన అవసరం వచ్చిందని, తాను అవతరించిన కార్యం నిర్విఘ్నంగా పూర్తయిందని శ్రీమన్నారాయణుడు సంకల్పించాడు. పరమాత్మ సృష్టించిన మాయ వలన, యాదవులలో ఇద్దరు పురుషులు భార్యాభర్తలుగా వేషాలు వేసుకొని దుర్వాసమహర్షితో పరాచికాలాడగా, దుర్వాసుడు కోపోద్రిక్తుడై, యాదవ కులంలో ముసలం పుడుతుంది. అది మీ వంశాన్ని తుడిచిపెడుతుంది అని శపిస్తాడు. ఆ ముని చెప్పినట్లే యాదవుడికి ముసలం పుట్టగా, వారందరూ భయకంపితులై, శ్రీకృష్ణపరమాత్మని శరణువేడి తరుణోపాయం సూచించమని ప్రార్థిస్తారు. శ్రీకృష్ణుడు, ఆ ముసలాన్ని



అరగదీసి సముద్రంలో కలిపివేయమని చెబుతాడు. వారందరూ శ్రీకృష్ణుడు చెప్పినట్లే చేయగా, అరగదీయగా మిగిలిన ముక్క, సముద్రపు అలలపై తేలియాడుతూ ఒడ్డుని చేరుతుంది. ఆ ముసలపు ముక్క అటుగా వెళ్తున్న బోయవాడైన 'జర'కు దొరుకుతుంది. జరుడు ఆ ముక్కని పదునుపెట్టి, దానిని విల్లంబులకి అమర్చి వేటాడుటకు సిద్ధంగా ఉంచుతాడు. అదే సమయానికి శ్రీకృష్ణపరమాత్మ, తాను భూలోకానికి వచ్చిన నిమిత్తం నెరవేరినదని, ఇక అవతారసమాప్తికి తరుణం ఆసన్నమైనదని భావించి, యోగనిద్రలో, నేలమీద పడుకుని కాలు మీద కాలు వేసుకుని ఉండగా, దట్టమైన అడవిలోని చెట్లమధ్య స్వామివారి పాదములను చూసి లేడియని భ్రమించి, తన వద్దనున్న ముసలం పొదిగిన బాణంతో గురిచూసి కొట్టగా, ఆ బాణం స్వామివారి పాదమునకు తగిలినది. వెనువెంటనే వేయి సూర్యులు ఒకేసారి ఉదయించారా అనే చందంగా మిరుమిట్లు గొలిపే కాంతి ఉద్భవించినది. ఆ సమయమున స్వామివారి దర్శనార్థం అక్కడ బ్రహ్మాది దేవతలు, ఋషులు, మునులు వేచి ఉండగా, శ్రీకృష్ణుడు శ్రీమహావిష్ణువుగా, చతుర్భుజములతో, శంఖచక్రధారియైన రూపంలో సాక్షాత్కరించాడు. బ్రహ్మాది దేవతలు, స్వామివారు శ్రీకృష్ణావతారంలో భూలోకమున ధర్మస్థాపన చేసినందుకు ప్రార్థిస్తూ ఉండగా, దివ్యతేజోరూపంలో ఉన్న స్వామివారి కాంతి ఆకాశములోనికి ఎగిసినది.

దేవతలందరూ స్వామివారి దివ్యతేజోరూపం శ్రీవైకుంఠానికి వచ్చి వారందరికీ దర్శనమివ్వగలదని భావిస్తూ ఉండగా, వారిని ఆశ్చర్య చకితులను చేస్తూ, ఆ కాంతి పుంజం శ్రీ వైకుంఠమును దాటి సూర్యమండలం చేరుకున్నది. ఇంతలో కాంతిరూపంలో ప్రకాశిస్తున్న స్వామివారి రూపం ఉన్నట్లుండి, దివ్యశిలానిర్మితమైన చతుర్భుజధారిగా మారినది. దేవతలందరూ స్వామివారిని ఉద్దేశించి ప్రార్థించగా, అప్పుడు

అశరీరవాణి, "నేను భూమిపై శిలారూపంలో అమిత శక్తిసంపన్నతతో అవతరిస్తాను. యుగాంతం వరకు నేనచ్చటనే నివసించెదను కనుక మీరు చేసే ప్రార్థనలు, పూజలు, పరిచర్యలు యథావిధిగా అక్కడే (భూలోకంలో) చేయవలసినది" అని ఆజ్ఞాపించాడు. ఇది ద్వాపర యుగాంతమున (కలియుగ ప్రారంభంలో) జరిగిన విషయము.

**"భుజై శ్చతుర్భిః సముపేతం మమేదం**
**రూపం విశిష్టం జీవితం సంస్థితం చ ।**
**భూమౌ గతం పూజయితా మప్రమేయం**
**సదా హి తస్మి న్నివసామీతి దేవాః ॥**

**– మహాభారతమ్, మౌసలపర్వం, అధ్యా-5, శ్లో. 34**

"ఓ దేవతలారా! నా జీవితం ముగిసినది (అవతార సమాప్తి అయినది) చతుర్భుజములతో (శ్రీనివాసుని రూపంలో) ఉన్న ఈ ఆకృతి భూమిని చేరి శాశ్వతముగా ఉండగలదు. ఈ అర్చాస్వరూపమును పూజించవలసినది. ఆ రూపంలో నేను సదా నివసిస్తాను" అని భగవంతుడు అశరీరవాణి రూపంలో వినిపించిన ఈ మాటలు, మహాభారతంలోని మౌసలపర్వంలో ఉన్నది. శ్రీవైష్ణవ పరంపరలో గొప్ప ఆచార్యులైన శ్రీవేదాంతదేశికుల వారు, తాము రచించిన 'తత్త్వమాతృక' అనే గ్రంథంలో ఇదే విషయాన్ని ఉటంకించారు. శ్రీకృష్ణుని అవతార సమాప్తితో భూలోకమున స్వామివారి రూపమును దర్శించలేమని దుఃఖంతో బ్రహ్మాది దేవతలు స్వామివారిని పరిపరి విధాలుగా ప్రార్థించగా, పై విధంగా భగవంతుడు వారి ప్రార్థనకు సమాధానమిచ్చాడు. శిలారూపంలో ఉన్న శ్రీనివాసుని విగ్రహంలో భగవంతుడు తన సాన్నిధ్యము సదా ఉండగలదని స్వయముగా చెప్పినందువలన, భగవంతుని అర్చామూర్తికి చేసే పూజలు కూడా ముక్తిప్రదములు అవుతాయి.



దీనిని నిర్ధారించడానికి అన్నట్లుగా నేటికి తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతినిత్యము ఏకాంతసేవ అనంతరం శ్రీవారిని బ్రహ్మాది దేవతలు అర్చించి పూజిస్తారని విశ్వాసము, సంప్రదాయము, ఐతిహ్యము అతిబలముగా ఉన్నది. ఉదయం ప్రాతఃకాల ఆరాధనా సమయంలో ఆకాశగంగా తీర్థము నుండి తేబడిన పవిత్ర జలమును, ఒక పెద్ద బంగారు బిందెలో నింపి ఉంచి, ఆ తీర్థజలమును, శ్రీవారి కుడిచేతికి స్పృశింపజేసి, అభిమంత్రించి తులసీదళములు ఆ తీర్థంలో వేసి మూసి ఉంచుతారు. ఈ బంగారు బిందెలోని సాక్షాత్తూ శ్రీవారిచే స్వయంగా అభిమంత్రించబడిన పవిత్ర జలమును, రాత్రి ఏకాంతసేవ సమయంలో వైఖానస అర్చకస్వామి, గర్భాలయంలోని అయిదు బంగారు పంచపాత్రలలో నింపి ఉంచుతారు. అలాగే శ్రీవారి ఆరాధన నిమిత్తం, చందనమును కూడా సిద్ధం చేసి ఉంచుతారు. ఏకాంతసేవా అనంతరం బంగారు వాకిలి తలుపులను మూసివేసిన తర్వాత, బ్రహ్మాది దేవతలు స్వామివారికి ఆరాధన చేస్తారని ప్రతీతి. వారి ఆరాధన నిమిత్తమే, బంగారు పంచపాత్రలలో జలము, చందనం సిద్ధంచేసి ఉంచుతారు. ఉదయం సుప్రభాతసేవ సమయంలో రాత్రి జరిగిన దేవతారాధన తర్వాతి తీర్థాన్ని 'బ్రహ్మతీర్థంగా' భక్తులకు వినియోగం చేస్తారు. అందుకే ఏకాంతసేవా అనంతరం విమానప్రాకారంలో ప్రదక్షిణం చేయకూడదని ఆలయంలో కట్టడి ఉన్నది. ఎందుకంటే ఆ సమయంలో శ్రీవారి ఆరాధనకై వచ్చే దేవతలు సంచరిస్తారు కనుక, వారి ఏకాంతానికి భంగం కలుగకుండా, ప్రదక్షిణలు ఆ సమయంలో చేయకూడదని శాసనం చేయబడి ఉన్నది. తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనాటికి ఇటువంటి విశిష్టమైన సంప్రదాయాలు, ఐతిహ్యాలు పాటింపబడుతూ ఉన్నాయి.

ఇలా కొంతకాలం గడిచినది. ఆ సమయంలో దేశాన్ని సూర్యవంశరాజైన శంఖణుడనే మహారాజు పరిపాలించేవాడు. శంఖణుడు

బహుశాస్త్రకోవిదుడు మరియు సాత్త్వికబుద్ధి కలిగి, ఎప్పుడూ విష్ణుచింతన చేసేవాడు. శంఖణ మహారాజుకి చిరకాలం నుండి ఒక కోరిక ఉండేది. అదేమిటంటే, సూర్యచంద్రులూ, భూమి స్థిరంగా ఉండేంతవరకు, సర్వవ్యాపియైన శ్రీమన్నారాయణునికి నేను చేసిన కైంకర్యం స్థిరంగా ఉండాలి అని. ఎలాగైనా తన కోరికని నెరవేర్చుకోవాలని నిశ్చయించుకుని, రాజ్యాధికారాన్ని పుత్రునికి అప్పగించి, వసిష్ఠ మహర్షిని ప్రార్థించి తరుణోపాయమును కోరుతాడు. వసిష్ఠుడు, 'ఓ రాజా! వేంకటాచలమును చేరి, అక్కడ శ్రీమన్నారాయణుని పాదారవిందములపై దృష్టి నిలిపి తపస్సు చేయవలసినది, శ్రీమన్నారాయణుడు తప్పక నీ కోరికను నెరవేర్చగలడు' అని ఉపాయం సెలవిస్తాడు. అంతట శంఖణ మహారాజు వేంకటాచలమును చేరి, వసిష్ఠుడు చెప్పిన విధంగా స్వామి పాదపద్మముల యందు ఏకాగ్రచిత్తుడై తపస్సు చేయసాగినాడు. అదే సమయానికి అక్కడ అగస్త్య మహర్షి కూడా స్వామివారిని దర్శించాలని వేంకటాచలంలో తపస్సు చేస్తూ ఉన్నాడు. వీరిరువురి తపస్సుకి సంతోషించి ఒక శుభదినమున శ్రీ శ్రీనివాస భగవానుడు ప్రత్యక్షమై, శంఖణుడికి ఈ విధముగా వరము ఇచ్చినాడు.

**అర్చావిగ్రహరూపోఽహం సచ్చిదానందవిగ్రహః ।**
**స్వయంవ్యక్తప్రదేశేషు దృశ్యో బ్రహ్మాదియోగినామ్ ॥**

**తామేవ ప్రతిమాం కేచిత్ జానన్తి నృపపుంగవ ।**
**తథాత్వేనాపి వా యోగ్యం దర్శనం మే కలౌయుగే ॥**

**విమానఞ్చ శిలాదారు లోహేష్టకచితం కురు ।**
**ప్రతిమాఞ్చ శిలారూపాం తాం పశ్యన్తి కుయోగినః ॥**

**సాక్షాత్పూజాశ్రయో నిత్యం అహం బిమ్బాన్తరేణ చ ।**
**యథాదృష్టం విమానం తే మద్రూపం పురుషర్షభ ॥**



**తేనోక్తమార్గేణ విధాయ పుణ్యం విమానవర్యం ప్రతిమాఞ్చ పుణ్యామ్।**
**ప్రఖ్యాప్య శఙ్ఖో నరలోకసఙ్ఘే జగామ విష్ణోః పదమవ్యయం శుభమ్॥**
**(బ్రహ్మపురాణం, తృతీయోఽధ్యాయం, శ్లో. 44,45,47,49,51)**

శ్రీమన్నారాయణుడు శంఖణ మహారాజుతో – "రాజా! నామాట వినుము. సచ్చిదానందమూర్తినగు నేను అర్చారూపంలో స్వయంవ్యక్తంగా వెలసిన స్థానములలో బ్రహ్మాది యోగీంద్రులు మాత్రమే నన్ను దర్శించగలరు. ఆ స్వరూపమును కేవలం ప్రతిమగా కొందరు అనుకుంటారు. కలియుగంలో విగ్రహారాధన చేయడమే సమంజసము. అందుచేత నీవు నా విగ్రహం సురక్షితంగా ఉండడం కోసం విమానంతో కూడిన ఆలయాన్ని శిలతో, కొయ్యతో, మట్టితో, ఇటుకలతో నిర్మించి ప్రతిష్ఠించుము. సామాన్య ప్రజలు దానినే సందర్శిస్తారు. కుయోగులు దానిని కేవలం శిలామాత్రమని భావించి ఉదాసీనులవుదురు. సూర్యుడు తన కిరణములచే భూమిలోని జలముల సారాన్ని గ్రహిస్తాడు. అదేవిధంగా నేను నిష్కలరూపియైనప్పటికినీ, విగ్రహరూపమున భక్తుల పూజలను స్వీకరించి, వారికి సరైన ఫలితములను వరముగా ఇవ్వగలను. కనుక రాజా! నేను చెప్పిన విధంగా ఆలయాన్ని నిర్మించి, శాస్త్రోక్తంగా నా అర్చారూపమును ప్రతిష్ఠించి, ఆరాధన చేయగలవు. తప్పక నీవు కోరిన ఫలము లభించగలదు" అని ఆజ్ఞాపించి అంతర్ధానమొందెను. భగవానుడు ఆదేశించిన విధంగా శంఖణ మహారాజు, శ్రీనివాసుని విగ్రహమును, ఆనంద నిలయ విమానంలో ప్రతిష్ఠించి, ఆరాధనలు చేసి కృతయుగం నుండి కలియుగం వరకు మనుష్యులలో భగవద్విభూతిని, మహిమలను ప్రచారం చేసి, శాశ్వతమైన వైకుంఠంలో స్థానాన్ని పొందినాడు.

ఇలా కొంతకాలం గడవగా, యుగాంత ప్రళయం సంభవించింది. ఈ ప్రళయం ఏ విధంగా ఉంటుందో, వరాహ పురాణాంతర్గత

శ్రీ వేంకటాచల మాహాత్మ్యం వర్ణిస్తున్నది. సనాతన ధర్మ కాలనిర్ణయం ప్రకారం, బ్రహ్మకి 1 రోజు, రెండు కల్పములు. అలాగే ఒక కల్పంలో 14 మన్వంతరాలుంటాయి. ఈ ప్రళయం అనేది బ్రహ్మకి రాత్రి కాలంలో సంభవిస్తుంది. సుమారు 100 సంవత్సరాల వరకు భూమండలమంతా తీవ్రమైన కరువు సంభవించింది. పంటలన్నీ ఎండిపోయి ఆహారం దొరకడం నిలిచిపోయింది. సూర్యుడు ప్రచండమైన తేజస్సుతో మండే అగ్నిగోళంలా నిప్పులు కురిపించగా, ఆ జ్వాలలధాటికి భూమిపై ఉండే నగరాలు, పర్వతాలు, చెట్లు, అడవులు అన్నీ దగ్ధమయ్యి బూడిదగా మారినది. అనంతరము సర్వవ్యాపియైన వాయుదేవుడు కొన్ని సంవత్సరములపాటు ప్రచండంగా గాలులను వీచాడు. తర్వాత మహాబలశాలులైన మేఘములు, స్తంభముల వంటి నీటిధారలతో కొన్ని సంవత్సరములపాటు ఎడతెగని వర్షములను కురిపించాయి. రాత్రి ప్రారంభ సమయమున భూమి మొత్తం కరిగిపోయి పాతాళంలోకి ప్రవేశిస్తుంది. ఆ సమయంలో ఏడు సముద్రములు కలిసి ఒకటైపోతుంది. మహర్లోకమంతా జలమయమై నాలుగువేల యుగములు బ్రహ్మకు రాత్రిగా ఉంటుంది.

**నిశావసానే గోవిన్దస్సృష్టిస్థిత్యన్తకారకః ।**
**చతుర్ముఖశివాశక్యం భూమేరుద్ధరణం హరిః ॥**

**కర్తుకామస్తదా విష్ణుః వటపత్రతలే స్థితః ।**
**శ్వేత వరాహదేహం చ సర్వయజ్ఞమయం శివమ్ ॥**

**(వరాహపురాణం 1-28, 29)**

రాత్రి తెల్లవారగానే, వటపత్రమున పవళించియున్న సృష్టి స్థితిలయకారకుడైన శ్రీమన్నారాయణుడు, బ్రహ్మరుద్రాదుల కశక్యమై, భూమాతను ఉద్ధరించడానికై సర్వయజ్ఞస్వరూపము, మంగళకరము,



మహారౌద్రముయైనటువంటి శ్వేత వరాహరూపమును ధరించి భూమిని ఉద్ధరించి యథాతథముగా నిలిపెను. ఇది కల్ప ప్రారంభమున వచ్చిన కల్పాంత ప్రళయము. ఇదేవిధంగా శంఖణ మహారాజు కాలంలో యుగాంత ప్రళయం సంభవించి భూమండలమంతా జలమయమైనది. ఈ సమయంలో మనకొక సందేహం కలుగవచ్చు. ఇంతటి ఘోరప్రళయం సంభవించినప్పుడు శ్రీనివాసుని అర్చారూపమునకు ఏవిధమైనటువంటి హాని కలుగలేదా? అని దీనికి సమాధానంగా శ్రీ వేంకటాచల మాహాత్మ్యం – బ్రహ్మపురాణం ఆ సమయంలో ఏం జరిగినదో అద్భుతంగా వర్ణిస్తుంది.

ఈ శ్వేతవరాహ కల్పమున, 7వదైన వైవస్వత మన్వంతరంలో, 25వ మహాయుగంలోని కలియుగంలో, ఒక వైఖానస సద్బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. హరిద్రానదీతీరమందు గల శ్రీకృష్ణుని ఆలయ సమీపంలో ఈ వైఖానసుడు నివసించేవాడు. అప్పుడు దేశాన్ని ధృతవర్మ అనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. గొల్లపిల్లవాని వేషముతో శ్రీకృష్ణుడు ఆ ఆలయంలో వేంచేసి పూజలందుకొంటున్నాడు.

**పురా కశ్చిద్ద్విజవరః ఆసీద్వైఖానసో నృపః ।**
**కృష్ణక్షేత్రే చోళదేశే యా హరిద్రానదీ శుభా ॥**

**తత్తీరే వర్తతే ప్రీత్యా హరిర్గోపాలవేషవాన్ ।**
**తప్తే తపసి చోళేన 'ధృతవర్మా'భిధేన చ ॥**

**(బ్రహ్మపురాణం 7-11,12)**

హరిద్రానది కావేరీ నదికి ఉపనది. బ్రహ్మపురాణంలో చోళదేశే హరిద్రా నది అని చెప్పబడియున్నందువలన, ఈ ఆలయం ప్రస్తుత తమిళనాడు రాష్ట్రంలో ఉండేదని తెలుస్తున్నది. పూర్వం 'చోళనాడు'గా పిలువబడే ఈ ప్రాంతం కావేరీ నదీపరీవాహక ప్రాంతాల్లో భాగంగా ఉండేది. ఉరైయూరు (తిరుచ్చిరాపల్లి), తంజావూరు, గంగైకొండ

చోళపురం మొదలైన ప్రాంతాలను రాజధానులుగా చేసుకుని చోళరాజులు పరిపాలించినట్లు చరిత్ర తెలుపుతుంది. పై చెప్పబడిన గుర్తుల వల్ల, ఇక్కడ ప్రస్తావించిన శ్రీకృష్ణుని ఆలయం, తమిళనాడులోని మన్నార్ గుడి శ్రీరాజగోపాలస్వామి (కృష్ణక్షేత్రం) వారి ఆలయంగా నిర్ధారించవచ్చు. ఈ ఆలయంలోని పశువుల కాపరి వంటి గోపాలబాలుని వేషంలో శ్రీరాజగోపాలస్వామివారు (శ్రీకృష్ణుడు) దర్శనమిస్తారు.

ఇక్కడ చెప్పబడిన వైఖానస బ్రాహ్మణుడిని, తిరుమల శ్రీవారి ఆలయ అర్చక వంశీయుల చరిత్రలో 'చెంగలవాయి' అని పేర్కొనబడినాడు. చెంగలవాయికి శ్రీకృష్ణుడంటే అపరిమితమైన భక్తి. కృష్ణావతారంలో స్వామివారు జరిపిన లీలలను అభిమానిస్తూ వాటి గురించి చదువుతూ, పాడుతూ ఉండేవాడు. ఆలయంలో శ్రీకృష్ణ రూపంలోని శ్రీరాజగోపాలస్వామి వారిని శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా నిత్యం పూజించేవాడు. అతనికి జీవితంలో ఒకే ఒక కోరిక ఉండేది. అదేమిటంటే, విష్ణుభగవానుడిని శ్రీకృష్ణుని రూపంలో తనివితీరా దర్శించాలనే బలమైన కోరిక. అందుకోసం శ్రీకృష్ణుని మీదనే ధ్యాస నిలిపి తపస్సు చేయనారంభించాడు. శ్రీమన్నారాయణుడు, చెంగలవాయి భక్తికి ప్రసన్నుడై అతని ఎదుట శ్రీకృష్ణరూపంలో సాక్షాత్కరించి క్షణకాలం మాత్రమే అతనికి కృష్ణరూపంలో దర్శనమిచ్చి అంతర్ధానమవుతాడు. ఆ దర్శనంతో చెంగలవాయి సంతృప్తి చెందక, శ్రీకృష్ణుణ్ణే ధ్యానిస్తూ ఆ రాత్రి నిద్రకుపక్రమిస్తాడు. అంతట శ్రీమహావిష్ణువు అతనికి కలలో కనిపించి ఈ విధంగా పలుకుతాడు.

**ముక్త్యర్థం ప్రీతిమాన్ విష్ణో తస్య స్వప్నే హరిః స్వయమ్ ।**
**త్వయా ధ్యేయః శ్రీనివాసో నాహం ధ్యేయో ద్విజోత్తమ ॥**

"ఓ యీ చెంగలవాయి! నీ తపస్సు వలన నేను సంతుష్టుడైనాను. నువ్వు పరిపూర్ణంగా నా అనుగ్రహాన్ని పొందినవాడవు. దేవతలకు కూడా



ఎంతో దుర్లభమైన నా దర్శనం, నీ యొక్క గొప్ప తపస్సు వలన, నీకు కలిగినది. నీ సూత్రకర్తయైన విఖనస మహర్షి నాకత్యంత ఇష్టుడు. నువ్వొక గొప్ప వంశానికి చెందినవాడవు. నీవు నిత్యం నా నామస్మరణ చేస్తూ, నాకు కైంకర్యాలు చేయడానికే నీ జీవితమంతా ధారపోసినావు. అందువల్లనే నీవు కోరిన వెంటనే శ్రీకృష్ణరూపంలో నా దర్శనమును నీ కనుగ్రహించినాను. అయితే సనాతనధర్మం ప్రకారం, మానవునిగా జన్మించినవాడు, మోక్షసాధన సరైన దారిలో చేయవలెనన్న, వారి వారి వర్ణాశ్రమధర్మాలు మరియు శాస్త్రములలో చెప్పబడిన సూత్రముల ననుసరించి చేయవలెను. ఏదో నీ మనస్సులో నీకనిపించింది కదాని వేరు విధముగా సాధనలు చేయరాదు. మంత్రశాస్త్రములో 'అర్వణము' అని ఒక సిద్ధాంతమున్నది. అర్వణం ప్రకారం, ఆయా నక్షత్రము, రాశిలో జన్మించి, తదనుగుణ స్వభావము కలిగిన మానవులు, తత్సంబంధితమైన దైవమును ఆరాధించవలెను. ఈ సూత్రమును అందరునూ అనుసరించవలెను. ఇది ఆయా మానవుడు నివసించు కాలం మరియు దేశంమీద కూడా ఆధారపడుతుంది.

స్థూలంగా 'అర్వణము' అంటే ఎవరికి ఏది సరిగ్గా ఉండునో చెప్పే ఒక సిద్ధాంతము. ఈ సిద్ధాంతము ప్రకారం, మానవుడు తన నక్షత్రము, రాశికి సంబంధించి ఏ దైవమును ఆరాధించుటకు అర్వణ బలమున్నదో ఆ దైవమును ఉపాసించినచో తన జన్మను కృతార్థం చేసికొనగలడు. అందరికీ ఇదే సూత్రము, వారి జాతకం ప్రకారం వేరే వేరే విధములుగా ఉండును. ఇది ఎలా అంటే ఒకే ఔషధము అందరి వ్యాధులను నయం చేయలేదు. వారి వారి దేహధర్మాలననుసరించి మోతాదు ప్రకారం ఔషధమును వాడిన రోగము నయమవును. అట్లుగాక వేరొక విధముగా ప్రవర్తించిన, అది మనకు హానిని కలుగజేయును. అందువలన నీవున్న ప్రదేశము, కాలము మరియు నీ సాత్త్విక స్వభావము,

నక్షత్రము, రాశిననుసరించి శ్రీకృష్ణ ఆరాధన నీకు యుక్తము కాదు. అటువంటి ఆరాధనకు నీకు అర్పణ బలం తక్కువగా ఉన్నది. కానీ నా రూపమును ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపాసించవలెనన్న నీ కుతూహలమును నేనర్థం చేసుకోగలను. కనుక నేను నీకు తరుణోపాయము చెప్తాను, నిరాశకు, అసంతృప్తికి లోను కావద్దు.

**ముక్త్యర్థం ప్రీతిమాన్ విష్ణో తస్య స్వప్నే హరిః స్వయమ్ ।**
**"త్వయా ధ్యేయః శ్రీనివాసో నాహం ధ్యేయో ద్విజోత్తమ! ॥**

**యో యోగ్యో యస్య జీవస్య తేన ధ్యేయః స ఏవ హి ।**
**యోగ్యోపాసనయా జీవా ముక్తిం యాంతి న సంశయః ॥**

**అభిధా శ్రీనివాసస్య తవ యోగ్యా ద్విజోత్తమ ।**
**వేంకటాద్రిం తతో గచ్ఛ శ్రీనివాసః స్వయం హరిః ॥**

**స్వామిపుష్కరిణీతీరే రమయా సహ మోదతే" ।**
**ఇత్యాహ భగవాన్ కృష్ణః పునః స్వప్నాంతరేఽ వదత్ ॥**

**(బ్రహ్మపురాణం, 7వ అధ్యాయం 16-19)**

"ఓయి చెంగలవాయి! తక్షణమే నీవు వేంకటాచల క్షేత్రమునకు వెళ్ళవలసినది. శ్రీనివాస మంత్ర పురశ్చరణము నీకు అన్ని విధముల తగిన ఉపాసనా మార్గము. వేంకటాద్రి యందు స్వామిపుష్కరిణీ తీరమునందు లక్ష్మీసమేతుడై శ్రీనివాసుడు కొలువై ఉన్నాడు" అని చెప్పి, ఇంకా ఈ విధముగా చెప్పి విశదీకరించెను.

**పురా కృతయుగే పశ్చాద్భాగే శఙ్ఖేన వై కృతమ్ ।**
**విమానం కల్పప్రళయే నష్టప్రాయమభూద్ద్విజ ॥**

**వల్మీకస్యాంతరే విష్ణోః ప్రతిమా వర్తతే శుభా ।**
**శఙ్ఖేన నిర్మితా పుణ్యా సర్వపాపహరాఽ మలా ॥**



**జానుమాత్రే నిమగ్నా హి తింత్రిణీవృక్షమూలతః ।**
**ధనుర్ద్వయాంతరే పుణ్యం భూతీర్థం వర్తతే శుభమ్ ॥**

**(బ్రహ్మపురాణం 7-20-21,22)**

"క్రిందటి కృతయుగమున శంఖణ మహారాజుచే వేంకటాద్రి యందు నిర్మించబడిన శ్రీనివాసుని దివ్యవిమానంతో కూడిన ఆలయ ప్రాకారాదులు, యుగాంతమున సంభవించిన ప్రళయము వలన శిథిలములై పడిపోయియున్నవి. అప్పుడు ఆ ఆలయమునందు శంఖణ మహారాజుచే ప్రతిష్ఠింపజేయబడిన శ్రీనివాసుని దివ్యమంగళ అర్చా రూపము, నా సంకల్పము వలన వల్మీకము (చీమలపుట్ట) నందు సురక్షితముగా ఉన్నది. ఆ దివ్యమంగళ అర్చావిగ్రహము స్వామిపుష్కరిణికి దక్షిణ తీరమునందు, ఒక చింతచెట్టు క్రింద, మోకాటిలోతు వరకు కప్పబడిన వల్మీకముతోసహా కాపాడబడియున్నది. ఆ ప్రదేశమునకు రెండు ధనువుల దూరమున 'భూతీర్థము' కలదు. ఈ తీర్థము శ్రీవారికి నివేదించు అన్న ప్రసాదములను తయారు చేయుటకు ఉపయోగించే నీటికొరకు భూదేవి అమ్మవారిచే నిర్మితమైనది. భూతీర్థము ప్రక్కన చింతచెట్టుకు వాయవ్యదిక్కున నివసిస్తున్న 'గౌతమీ' అనే ధేనువు (ఆవు) ఆ దివ్యవిగ్రహమూర్తిని తన క్షీరములచే ఆరాధించుచున్నది. నీవు ఈ గుర్తులను వేంకటాద్రియందు పరిశీలించి, ఆ మూర్తిని ఆగమశాస్త్రోక్తంగా వల్మీకము నుండి వెలికితీసి, శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా ప్రతిష్ఠా సంప్రోక్షణాదులను జరిపి, ఆరాధనలు నిర్వహించుము. అలాగే నీవు శేషాచలమునకు పోవు సమయమునకు, సరిగా పాండ్యదేశము నుండి రంగదాసుడను పేరుగల ఒక భాగవతుడు నిన్ను కలవగలడు. నీవు ఈ మహారణ్యమున ఏకాకిగా ఉండి కాలము గడుపవలెనని దిగులుగాని, భయము గాని చెందవద్దు. ఈ రంగదాసుడనే నా పరమభక్తుడు, నీవు

చేసే కైంకర్యములకు సహాయకారిగా ఉండగలడు. అతని సహాయముతో మీరిద్దరునూ నన్ను ఆరాధించవలసినది. మీ ఉభయులకు ఇష్టసిద్ధి నెరవేరుతుంది" అని చెప్పి భగవానుడు

**ఏతావదుక్త్వా స్వప్నే తు 'గోపీనాథేతి' నామ చ ।**
**దదౌ తస్య ప్రియం విష్ణుః సోఽతిబుద్ధ్వాఽతివిస్మితః ॥ (7-27)**

ఆ స్వపములోనే చెంగలవాయిని ఉద్దేశించి "ఇకమీదట నీవు 'గోపీనాథుడు' అనే పేరుతో పిలువబడుతావు. నా ఆలయ మొదటి అర్చకుడిగా నా కైంకర్యములను శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా ప్రారంభించి, నీ పుత్రపౌత్రాది పరంపరగా, అవిచ్ఛిన్నంగా ఈ కైంకర్యములు జరుపవలసినది" అని పలికి అంతర్ధానమయ్యెను. స్వామి కైంకర్యములనే ఒక దీక్షగా చేపట్టి, పరంపరగా నిర్విఘ్నంగా ఈ కైంకర్యములను నిర్వహించడం వలన గోపీనాథుడు 'గోపీనాథ దీక్షితులు' గా అన్వర్థ నామధేయముతో పిలువబడెను.

స్వప్నము నుండి లేచిన గోపీనాథుడు సంభ్రమాశ్చర్యములకు లోనయి, శ్రీనివాసుడికి తనపై గల కృపకు పరమానందభరితుడై వెంటనే వేంకటాద్రికి ప్రయాణమవుతాడు. మార్గమధ్యంలో భగవానుడు చెప్పినట్లు పాండ్యదేశం నుండి వేంకటాద్రికి వస్తున్న 'రంగదాసుడు' అనే భక్తుడిని కలుసుకుంటాడు. ఇరువురు పరమాత్మ వారికి సాక్షాత్కరించి చెప్పిన ఆదేశమును భక్తిపూర్వకంగా ఒకరికొకరు చెప్పుకుని వేంకటాచలయాత్రని కొనసాగిస్తారు. వారిద్దరూ అలాగే నడుస్తూ దట్టమైన అడవి ప్రాంతంలో, మొదటి కొండలోని ఎత్తైన ప్రదేశానికి చేరుకుంటాడు. ఇది మనకు, భగవదనుగ్రహపాత్రులైన, శ్రీవైష్ణవ భక్తాగ్రేసరులు ఆళ్వార్లు, తిరుమల కొండ గురించి భక్తిపారవశ్యంతో కీర్తిస్తూ వర్ణించిన పాశురాలను గుర్తుకు తెస్తుంది. తిరుమల కొండలు ఎక్కడానికే అత్యంత దుర్గమమైన ఎక్కుడు కలిగి, దట్టమైన అడవులలో మదపుటేనుగులు, అడవిపందులు స్వేచ్ఛగా



విహరిస్తూ తిరుగాడుతుండేవని ఆళ్వార్ల వర్ణనం ద్వారా తెలుస్తుంది. కొండ ప్రాంతంలో మరింత లోపలికి వెళ్తే వేటకోసం తిరుగాడుతున్న చిరుతలు, సింహాల గాండ్రింపులు వినిపిస్తాయి. అప్పట్లో చుట్టూ ఉన్న ప్రజల విశ్వాసం ప్రకారం ఈ కొండలన్నీ సాక్షాత్తూ విష్ణుస్వరూపంగా, పూజనీయంగా భావింపబడేవి. అలాగే ఈ ప్రాంతమంతా, కొండలతో నిండి ఎత్తైన పర్వతాలు, దట్టమైన కీకారణ్యంతో మొత్తం శేషాచలం అడవులలో భాగంగా ఉన్నది. ఈ పర్వతశ్రేణిలోని కొన్ని ప్రాంతాలకు వెళ్ళడం మానవమాత్రులకు దుస్సాధ్యమైనదిగా ఉండేది. వేంగడం కొండలు మొత్తం భారీకాయంతో ఉన్న నల్లటి ఏనుగులు, విషసర్పాలు, అడవి పందులు, వివిధ జాతుల కోతులు, సింహాలు, చిరుతలు స్వేచ్ఛగా సంచరిస్తూ, మనుష్యులు వెళ్ళాలంటే భయంగొల్పే విధంగా ఉండేది. కొండప్రాంతంలోని లోయలు, పొదవాటి వెదురు పొదలతో, ఆకాశాన్నంటే విధంగా ఉన్న వృక్షజాతులతో, కూలిపోతూ మళ్ళీ చిగురిస్తూ, పెరుగుతూ ఉన్న ఎత్తైన చెట్లతో నిండి, పచ్చని ప్రకృతి ఆహ్లాదకరంగా కనిపిస్తూ ఉన్నవి. కొండలలోని అడవులు దాదాపు ఆకాశాన్నంటిన్నట్లున్నవి. పదుల సంఖ్యలో అందమైన సెలయేళ్ళు, జలపాతాలు యిరువైపులా పూలచెట్లు, లతలతో అల్లుకుపోయి ప్రవహిస్తూ, భారీవర్షాల వల్ల అవే ఉధృతమైన ప్రవాహాలలాగా మారి ప్రవహిస్తూ ఉన్నవి. సంవత్సరంలో దాదాపు పూర్తి కాలం, చిక్కటి మంచుదుప్పటి పరిచినట్లుగా, అక్కడి చెట్లు, చేమలన్నీ చల్లగా, మంచి సువాసనలతో నిండి ఉన్నాయి. తుమ్మెదలు, తేనెటీగలు ఘూంకారాలు చేస్తూ, పుష్పాలలో జారిపోతున్న తేనె బిందువులను జుర్రుకుంటూ ఉన్నాయి. అక్కడున్న తటాకాలలో అందమైన తామరలు గాలికి తలాడిస్తున్నట్లు అటు యిటు కదులుతూ, వచ్చినవారిని పలకరిస్తున్నట్లుగా ఉన్నవి.

తిరుమల కొండలలోని రమణీయ సౌందర్యంతో అలరారుతున్న ప్రకృతి అందాలను, అక్కడి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదిస్తూ, గోపీనాథుడు మరియు రంగదాసు స్వామిపుష్కరిణి చేరుకుంటారు. శ్రీవారు వివరించిన గుర్తుల ఆధారంగా, వారు చీమలపుట్టలో మోకాలి లోతు వరకు కప్పబడిన, శ్రీవారి స్వయంవక్త అర్చామూర్తిని కనుగొంటారు. దేవతలకు కూడా దుర్లభమైన ఈ మహద్భాగ్యానికి ఆనందిస్తూ, వారిరువురూ స్వామివారికి సాష్టాంగ దండప్రణామంతో నమస్కరించి, పరి పరి విధాలుగా స్తోత్రం చేస్తారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యసాలగ్రామ అర్చామూర్తికి మొట్టమొదటి కైంకర్యంగా గోక్షీరంతో అభిషేకాన్ని నిర్వహిస్తారు. ఇదే ఈ కలియుగంలో శ్రీవారికి జరిగిన మొదటి కైంకర్యంగా నిలిచినది. ఆగమశాస్త్రాన్ని అనుసరించి వల్మీకమునందు కనుగొన్న అర్చావిగ్రహాదులను, ఆ వల్మీకమునందున్న మట్టిని, పలుగు పారతో తొలగించకూడదు. వల్మీకము పూర్తిగా కరిగిపోయేంత వరకు ఆవుపాలతో అభిషేకించాలి. కనుక అదేవిధంగా గోపీనాథ దీక్షితులు ఆవుపాలతో, పుట్టపూర్తిగా కరిగి, శ్రీవారి అర్చావిగ్రహం పూర్తిగా తెలియునంత వరకు అభిషేకించాడు. అలాగే శ్రీ వైఖానస భగవచ్ఛాస్త్రాన్ననుసరించి, విగ్రహప్రతిష్ఠకి గ్రాహ్యమైన భూమి కొరకు, వైఖానస సంహితలలో వివరించిన విధంగా శాస్త్రోక్తంగా భూపరీక్షను నిర్వహిస్తాడు. శ్రీవారి అర్చావిగ్రహం స్వామిపుష్కరిణికి దక్షిణతీరంలో లభించింది (ప్రస్తుత లడ్డు కౌండర్లు ఉన్న ప్రాంతం – శ్రీవారి ఆలయానికి ఉత్తరం వైపున్నది). గోపీనాథ దీక్షితులు ఆగమశాస్త్రం ప్రకారం దేవాలయ నిర్మాణానికి యోగ్యమైన చతురస్రాకారంగా ఉన్న, స్వామిపుష్కరిణికి పశ్చిమంగా (ప్రస్తుతం ఉన్న) భూమిని ఎంపిక చేస్తాడు. ఆ భూమిని శబ్ద–స్పర్శ–రూప–రస–గంధాలతో పరీక్షించి తులసీ, దర్భ, సుపుష్ప ఫలవృక్షాలతో విరాజిల్లుతున్న, ఆ భూమిని శ్రీవారి విగ్రహం ప్రతిష్ఠించుట కొరకు ఎంపిక చేసి, తదుపరి ఆగమశాస్త్రోక్తంగా కర్షణ



(ఆలయానికి ఎంపిక చేసిన భూమిని శాస్త్రోక్తంగా దున్నటం) అనే వైదిక క్రియను నిర్వహించినాడు.

గోపీనాథ దీక్షితులు, రంగదాసుడు ఇరువురూ ఆ భూమిని చదును చేసి, భవిష్యత్తులో ఇది పెద్ద ఆలయంగా రూపుదిద్దుకున్నా ఎటువంటి ఇబ్బందిలేని విధంగా, గర్భగృహానికి ఉద్దేశించిన స్థలమునకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి, శ్రీవారి యొక్క అర్చావిగ్రహమును, నిర్ణయించిన స్థలము నందు అంటే స్వామిపుష్కరిణికి పశ్చిమం వైపు, బింబస్థాపన గావించినారు. వైఖానస సంహితలను అనుసరించి బింబమునకు 1½ రెట్లు కొలతలతో గర్భగృహ కొలతలను నిర్ణయించి, నాలుగువైపుల, స్తంభములను ఏర్పరచి, గోడలను మట్టితో నిర్మించి, పైకప్పును రెల్లుగడ్డి, ఆకులతో ఏర్పరిచి, ఒక తాత్కాలిక దేవాలయ, గర్భగృహం మాత్రం నిర్మించినారు. అనంతరం గోపీనాథ దీక్షితులు వైఖానస ఆగమోక్తంగా ఆహ్నిక నియమంతో (9 రోజులు నవాహ్నిక, 5 రోజులు – పంచాహ్నిక) ప్రతిష్ఠాక్రియాసరళిలో చెప్పబడిన విధంగా వైదిక క్రియలను ఆచరించి, శ్రీ వేంకటేశ్వర స్వామివారి స్వయంవ్యక్త సాలగ్రామ శిలావిగ్రహమును ప్రతిష్ఠించి, మొదటి ఆరాధన లేక తోమాలసేవను నిర్వహించినాడు. ఆనాటి నుండి గోపీనాథ దీక్షితులు ప్రతినిత్యము ఉదయంతో ప్రారంభించి సాయంత్రము వరకు, వైఖానసాగమోక్తంగా ఆరాధన చేయసాగాడు. ఆరాధనకు కావలసిన పుష్పములు, ఫలములు వంటి ద్రవ్యములు, పరిసరాలను శుభ్రపరచుట మొదలగు కైంకర్యములు, గోపీనాథ దీక్షితులకు సహాయంగా రంగదాసుడు చేయసాగాడు. భూతీర్థమునకు, స్వామిపుష్కరిణీకి మధ్యనున్న ప్రదేశంలో ఒక ఉద్యానవనమును పెంచి, రంగదాసుడు త్రికాలమందు పుష్పములు తెచ్చి గోపీనాథ దీక్షితులుకివ్వగా, ఆతడు వైఖానససూత్రవిధిననుసరించి శ్రీవారికి సమస్త ఆరాధనలు చేయసాగినాడు.

ఒకనాడు నిత్యమువలె రంగదాసుడు పుష్పములు తెచ్చుటకోసం తోటకు పోగా, అచ్చట ఒక గంధర్వుడు వనాంతరమున నానా విలాసభూషితులగు నారీజనముతో క్రీడించు సన్నివేశమును చూసి, చాంచల్యము కలిగి ఆలస్యముగా పుష్పములు తేగా, గోపీనాథుడు అతని ఆలస్యమునకు కోపించగా రంగదాసు భయపడి స్తబ్ధుడై నిలబడిపోయెను. గోపీనాథుడు మళ్ళీ మళ్ళీ రెట్టించి అతనిని కారణం అడుగుతుండగా, దయాసాగరుడైన శ్రీనివాసుడు అశరీరవాణి రూపమున ఇట్లా చెప్పినాడు.

"ఓయీ రంగదాస! కామవంచితమగు మనస్సుకు స్థైర్యము లేదు. స్థైర్యము లేనివాడికి సిద్ధి కలుగదు. నీవు కామభోగాలకు లోనైనావు. ఈ దేహమందు నీకు మోక్షప్రాప్తి కలుగదు. ఈ శరీరము త్యాగం చేసిన తర్వాత మరుజన్మమున నీవు చక్రవర్తిగా పుట్టగలవు. ఇంతకాలం నాకు చేసిన కైంకర్య ఫలితముగా, నీ తరువాతి జన్మమునందు, ఇక్కడే ఆలయమును, ప్రాకారము, మండపము, విమానగోపురములతో చిరస్మారకంగా నిర్మించుతావు. చక్రవర్తిగా సకలమగు ఐహిక సుఖాలను అనుభవించి, నా యందు దృఢభక్తితో తరించెదవు. నీకు జయప్రాప్తికై నా శంఖచక్రములను నీకు సహాయముగా ఇచ్చెదను. దేహాంతమున నా సాన్నిధ్యమునకు శాశ్వతముగా చేరుకొందువు" అని పలికెను. ఈ రంగదాసే మరుసటి జన్మలో తొండమాన్ చక్రవర్తిగా జన్మించి, శ్రీవారికి అనేక కైంకర్యములు చేసి, స్వామివారికి ప్రీతిపాత్రుడయినాడు.

ఈ అధ్యాయం 'శ్రీవారి విగ్రహం ఏనాటిది?' – మొదటిభాగంలో, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్య అర్చావిగ్రహాన్ని మొట్టమొదటిసారిగా కలియుగ ప్రారంభంలో కనుగొన్నది శ్రీవారి ఆలయ ప్రథమ వైఖానస అర్చకుడైన శ్రీమాన్ గోపీనాథ దీక్షితులు అని తెలుసుకున్నాం. తిరుమల క్షేత్రానికి యజమాని శ్రీనివాసుడే. అందుకే వైఖానస ఆగమంలో తెలిపిన



విధంగా ఆలయ నిర్మాణానికి ముందే, గోపీనాథ దీక్షితులుని, శ్రీవారే ఆచార్యునిగా నియమింపజేసి, చోళదేశం నుండి ఇక్కడికి పిలిచి, ఆయన ద్వారా శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాదులు జరిపించాడు. ఇలా కలియుగ ప్రారంభంలోని శ్రీవారి విగ్రహ చరిత్ర శ్రీ వేంకటాచల మాహాత్మ్యంలోని పురాణాల ద్వారా తెలుస్తున్నది.

ఇప్పటివరకు తిరుమల శ్రీవారు కలియుగ ప్రారంభంలో తన సంకల్పంతో మొదటి గర్భాలయం, విగ్రహప్రతిష్ఠ చేయించుకున్నారనే విషయాన్ని చదివాము. అయితే కేవలం కలియుగ ప్రారంభంలో శ్రీవారి గురించి మనకు తెలిసినదా, అంతకుముందు ఏం జరిగినది, అసలు సమస్త చరాచర సృష్టిని తన చిటికెనవేలితో శాసించగల శ్రీవారికి కాలనిర్ణయం చేయగలమా? ప్రతి నిత్యం వేకువజామున తోమాలసేవ, కొలువు అనంతరం శ్రీవారికి శ్రీ వేంకటేశ సహస్ర నామావళితో సహస్ర నామార్చన జరుగుతుంది. అర్చనలో కాలయంత్రే నమః (25 నామము) సమస్త లోకములు, సృష్టి అంతా కాలానికి లోబడి ఉండగా, భగవంతుడు అటువంటి కాలాన్నే శాసించుచున్నాడు. కాలగోప్త్రే నమః (26) – కాలాన్ని రక్షించేవాడు. కాలాయ నమః (27) – కాలాన్ని సంకలితము చేయువాడు. అఖిలాయ నమః (29) – మహాప్రళయకాలమున కూడా ఖిలము (నాశనం) కానివాడు. అఖిలుడు. ఇలా కాలాన్నే తన అధీనంలో ఉంచుకున్న భగవంతుడిని ఏ కాలం వాడు అని విచారించడం ఒకరకంగా అజ్ఞానమే అయినప్పటికినీ, మానవ జీవిత పరిమాణం అతిచిన్నది (100 సం॥ లోపే) కనుక, కాలస్వరూపుడైన భగవంతుడు, ఆయా కాలములలో చేసిన లీలలను తెలుసుకోవడానికే మనం, శ్రీవారిని గురించి కాలవిచారం చేస్తున్నాము.

శ్రీ వేంకటేశ్వర స్వామివారు పరమపవిత్రమైన తిరుమల కొండపై వెలసి ఉన్నారు. తిరుమల కొండలను సాక్షాత్తూ స్వామివారి స్వరూపమని

ఆళ్వార్లు కీర్తించారు. ఈ అప్రాకృత దివ్యపర్వతశ్రేణులు, శ్రీవారే వేరేచోట నుండి భూలోకానికి తెప్పించాడు.

**శ్రీప్రదత్వాత్ శ్రియో వాసాత్ శబ్దశక్త్యా చ యోగతః ।**
**రూఢ్యా శ్రీశైల ఇత్యేవం నామ చాస్య గిరేరభూత్ ॥**
**(వరాహపురాణం అ. 36-34)**

ఈ వేంకటాచల పర్వతం తనను సేవించిన భక్తులకు ఐశ్వర్యం ఇవ్వటం వలన, లక్ష్మీదేవికి నివాసం కావడం వలన, శబ్దశక్తి, అర్థశక్తి, రూఢశక్తి చేత 'శ్రీశైలం' అని ప్రసిద్ధికెక్కినది. ఈ శ్రీశైలాన్నే దాక్షిణాత్యులు 'తిరుమలై' అని పిలుస్తారు.

మనము ప్రస్తుతం శ్వేతవరాహకల్పంలో ఉంటున్నాము. కల్పం ప్రారంభంలో శ్రీమహావిష్ణువు వరాహ అవతారాన్ని ధరించి హిరణ్యాక్షుడనే రాక్షసుని సంహరించి, పాతాళము నుండి పైకి తెచ్చిన భూమండలమును, మునుపటి వలె స్థిరముగా నిలిపి, సప్త సముద్రములను, సప్త కుల పర్వతములను విభజించి ఏర్పరిచి, బ్రహ్మను పిలిచి పూర్వమువలె జగత్తును సృష్టించమని ఆజ్ఞాపించాడు. అంతట వరాహస్వామి లోకాలన్నింటినీ అనుగ్రహించాలని సంకల్పించి, ఒక దివ్యక్షేత్రమున ఆ కల్పాంతము నివసించదలచినాడు. శ్వేత వరాహ విష్ణువు గరుత్మంతుని పిలిచి, శ్రీ వైకుంఠంలో నున్న క్రీడాద్రి పర్వతాన్ని పెకలించి తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు.

**వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః క్రీడాచలో వేంకటనామధేయః ।**
**ఆనీయ చ స్వర్ణముఖీసమీపే సంస్థాపితో విష్ణునివాసహేతోః ॥**
**(మార్కండేయ పురాణము అ. 2-67)**

గరుత్మంతుడు, శ్వేత వరాహరూపియైన విష్ణువు భూలోకమున నివసించుటకై, శ్రీవైకుంఠము నుండి, 'వేంకట' అను పేరుగల 'క్రీడాద్రి' పర్వతమును తెచ్చి, సువర్ణముఖరీనదీ సమీపంలో స్థాపించినాడు.



**వైకుంఠాత్ పరమో హ్యేష వేంకటాఖ్యో నగోత్తమః**
**అత్రైవ నివసామ్యేవ శ్రీభూమిసహితోహ్యహమ్**
**దదామి ప్రార్థితానర్థాన్ మనుజేభ్యః సదా సురాః ॥**
**(వరాహపురాణం)**

దేవతలారా! ఈ వేంకటాద్రి వైకుంఠము కంటే మహిమ గలది. కనుక నేను శ్రీభూదేవులతో ఇక్కడే నివసిస్తాను. మానవుల అభీష్టార్థములను అనుగ్రహిస్తాను అని హితోక్తులు పలికినాడు.

ఇలా సృష్టి ప్రారంభంలోనే వేంకటాచల పర్వతం వెలసినది. ఆ పర్వతం మీద శ్రీవారు ఎప్పుడు వెలిశారనే విషయం శ్రీ వేంకటాచల మాహాత్మ్యమ్ - పాద్మపురాణంలో పేర్కొనబడినది.

**ఇత్థమాత్మభువః కల్పే హార్దామ్భోజభువో హరేః ।**
**ఆదౌ కృతయుగే జంబూద్వీపే భారతవర్షకే ॥**

**గఙ్గాయా దక్షిణే భాగే యోజనానాం శతద్వయే ।**
**పఞ్చయోజనమాత్రే తు పూర్వామ్భోధేస్తు పశ్చిమే ॥**

**మాసే భాద్రపదే విష్ణుతిథౌ విష్ణుసమన్వితే ।**
**సిద్ధయోగే సోమవారే గిరౌ నారాయణాహ్వయే ॥**

**స్వామిపుష్కరిణీతీరే పశ్చిమే భూత్యపశ్చిమే ।**
**బృందారకాణాం బృందైస్తు ప్రార్థితో లోకరక్షకః ॥**
**ఆవిర్బభూవ భగవాన్ శ్రీనివాసః పరః పుమాన్ ।**
**(పాద్మపురాణం అ. 33-123-126)**

ఆది బ్రహ్మకల్పమున, జంబూద్వీప భాగమైన భరతవర్షము నందు, గంగానదికి రెండువందల యోజనముల దక్షిణముననూ, పూర్వ సముద్రమునకు ఐదు యోజనముల పశ్చిమమునకు, నారాయణ

పర్వతము నందు, స్వామిపుష్కరిణికి పశ్చిమ తీరమున, భాద్రపద శుక్ల ద్వాదశి తిథియందు, శ్రవణ నక్షత్రముతో కూడిన సోమవార శుభదినము నాడు, సిద్ధయోగ శుభ సమయమున, బృందారక బృందములచే ప్రార్థింపబడి, పరమపురుషుడైన శ్రీనివాస భగవానుడు, భూలోకమున అవతరించెను అని పాద్మపురాణం పేర్కొంటోంది.

దీనినిబట్టి శ్రీనివాస భగవానుడు సృష్టి ప్రారంభములోనే భూమి మీద అవతరించినట్లు తెలుస్తున్నది. అయితే వేంకటాచల మాహాత్మ్యం ప్రకారం శ్రీవారు వేంకటాద్రిపై మానవరూపంలో సంచరిస్తూ తన భక్తులతో నేరుగా సంభాషించేవాడని గ్రహించవచ్చు. అలాగే విగ్రహరూపంలో తన అర్చాస్వరూపాన్ని ఆయా సమయాలలో తన భక్తాదుల తపస్సుకి, భక్తికి మెచ్చి, వారికి దర్శింపజేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తున్నది. ఇలా శ్రీవారి విగ్రహం ఏ కాలం నాటిది అనే ప్రశ్నను పరామర్శిస్తే, శ్రీవారు మన ఊహకి కూడా అందనంత ప్రాచీనకాలం నుండి వేంకటాద్రి మీద ఉన్నట్లు తెలుస్తున్నది. కృతయుగంలో శంఖణ మహారాజు, త్రేతాయుగంలో పుత్రసంతానం కోసం దశరథ మహారాజు, ద్వాపరయుగంలో పరీక్షిన్మహారాజు, జనమేజయుడు, కలియుగంలో ఆకాశరాజు, తొండమాన్ చక్రవర్తి అనేక ఇతర రాజులు, భక్తులు శ్రీవారిని సేవించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి.

## పురాణాలలో శ్రీనివాసుని విగ్రహ వర్ణన

మానవుడు తను జీవించి ఉన్నంతవరకు ఒక ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడపాలంటే, ఎవరో ఒకరిని మార్గదర్శిగా స్వీకరిస్తాడు. భూమి మీద సాక్షాత్తూ జగత్ప్రభువైన శ్రీమహావిష్ణువు, లోకంలోని జనులందరూ ఎలా నడుచుకోవాలో తాను స్వయంగా మానవజన్మ తీసుకుని రామునిగా, కృష్ణుడిగా మనకు సంస్కారవంతమైన, ధర్మబద్ధమైన జీవన విధానాన్ని ఆచరించి చూపించారు. అటువంటి పవిత్రమైన శ్రీరామావతార కథనానికి ప్రామాణిక గ్రంథం వాల్మీకి రామాయణం, శ్రీకృష్ణావతార కథనానికి పోతన భాగవతం ఆధార గ్రంథాలుగా స్వీకరించబడుతున్నాయి. ఈ క్రమంలోనే శ్రీనివాసుడి అవతరణ, స్వామి దివ్యచరిత్ర, పద్మావతీ శ్రీనివాస కళ్యాణం మొదలైన ఘట్టాలను వివరించే ప్రామాణిక గ్రంథం శ్రీ వేంకటాచల మాహాత్మ్యం. వేదవ్యాసుడు రచించిన అష్టాదశ (18) పురాణాలలో, 12 పురాణాలలో వేంకటాచల క్షేత్రం, తీర్థం, అధిష్టాన దేవత గురించిన విశేషాలు, వేంకటాచల మాహాత్మ్యంలో వర్ణింపబడి ఉంది.



మొట్టమొదటిసారిగా, ఈ 12 పురాణాలలోని శ్రీవారి విశేషాలకు సంబంధించిన 157 అధ్యాయాలను (10,771 శ్లోకాలు) ఒక సంకలనంగా కూర్చి, స్వామివారికి అంకితం చేసిన మహనీయుడు 'పసిండి వేంకటత్తురైవర్'. వీరు 15వ శతాబ్దానికి చెందిన శ్రీవారి అర్చకులు. భక్తజనరక్షణే ధ్యేయంగా, తిరుమల దివ్యక్షేత్రంలో స్వయంవ్యక్తంగా ఆవిర్భవించిన శ్రీనివాసభగవానుడి దివ్య అవతార విశేషాలను, పౌరాణిక మూలసహితంగా లోకానికి తెలియజేసి, భక్తిభావమును వ్యాప్తి చేయడం కోసమే పసిండి వేంకటత్తురైవర్ లక్ష్యంగా తెలుస్తున్నది. తాను సంకలనం చేసిన ఈ పవిత్ర గ్రంథమును, శ్రీవారి సమక్షంలో నిత్యమూ పారాయణ చేయడం కోసం తగిన ధనాన్ని ఆలయ శ్రీ భాండాగారమునకు సమర్పించి 27-06-1491న శాసనం వేయించినాడు (తి.తి.దే. శాసనములు 95-2). ప్రతినిత్యం ప్రాతఃకాలంలో శ్రీవారికి తోమాలసేవ జరిగిన తర్వాత 'కొలువు' జరుగుతుంది. ఈ శాసనం వేయించిన కాలంలో కొంతకాలం పాటు, దేవతాప్రీతికై 'శ్రీ వేంకటాచల మాహాత్మ్యమ్' నిత్యం కొలువులో పారాయణ చేయబడేది.

ప్రపంచంలోనే అరుదైనది, ఎన్నో మహిమలను కటాక్షించే శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహ సౌందర్యము – వైభవము, వేంకటాచల మాహాత్మ్యంలో భాగమైన కొన్ని పురాణాలలో వర్ణించబడి వున్నది. శ్రీమహావిష్ణువు, భక్తుల ప్రార్థనల చేత సంతృప్తి చెంది, కృతయుగం నుండి కలియుగం వరకు, పలుమార్లు, వేంకటాచలంపై స్వామిపుష్కరిణీతీరంలో దివ్యవిమానంలో అవతరించి భక్తులకు దర్శనమిచ్చినాడు. స్వామివారి విగ్రహవైభవమును వరాహ, పాద్మ, స్కాంద, భవిష్యోత్తర, బ్రహ్మాండ, వామన, బ్రహ్మ, మార్కండేయ, ఆదిత్య పురాణాలలో వర్ణించబడి ఉన్నది. అందులో నుండి ప్రస్తుతం, కొన్ని ముఖ్యమైన వర్ణనలను పరిశీలించి అవగతం చేసుకుంటే, ఈ విషయాలను తర్వాతి అధ్యాయాలలో, తిరుమలలో ఆవిర్భవించిన స్వయంవ్యక్త శ్రీవారి మూర్తితో సమన్వయపూర్వకంగా తెలుసుకుందాం.

శ్రీ వరాహపురాణం – ప్రథమభాగం, 47వ అధ్యాయంలో వేంకటాద్రిపై అవతరించిన దివ్య విమానగతుడై ఉన్న శ్రీమన్నారాయణుని దివ్యస్వరూపాన్ని బ్రహ్మాది దేవతలు, అగస్త్యాది ఋషులు, దశరథుడు వంటి మహారాజులు దర్శించిన వైభవాన్ని ఇలా వర్ణించింది :

**నీలమేఘనిభం శ్యామం నీలమాణిక్యవిగ్రహమ్**
**కేయూరాంగదసద్భూషం వృత్తాయతచతుర్భుజమ్**
**జ్వాలాయుతసహస్రారసుదర్శనధరం వరమ్ ॥**
**శరచ్చంద్రప్రతీకాశపాంచజన్యధరం శుభమ్**
**అశ్రాన్తవరదానోద్యద్దక్షపాణిసరోరుహమ్ ॥**
**కటతటసువిన్యస్తవామపాణిజలేరుహమ్...**
**కోటికన్దర్పలావణ్యసమ్మోహితజగత్త్రయమ్ ॥**
**యౌవనోద్దామలావణ్యం పంచవింశతిహాయనమ్**



**కుమారం రాజసింహస్య క్రీడమానమివాచ్యుతమ్ ॥**
**బ్రహ్మాణం తే పురస్కృత్య దదృశుః భాస్కరోపమమ్**
**(వరాహ పురాణం – 47 : 10, 24, 25, 26, 33, 9)**

“నీలమేఘశ్యాముడు, నీలమణులు వంటి శరీరము కలవాడు, భుజకీర్తులు, దండకడియములు మొదలగు విలువైన ఆభరణాలు కలవాడు, గుండ్రని పొడవైన నాలుగు భుజములు కలవాడు, మందస్మితముచే మనోహరమైన ముఖమండలమును కలిగి, దయారస తరంగముచే వికసించిన పద్మపత్రముల పోలిన నేత్రములు కలవాడు, చక్కని సూటైన ముక్కుతో, చిరునవ్వుతో పున్నమి చంద్రునివంటి ముఖమును కలిగి, బంగారు మకర కుండలములతో ఉజ్జ్వలముగా ప్రకాశిస్తున్న చెవులు కలవాడు, అగ్నిజ్వాలలతో కూడిన వేయి అంచులు గల సుదర్శన చక్రమును ధరించినవాడు, వెన్నెలకాలంలో చంద్రుని లాంటి శంఖమును ధరించినవాడు, ఎల్లప్పుడు వరాలు ఇవ్వటానికి సిద్ధముగా ఉన్న దక్షిణ హస్తము కలవాడు, కటి ప్రదేశమున ఉంచబడిన ఎడమచేయి గలవాడు, యౌవనముచే ఉత్కృష్టమైన లావణ్యము కలవాడు, 25 సంవత్సరముల వయస్సు కలిగి ఉత్తమ రాజకుమారుడి వలె క్రీడించుచున్నవాడు, కోటి మన్మథ లావణ్యముచే మూడు లోకములను మోహింపజేయువాడుయైన నారాయణుని స్తుతిస్తూ దేవతలు, ఋషులు, దశరథుడు సూర్యుడిని పోలిన తేజోరాశిని దర్శించారు.”

తిరుమల కొండలో కొలువైన శ్రీనివాసుడి విగ్రహ సౌందర్యం ఆపాదమస్తకం నిజరూపంలో శుక్రవార అభిషేకంలో దర్శించవచ్చు. పై పురాణ వర్ణన సమన్వయం చేస్తే – తిరుమలలో శ్రీవారి మూలవిరాట్ నీలిమేఘం వంటి రంగుని కలిగియున్నాడు. అలాగే నిజరూపంలో కడియములున్నాయి, భుజకీర్తులు మాత్రం ఒక ఆభరణంగా ధరింపజేస్తారు. పద్మముల వంటి కనులు, చిరునవ్వుతో వెలుగుతున్న

ముఖము, సూటైన ముక్కు, మకరకుండలములు ధరించి వరద, కటి హస్తాలతో, సుదర్శన, పాంచజన్య, నందక ఆయుధాలతో కోటి మన్మథ లావణ్యంతో, సరిగ్గా పురాణవర్ణనతో స్వామివారి నిజరూపం సరిపోలుతున్నది.

పాద్మపురాణం, శుకమహర్షి తపోదీక్షకు సంతృప్తుడై ప్రత్యక్షమైన శ్రీనివాసుని దివ్యవిగ్రహ సౌందర్యమును 27వ అధ్యాయం ఇలా వర్ణించింది :

**లీలావిభూతివిహితవివిధానన్దవేషభాక్ ।**
**కాలకాదంబినీకాంతాకుంచితాలకబంధనః ॥**

**ఉద్యద్ద్యుమణిబింబశ్రీః శిఖామణిమహోమహః ।**
**అష్టమీందుకళాకారలలాటస్థోర్ధ్వపుండ్రకః ॥**

**శార్ఙ్గజ్యాహతికార్కశ్యరమణీయప్రకోష్ఠకః ।**
**విశాలవక్షోవిలసత్‌శ్రీవత్సః కౌస్తుభోజ్జ్వలః ॥**

**శంఖచక్రగదాపద్మపరిష్కృతచతుర్భుజః ।**
**మేఖలాలంకృతకటీతటీచ్ఛురికయోద్భటః ॥**

**భక్తానుకంపాసహితః శ్రీనివాసః పరః పుమాన్ ।**
**ఆవిర్బభూవ భగవాన్ స్వామిపుష్కరిణీతటే ॥**

**(పాద్మపురాణం - 27 అధ్యాయం 43, 44, 50, 51, 61)**

లీలావిభూతిలో అనేక ఆనందకరమైన వేషములను ధరించినవాడు, నీలమేఘపంక్తులవలె అందమైన ముంగురులు గలవాడు, ఉదయించు సూర్యుని వంటి కాంతి గలవాడు, అష్టమినాటి చంద్రకళ వంటి నుదురుభాగంలో తిరునామము (ఊర్ధ్వపుండ్రము) ధరించినవాడు, శార్ఙ్గమనే ధనుస్సు యొక్క నారిదెబ్బల వలన మొద్దుబారిన అందమైన మణికట్టు గలవాడు, విశాలముగా వక్షస్థలమున ప్రకాశించు శ్రీవత్సము, కౌస్తుభములచే ప్రకాశించువాడు, శంఖము, చక్రము, గదా, పద్మములచే అలంకరింపబడిన నాలుగు భుజములు గలవాడు, మొలత్రాడుకు అలంకరింపబడిన, నడుము నందు వ్రేలాడు కత్తిని గలవాడు, భక్తులను దయగా చూసే స్వభావము కలవాడు, పరమ పురుషుడైన శ్రీనివాసుడు స్వామిపుష్కరిణీతీరంలో శుకమహర్షికి ప్రత్యక్షమైనాడు.



పాద్మపురాణంలో శ్రీనివాసుడు అవతరించిన ప్రదేశము, కాలంగురించి ఆసక్తికరమైన వర్ణన 33వ అధ్యాయంలో ఉన్నది.

**ఆవిర్బభూవ భగవాన్ శ్రీనివాస పరః పుమాన్ ।**

బ్రహ్మకల్పంలో ఉపాసకుల హృదయపద్మములలో పూజింపబడే శ్రీమన్నారాయణుడు ఆది కృతయుగంలో, జంబూద్వీపంలోని భారతవర్షమున, గంగానదికి దక్షిణభాగంలో 200 యోజనముల దూరంలో, తూర్పుసముద్రానికి పశ్చిమదిశగా ఐదు యోజనముల దూరమునందు, భాద్రపదమాసం, శుక్లపక్షం, ఏకాదశీతిథి, సోమవారం, శ్రవణానక్షత్రంతో కూడిన విష్ణుయోగంలో వేంకటాచలంపై ఉన్న నారాయణాద్రిమీద, స్వామిపుష్కరిణీతీరంలో అమితమైన ఐశ్వర్యానికి నెలవైన పడమటి దిక్కులో దేవతలచే ప్రార్థింపబడిన లోకరక్షకుడైన పరమపురుషుడు శ్రీనివాస భగవానుడు షడ్గుణోపేతుడై అవతరించాడు.

ఈ అవతార దినమును పురస్కరించుకుని, ఈనాటికీ తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టమైన అవభృథస్నానము (తీర్థవారి/చక్రస్నానం), భాద్రపదమాస (ఆలయసంప్రదాయం అనుసరించి సౌరమానం-కన్యామాసంలో, చాంద్రమానరీత్యా ఆశ్వయుజమాసంలో, అధికమాసం వచ్చినప్పుడు భాద్రపద, ఆశ్వయుజ మాసాలలో) శుక్లపక్షం - శ్రవణానక్షత్రంతో కలిసిన శుభదినంలో జరుపబడుతున్నది. శ్రీవారి

బ్రహ్మోత్సవాలతో చక్రస్నానం జరిగే చివరి (9వ)రోజు, పరమపవిత్రమైన శ్రీనివాసభగవానుడు అవతరించిన రోజుతో (పాద్మపురాణంలో చెప్పబడిన విధంగా) సరిపోతున్నది. ఆనాటినుండి నేటివరకూ అవిచ్ఛిన్నంగా, ఈ కన్యామాస బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా తిరుమలలో జరుపబడుతున్నాయి. పురాణం ప్రకారం, ఈ ఉత్సవాలే శ్రీవేంకటేశ్వర స్వామి అవతారోత్సవాలుగా పిలువబడుతున్నది. ఇది పరమాశ్చర్యకరమైన శ్రీవారి అనుగ్రహం. శ్రీమన్నారాయణుడు భగవంతుడైన శ్రీనివాసునిగా అవతరించిన స్వరూపానికి, తిరుమలలో మనం దర్శించుకుంటున్న విగ్రహ (అర్చా)రూపానికి, స్వరూపంలో భేదములేదు. పురాణాలలో వర్ణించినవిధంగా శ్రీవారు అదే విష్ణుస్వరూపంలో తిరుమలక్షేత్రంలో సేవింపబడుతున్నాడు. బ్రహ్మాదిదేవతలు, అగస్త్యాది మహర్షులు, వసురాజు మొదలైన వారు దర్శించిన శ్రీనివాస అవతారమూర్తికి, విగ్రహమూర్తికి తేడాలేనట్లు, ఒక్కటిగా ఉన్నట్లు, మార్కండేయపురాణం, 2వ అధ్యాయం వర్ణిస్తున్నది :

**ప్రాదుర్భూతం తతస్తేజ ఏకమత్యద్భుతం తదా ।**
**విమానమేకం తన్మధ్యే దదృశే దివ్యమంగళమ్ ॥**

**తన్మధ్యస్థం దివ్యమూర్తిం వరేణ్యం శంఖం చక్రం ధారయన్తం కరాభ్యామ్ ।**
**సేవ్యత్వేన స్వం పదామ్భోజయుగ్మం సర్వేషాం సన్దర్శయన్తం కరేణ ॥**

**స్వాంఘ్రిద్వంద్వం సంశ్రితానాం జనానాం సంసారాబ్ధిర్జానుదఘ్నః కిలేతి ।**
**న్యస్తేనోరౌ వామతో దర్శయన్తం సవ్యేనాన్యేనాపి హస్తేన సమ్యక్ ॥**

**సర్వాభీష్టం దాతుముద్యుక్తహేతిం భక్తానాం శ్రీవాసవక్షఃస్థలఞ్చ ।**
**మందస్మేరశ్రీముఖం భూషణాఢ్యం సర్వే శ్రీమద్వేంకటేశం హ్యపశ్యన్॥**

**(మార్కండేయపురాణం, 2వ అధ్యాయం 74-77)**



శ్రీనివాసుని సేవించడానికై బ్రహ్మ, దేవేంద్రాది దేవతలు, సనకసనందాది యోగీంద్రులు, ఈశ్వరుడు తన ప్రమథగణాలతోను, సిద్ధులు, దేవగురువైన బృహస్పతి, రాక్షసగురువైన శుక్రాచార్యుడు, వసురాజు, ఋషులు, సిద్ధులు, చారణులు, అష్ట వసువులు, కిన్నరులు మొదలైనవారు స్వామిపుష్కరిణీ వద్ద వేచిఉండగా, ఆ సమయంలో ఒక అద్భుతమైన తేజం ఆవిర్భవించింది. దానిమధ్యలో దివ్యతేజోవిరాజితమైన విమానమున్నది. ఆ దివ్యవిమానం మధ్యలో, దివ్యశరీరధారి, శ్రేష్ఠుడు, శంఖ, చక్రములను చేతుల ధరించినవాడు, కుడిచేతిని వరదముద్రలో తన పాదపద్మములను అందరూ ఆశ్రయించాలని చూపువాడు, తన ఎడమచేతిని కట్యవలంబిత ముద్రలో ఉంచి తన పాదపద్మములను ఆశ్రయించువారికి, సంసారసాగరము మోల(నడుము)లోతు మాత్రమే ఉంటుందని చూపువాడు, భక్తులకు సమస్తకోరికలను ఇవ్వడానికి సంసిద్ధమవుతున్న కారణమున లక్ష్మీదేవి నివసించే వక్షఃస్థలం గలవాడు, ఆకర్షణీయమైన చిరునవ్వు చిందించు ముఖముగలవాడు, దివ్యమైన ఆభరణాలచే అలంకరింపబడినవాడైన సాక్షాత్కరించిన శ్రీవేంకటాచలపతిని అందరూ దర్శించి, పరిపరివిధాలుగా శ్రీనివాసుని స్తుతించారు.

శ్రీవేంకటేశ్వర స్వామివారిని గురించి తెలుసుకోవడానికి, స్వామివారి భక్తులు, స్వామివారి మహిమలు, ఇలా ఒకటేమిటి, తిరుమల శ్రీవారి గురించి గడిచిన యుగాలకు సంబంధించిన వివరణలు, వర్ణనలు అన్నీ కూడా మహర్షులు దివ్యదృష్టితో దర్శించి పురాణాల రూపంలో మనకందించారు. ఆయా పురాణాల నుండి సంకలనం చేయబడిన వేంకటాచలమాహాత్మ్యంలో శ్రీవారి విగ్రహవర్ణనగురించి, ముఖ్యమైనవిగా చెప్పుకోదగినవిగా పైన ఇవ్వబడిన పురాణభాగములలో తెలుసుకోవచ్చు. తరువాతి అధ్యాయాలలో శ్రీవేంకటేశ్వరస్వామివారి ధృవబేరం (మూలవిరాట్టు) గురించి, మనం తెలుసుకొనేటప్పుడు, ఈ పురాణవర్ణనలు

మనకు శ్రీవారి విగ్రహరూపం గురించి ఒక అవగాహన కల్పిస్తాయి. తరువాతి అధ్యాయంలో శ్రీవారి ఆలయగోడల మీదున్నశాసనాలు, అలాగే శ్రీవారివిగ్రహాన్ని గురించి చారిత్రకంగా లభ్యమయ్యే వివరణలు వీటి గురించి తెలుసుకుందాం!

## చారిత్రక గ్రంథములలో శ్రీవారి వర్ణన

ప్రస్తుత నాగరిక ప్రపంచంలో చరిత్రకి, చారిత్రక విషయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని దేశాలలో ఆయాకాలాల్లో జరిగిన సంఘటనలు, ఆధ్యాత్మిక, రాజకీయ, రాచరిక, సాంస్కృతిక విషయాలను గురించి సమగ్రమైన అవగాహనకు రావాలంటే చారిత్రక గ్రంథాల అధ్యయనం తప్పనిసరి. ఈ కోణంలో చరిత్రకారులు ముఖ్యపాత్ర వహిస్తారనేది నిర్వివాదాంశం. వర్తమానకాల పరిస్థితులను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, వాటిని గ్రంథస్తం చేసి, భవిష్యత్‌తరాలకు దిక్సూచిగా ఆ గ్రంథాలను అందించిన ఘనత చరిత్రకారులదే. ఎన్నో విషయాలతోబాటు, ఆధ్యాత్మిక మరియు ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల గురించి, అక్కడ కొలువై పూజలందుకుంటున్న ప్రధాన దైవాన్ని గురించి, ఆ దేవతకు జరిపే ఉత్సవాలను, ఉత్సవ వైభవాన్నీ గురించిన సమాచారాన్ని తెలుసుకోవాలంటే చరిత్ర పుస్తకాలు తిరగేయాల్సిందే. ఈ క్రమంలో తిరుమల క్షేత్రం గురించి, ఈ క్షేత్ర ప్రధాన దైవమైన శ్రీవేంకటేశ్వరుని విగ్రహం గురించి కొన్ని ఆసక్తిరమైన విషయాలు కొన్ని చరిత్ర గ్రంథాలలో మనకు లభ్యమవుతున్నది.

ద్రావిడ దేశంలో 'తోల్కాప్పియమ్' గ్రంథం, తమిళంలో రచింపబడినటువంటి తొలిగ్రంథంగా ప్రసిద్ధికెక్కినది. దీనినే 'తొలికావ్యం' అని పిలుస్తారు. ఈ గ్రంథంలో శ్రీవారు వెలసిన కొండ గురించిన ప్రస్తావన ఉంది. ఇందులో ఈ కొండపేరు 'వేంగడం' అని పేర్కొన్నారు. ఇలా ఇది సామాన్యశకానికి పూర్వం 2వ శతాబ్దానికి చెందిన పరంచిరనార్ అనే



కవి రచించిన తమిళలక్షణ (వ్యాకరణ) గ్రంథం. ఇందులో తిరుమల కొండను ప్రస్తావిస్తూ –

"వడ వేంగడమ్ తెన్‌కుమరి యాయిడై తమిళ్ కూరుం నల్లులహమ్" ఉత్తరమున వేంగడము, దక్షిణమున కన్యాకుమారి – ఈ మధ్యనున్న దేశము తమిళదేశము అని పేర్కొన్నారు. దీనినిబట్టి 2వ శతాబ్దానికి పూర్వమే ఈ కొండపై ఒక విగ్రహం ఉండేదని సూచనప్రాయంగా తెలుస్తున్నది.

వేంగడం కొండలు, చిత్తూరు, నార్త్ ఆర్కాట్, చెంగల్పట్టువంటి ప్రాంతాలు కలిసిన తొండమండలంలో భాగంగా ఉండేదని ప్రాచీన చరిత్ర తెలియజేస్తున్నది. ఈ ప్రాంతాన్ని అప్పట్లో (8వ శతాబ్దం)కో విజయదంతి విక్రమవర్మ అనే పల్లవరాజు పరిపాలించేవాడు. ఈ తొండమండలాన్నే సంస్కృతంలో 'తుందీర విషయం' లేక 'తుండీరమండలం' అని పిలుస్తారు. రాజరాజ 1 పరిపాలనాకాలంలో ఈ ప్రాంతాన్ని 'జయంగొండచోళ మండలం' అని పిలిచేవారు. అందులో 24 జిల్లాలుండేవి. ఒక్కొక్క జిల్లాని అప్పటి పరిభాషలో 'కొట్టం' అని పిలిచేవారు. ప్రతికొట్టంలో 'నాడు'లనే విభాగాలుండేవి. ముఖ్యమైన దేవాలయాలున్న కొట్టాన్ని ఆ ఆలయ పేరుతోనే గుర్తించేవారు. దట్టమైన అడవులు, కొండలతో నిండి ఉన్న ఈ కొట్టాలు వేన్–కున్ర–కొట్టమ్, గోక్కాట్టు–కొట్టమ్, ఊరు–కొట్టు–కోట్టమ్–కున్న్–దట్టన–కొట్టమ్, మనవీర్–కొట్టమ్ వంటి పేర్లతో పిలువబడేవి. వేంగడకొట్టం (తిరువేంగడకొట్టం)లోనే తిరుమల కొండలు భాగంగా ఉండేవి. కుడవూర్ నాడు (తిరుపతి చుట్టు ఉన్న గ్రామాలు), వైకుండ–వల–నాడు (చంద్రగిరి ప్రాంతం), తుయ్యానాడు (ప్రస్తుత చిత్తూరు మరియూ చుట్టుప్రక్కల ప్రాంతాలు), అర్రూర్‌నాడు (కాళహస్తి చుట్టుప్రక్కల ప్రాంతాలు). అనే ఈ నాలుగు 'నాడు'లు, తిరువేంగడకొట్టంలో భాగంగా ఉండేవి. తిరుమల కొండలు భాగంగాకల వేంగడకొట్టు, తొండమండలం ప్రాంతానికి ఉత్తర సరిహద్దు. ఈ విషయాన్నే తోల్ కాప్పియమ్ పేర్కొన్నది.

సంగం కాలం అనేది ప్రాచీనచరిత్రలో, తమిళనాడు, కేరళ, శ్రీలంకలో కొన్ని ప్రాంతాలు కలిసిన 'తమిళగం' అనే ప్రాంతంలో సామాన్య శకానికి పూర్వం 6వ శతాబ్దం నుండి సామాన్యశకం తర్వాత 3వ శతాబ్దంవరకు విస్తరించిన చరిత్ర, మధురై కేంద్రంగా, ప్రసిద్ధి చెందిన కవులు, పండితులతో ఏర్పడిన 'సంగమ' అనే విద్యాసంస్థ నుండి ఈ పేరు తీసుకోబడినది. తమిళ సంగకాలపు సాహిత్యంలోని పత్తుప్పాట్టు – పది గ్రామీణ శృంగార కావ్యభేదములు, ఎట్టుత్తొగై – ఎనిమిది నీతిశతకాలు, పురం-పొరుళ్-వెణ్బామలై అనే కావ్యాలు తిరువేంగడాన్ని గురించి ప్రస్తావించాయి. సామాన్యశకం 2వ శతాబ్దానికి చెందిన మాములనార్ అనే కవి వేంగడం గొప్ప పర్వతమని ప్రశంసించారు. ఈ కొండ కళ్ళార్ కులనాయకుడైన 'పుళ్ళి' ఆధీనంలో ఉండేదని, అక్కడ గొప్ప ఉత్సవాలు జరిగేవని తెలుపుతాడు. ఎట్టుత్తొగై అనే కావ్య సంకలనంలో కల్లాదనార్ (83), నక్కినార్ (209, 253), కణక్కోయనార్ (27), మాములనార్ (61,295,393) పాట్టులలో వేంగడంపై అత్యంత వైభవోపేతంగా జరిగే ఉత్సవాల ప్రశస్తి-వర్ణనలు ఉన్నాయి. అగనానూరు అనే పద్యకావ్యంలో (83వ పద్యం) వేంగడం ప్రాంతం కనులకింపైన ఉత్సవాలకు ప్రసిద్ధి అని కీర్తించాయి.

సామాన్యశకం 12వ శతాబ్దానికి చెందిన చేరరాజైన 'శెంగుత్తవాన్' (సా.శ. 140-192) సోదరుడు, చేరరాజ కుమారుడైన జైనకవి 'ఇళంగో అడిగళ్' తమిళభాషలో 'శిలప్పదికారము' అనే ఇతిహాసాన్ని రచించాడు. ఈ శిలప్పదికారంలో, కోవలన్‌యొక్క ధర్మపత్ని 'కణ్ణగి' అనే పతివ్రత జీవితగాథ వర్ణించబడింది. తమిళులు సతీదేవిగా ఈ కణ్ణగిని కీర్తిస్తారు. సా.శ. 2వ శతాబ్దంలో దక్షిణదేశంలోని కావేరీ పూంపట్టణం (చోళరాజుల రాజధాని), మధురై (పాండ్యరాజుల రాజధాని), వంజినగరం (చేరరాజుల రాజధాని) అనే మూడునగరాలలో కథానాయకి కణ్ణగి జీవితయాత్ర



కొనసాగుతుంది. సతీదేవి-కణ్ణగి దేవాలయాలు తమిళనాడులో ప్రసిద్ధి చెందినవి. ప్రధానదేవాలయం మధురై నగరంలో ఉంది. మూడు కాండలు, 30 అధ్యాయాలు, 1652 పద్యాలతో శిలప్పదికారం రచింపబడింది. ఇళంగో అడిగళ్ సమకాలీన సాంఘిక జీవితాన్ని, సాంస్కృతిక విశేషాలను సహజసుందరంగా వర్ణించాడు. మధురైకాండలోని కాడుకణ్ కతైలో, ఒక బ్రాహ్మణుడు పడమటికనుమలలోని మాంగాడు నివాసి, తిరుమలయాత్ర చేసివచ్చి, కథానాయకుడైన కోవలన్‌కు తాను దర్శించిన తిరువేంగడ ముడైయాన్ (శ్రీవేంకటేశ్వర స్వామి) గురించి చెబుతాడు. ఆ వర్ణన ఇలా ఉంది.

**వీంగు వీరరువి వేంగడ మెన్నుం**
**ఓంగయర్ మలయత్తుచి మీమిశై**
**విరి కదిర్ ఞాయిరుం తింగళుం విళంగి**
**ఇరుమరుంగోంగియ విడైనిలై తానత్తు**
**మిన్నుక్కోడి యుడుత్తు విళంగు విర్పూండు**
**నన్నిఱ మేగం నిన్రదుపోల**
**పగైయణంగాళియం పాల్వెణ్ శంగముం**
**తగై పెరు తామరై కైయినేంది**
**నళంగిళర రామరర్ విర్పూండు**
**పోలంపూవాడైయిర్ పొలిందు తోన్రియ**
**శెంగణ్ నెడియోన్ నిన్రవణ్ణముమ్ 41-51 పంక్తులు**

**(శిలప్పదికారం-(2) మధురైకాండ-(11) కాడ్‌కణ్‌కతై)**

అతి సమృద్ధిగా నీళ్ళుండి, వేగంగా క్రిందికి దూకుతున్న సెలయేళ్ళున్న వేంగడమనే కొండశిఖరంపై, ఇరువైపులా సూర్యచంద్రులు ప్రకాశిస్తుండగా, ఆ మధ్యలో నీలమేఘం మెరుపుతీగను వస్త్రంగా,

ఇంద్రధనస్సును హారంగా ధరించి నిలిచినట్లు, శత్రువులకు భయాన్ని కల్గించే చక్రాన్ని, పాలవలె స్వచ్ఛమైన శంఖాన్ని తన సుందరమైన కరకమలములలో ధరించి, మిక్కిలి ప్రకాశిస్తున్న కౌస్తుభమును వక్షఃస్థలంపై ధరించి, పట్టుపీతాంబరాన్ని ధరించి, వెలుగులీనుతూ స్వయంగా ప్రకటితమైన ఎర్రనిజీరలు గల నేత్రములు కలిగి ఆ మహావిష్ణువు (శెంగణ్ నెడియోన్) పొడవుగా వేంగడముపై నిలిచిన వైనము.....' అని శ్రీవారి మూలవిరాట్ విగ్రహాన్ని గురించి స్పష్టంగా వర్ణించింది. చారిత్రకంగా శ్రీవారి విగ్రహ ఉనికి, ఈ ఇతిహాసం ద్వారా తెలుస్తున్నది.

ప్రాచీన తమిళ సాహిత్య చరిత్రలో, సా.శ. 1,2 శతాబ్దాలలో అంటే కడసంగమకాలంలో వెలువడిన సంకలనా గ్రంథాలలో అగ్రగణ్యమైనది 'అగనానూరు'. అగం అంటే మధురగాథలు, నానూరు అంటే నాలుగువందలు. కాబట్టి అగనానూరు – నాలుగు వందల మధురగాథల (పాశురాల) సంకలన గ్రంథం. పాండ్యరాజు ఉగ్రపెరువళుది ఆస్థానంలో ఉన్న రుద్రశర్మ అనే పండితుడు దీనిని సంకలనం చేశాడు. ఈ గ్రంథంలో 144 మంది కవులు వర్ణించిన 400 మధురగాథలు ఉన్నాయి. అగనానూరులోని 9 పాశురములలో "వడవియన్ వేంగడం" తమిళదేశానికి ఉత్తరం వైపున్న వేంకటాచలం ప్రస్తావన, ప్రకృతి వర్ణనలు ఉన్నాయి.

**కళల్వునై తిరుందడిక్కళ్వార్ కోమాన్**
**మళపులను వణక్కియ మావన్ పుల్లి**
**విళవుడై విళచ్చీర్ వేంగడం పెరిదుమ్**
**వళగువ రాదలో అరదు.**

అని అగనానూరులో 61వ పాశురము వేంగడమును గురించి వర్ణించింది. కడియములచే (గండపెండారములచే) అలంకరింపబడిన పాదములు గల వడుకు ప్రభువు పుల్లి పరిపాలించుచున్న దేశములో కన్నులపండువుగా జరిగే ఉత్సవములకు వేంగడం ప్రసిద్ధి చెందినది.



**వీనైనవిల్ యానై వీఅఙ్ తొండయర్**
**ఇనమయై తవముమ్ నరు నెడుఙ్కోట్టు**
**ఓంగువెళ్ళరువి వేంగడత్తుంబర్ (213)**

యుద్ధమునందు పోరాడే ఏనుగులు, గొప్పగా యుద్ధము చేయగల తొండమండల వీరులు, మేఘములు గుంపులు కట్టి సంచరించే శిఖరములు, అధిరోహించుటకు వీలుకాని ఉన్నతమైన శిఖరములు నుండి ప్రవహించుచున్న సేలయేళ్ళుగల వేంగడము.

"పనిపడు శోలైవేంగడత్తు" (211) – చల్లదనముకల తోటలతో కూడియున్న వేంకటాద్రి.

"శెన్నుదల్ యానైవేంగడమ్" (265) – ఎర్రని నుదురుగల ఏనుగులు సంచరించుచున్న వేంగడము.

"ఉయర్ వరై నన్నాటుంబర్ వేంగడమ్" (393) – ఉన్నతములైన పర్వతములు గల వేంకటాద్రి.

ఇలా చారిత్రకంగా తమిళ ప్రాచీన సాహిత్యంలో తిరువేంగడం (తిరుమల) గురించి, కొండపై వెలసిన శ్రీవారిమూర్తి గురించి వర్ణనలు కనిపిస్తాయి.

అలాగే చారిత్రకంగా తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయ గోడలపై లభించిన అనేక శాసనాలలో శ్రీవారికి పుష్పకైంకర్యం, నివేదనకొరకు ప్రసాదముల ఏర్పాటు, శ్రీవారి సన్నిధిలోనూ, ఉత్సవముల సమయాలలోనూ దీపముల ఏర్పాటు వంటి విషయముల గురించి దాదాపు అన్ని శాసనాలలో సమాచారం లభిస్తున్నది. శ్రీవారిమూర్తి గురించి వర్ణన లేక ఇతర విషయాలు ఈ శాసనాలలో ప్రస్తావనలేదు.

తిరుమల ఆలయశాసనాలలో ప్రత్యేకంగా చెప్పుకోదగిన శాసనం ముఖ్యంగా శ్రీవారిమూర్తి స్వరూపం గురించి ఏవైనా విషయాలు తెలిపే

శాసనమంటే అది పల్లవరాణి సామవై పేరిందేవి, శ్రీవారి ఆలయానికి శ్రీభోగశ్రీనివాసమూర్తి రజతవిగ్రహాన్ని సమర్పించినప్పుడు వేయించిన శాసనం చూ.తి.తి.దే.శాసనాలు Vol.1, No.8 dt.966 A.D. (No.18-T.T.). ఇది శ్రీవారి ఆలయంలోని విమాన ప్రాకారంలో ఉత్తరంవైపు గోడలమీద చూడవచ్చు.

ఈ శాసనం 8-6-966 నాడు వేయించిన దానశాసనం. అప్పుడు తిరుమల ఉన్న ఈ ప్రాంతాన్ని కొప్పాత్ర మహేంద్ర పన్మార్ లేక తొండమండల ప్రభువైన కోపార్థివేంద్రవర్మ పరిపాలిస్తూ ఉండేవాడు. కోపార్థివేంద్రవర్మ సామ్రాజ్యంలో సామంతరాజైన శక్తివిటంకన్ భార్య మరియూ పల్లవప్రెగ్గాడియర్ కూతురైన సామవై లేక కడవన్ పెరుందేవి (సామవై పెరుందేవి), తిరుమల ఆలయానికి బహూకరించిన ఈ భోగశ్రీనివాసుడి విగ్రహానికి సంబంధించిన ఈ దానశాసనమే, అన్ని శాసనాలలోకి మొదటిది. ఈ శాసనం ఆధారంగా శ్రీవారిమూర్తి స్వరూపానికి సంబంధించి కొన్ని విషయాలను గ్రహించవచ్చు.

1. ఈ శాసనం చివర్లో "యెన్ ఇత్తన్ మమ్ ఇరక్షిప్పార్ శ్రీపాదమ్ ఎన్ తలైమెలదు శ్రీవైష్ణవర్‌కళ్ ఇరక్షై ఇవై శాత్తన్దై ఎళుత్తు" - అంటే సామవై తన శాసనం చివర్లో శ్రీవైష్ణవుల రక్షనర్థించడం గమనార్హం. తాను రాకుమారియైనా, సామంతరాజ్యానికి రాణియైనా, ఆమె శ్రీవైష్ణవుల రక్షను అర్థిస్తూ, ఈ దానరక్షకుల శ్రీపాదము నా తలపై ధరించుగాక అని వ్రాయించినది. ఇలా శ్రీవైష్ణవరక్షను ప్రస్తావించిన శాసనంలో, ఆమె శాసనమే మొదటిది. శ్రీవైష్ణవరక్షను అర్థించటంవలన, సమర్పించిన విగ్రహం స్వయంగా శ్రీనివాసుడి రూపం కావటంవలన, తిరుమల ఆలయం అప్పటికే ప్రసిద్ధిచెందిన గొప్ప వైష్ణవ ఆలయంగా వ్యవహరింపబడేది అని తెలుస్తున్నది.



2. అలాగే ఈ శాసనంలో స్వామివారి విగ్రహబహూకరణతోపాటు, స్వామివారి ఆభరణాలు, అలాగే 9రోజులు పగలు, రాత్రి ఉత్సవాలు జరిపే పురట్టాశి ఉత్సవం జరగడానికి కూడా ఏర్పాట్లు చేసినది. అలాగే రెండు అయన సంక్రాంతులలోనూ, రెండు విషు సంక్రాంతులలోనూ స్వామివారికి తిరుమంజనం జరపాలని అభ్యర్థించింది. వైఖానస భృగుసంహిత క్రియాధికార గ్రంథంలో "విష్ణువాయనమాసర్క్ష", "విష్ణుపఞ్చదినేషు విషువద్వయో రయనద్వయో....అపివిశేష పూజాం కుర్యాత్" (రత్నకరే) అని చెప్పబడినందువలన, ఇది విష్ణుదేవతాకమైన ఉత్సవాలుగా తెలుస్తున్నది.

3. అలాగే ఈ భోగశ్రీనివాసమూర్తి అర్చావిగ్రహాన్ని, ఆగమ పరిభాషలో కౌతుకబేరం అని అంటారు. వైఖానస ఆగమం ప్రకారం కౌతుకబేరం అనేది ధృవబేరాన్ని (మూలవిరాట్) పోలినట్లుగా నిర్మించాలని తెలుపుతుంది. అంతేకాకుండా తిరుమల శ్రీవారి ఆలయ సంప్రదాయం ప్రకారం మూలవిరాట్‌కి నిజరూపంలో ఏయే ఆభరణాలైతే ఉన్నాయో, వాటినే స్వర్ణ, వజ్ర కవచాది ఆభరణములుగా విగ్రహంపై ధరింపజేసే సంప్రదాయం ఉన్నది. సామవై బహూకరించిన ఆభరణాలలో ఒక కిరీటం, రెండు చెవులకు బంగారంతో తయారు చేయబడి మకరం ఆకారంలో ఉన్న (పొన్నిన్ మకరం) కర్ణపత్రములు, నాలుగు వరసల గొలుసు, బంగారు నడుంపట్టి (ఉదరబంధనం), బంగారువడ్డాణం (తిరువరైపట్టికై) ఇలా స్వర్ణ, నవరత్న వజ్రఖచిత ఆభరణాలను సమర్పించింది. ఈ ఆభరణాల వరస చూస్తే అవి అన్నీ కూడా శ్రీవారి మూలవిరాట్ నిజరూపంలో ఉన్న ఆభరణాల వరుసగా స్పష్టంగా తెలుస్తున్నది.

4. ఈ శాసనం మొదట తి.తి.దే. ద్వారా అనువదించినప్పుడు దీనికాలం 966 సంవత్సరంగా గుర్తించబడింది. తరువాత పరిశోధనల

ఆధారంగా, ఈ శాసనంలో పేర్కొనబడ్డ కోపార్థివేంద్రవర్మ పరిపాలనా కాలంలో 14వ సంవత్సరంలో ఈ దానం ఇవ్వడం జరిగిందని, కోపార్థివేంద్రవర్మ పరిపాలనాకాలం 600-630 సామాన్యశకం అని చారిత్రక ఆధారాలతో నిర్ధారణ చేయడంవలన, ఈ శాసనం 614 సామాన్యశక సంవత్సరానికి చెందినదని సరిదిద్దబడినది. కనుక దీనినిబట్టి 6వ శతాబ్దం నాటికే తిరుమల అతి గొప్ప వైష్ణవక్షేత్రంగా ప్రసిద్ధికెక్కినది అని స్పష్టంగా తెలుస్తున్నది.

ఇలా చారిత్రక ఆధారాలైన ప్రాచీన తమిళ సాహిత్యం మరియూ శాసనాలద్వారా శ్రీవారిమూర్తి విష్ణుభగవానుడి రూపమైన శ్రీవేంకటేశ్వర స్వామివారే అని తెలుసుకోవచ్చు.

## ఆళ్వార్ల పాశురాలలో శ్రీవారిమూర్తి వర్ణన

'ఆళ్వార్' అన్న తమిళపదానికి లోతుగా మునిగి ఉన్నవారు అని అర్థం. భగవదనుభవమనే సముద్రంలో మునిగి లోతులను చూసినవారు అని వివరణగా చెప్పవచ్చు. ఈ విశేషణం ఏ భక్తునికైన ఇవ్వవచ్చుకాని ప్రత్యేకంగా శ్రీవైష్ణవసంప్రదాయంలో భక్తశిఖామణులుగా ప్రసిద్ధి చెందిన పన్నెండుమంది కవులను ఈ పేరుతో పిలవడం సంప్రదాయంగా వస్తున్నది. వీరందరూ ద్రావిడ దేశానికి చెందినవారు అంటే తమిళనాడు ప్రాంతంవారు. వీరందరూ (12) విభిన్నకాలాలు, విభిన్నప్రాంతాలు, విభిన్న జాతులవారు, విభిన్న వృత్తి, ప్రవృత్తి కలవారైనప్పటికీ వీరందరిలో సమానంగా ఉండేది గాఢమైన విష్ణుభక్తి. ఆ భక్తిని అమృతతుల్యమైన తమ వర్ణనలతో, కవితాశక్తితో పాడి కీర్తించడం, ఆ కీర్తనలే ద్రావిడ ప్రబంధంగా పాశురాలుగా వినుతికెక్కాయి.

వారందరూ తమ తమ కాలాలలో తమిళదేశంలో యాత్రలు చేస్తూ, ముఖ్యంగా వైష్ణవ దివ్యక్షేత్రాలు సందర్శిస్తూ, అక్కడి అర్చామూర్తులను



చూసినప్పుడు తాము పొందిన దివ్యానుభూతులు, తమకు కలిగిన ఆధ్యాత్మికభావనలు సరళమైన మాటలలో సూటిగా హృదయాంతరాళను స్పృశించేటట్లు పాడేవారు. ఆళ్వార్లు పాడిన పాశురాలలో ప్రముఖంగా క్షేత్రవర్ణన, ఉత్సవవర్ణన, ఆయాక్షేత్రాలలోని అందమైన ప్రకృతివర్ణన, అర్చామూర్తి వైభవం, ఆయా క్షేత్రాలలో భగవంతుని అనుగ్రహం పొందడానికై వారి ఆతృత, భగవదనుభవం ద్వారా వారికి కలిగిన ఆనందం మొదలైన అంశాలు ఉన్నాయి. మొదటిసారిగా పన్నెండుమంది ఆళ్వార్లు రచించిన పాశురాలను సేకరించి దానిని నాలాయిర దివ్యప్రబంధం అన్న పేరుతో ఆధ్యాత్మిక ప్రపంచానికి చాటినవాడు శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందిన ఆచార్యులలో మొదటివాడైన శ్రీనాథమునులువారు. పదో శతాబ్దానికి చెందిన శ్రీవైష్ణవ ఆచార్యత్రయంలో వీరు మొదటివారు. వీరి కుమారుడు యామునాచార్యులు (ఆళవందార్), యామునుల మనుమడు శ్రీశైలపూర్ణుడు రామానుజులవార్లు ఈ త్రయంలో ఉన్నారు. ఆళ్వార్ల పరంపరలో శ్రీనమ్మాళ్వార్లు ప్రముఖ స్థానాన్ని అలంకరిస్తారు. వీరు సాయించిన 'తిరువాయ్‌మొళి', వైష్ణవ సంప్రదాయంలో ప్రముఖమైనదిగా ప్రసిద్ధి చెందినది.

**భక్తామృతం విశ్వజనానుమోదం**
**సర్వార్థదం శ్రీశఠగోపవాఙ్మయం**
**సహస్ర శాఖోపనిషత్సమాగమం**
**నమామ్యహం ద్రావిడవేదసారం.**

నమ్మాళ్వారుల తిరువాయ్‌మొళి కృతి వేదసారమని, ఉపనిషత్తులన్నింటికీ సమానమని సంప్రదాయంలో చెప్పబడింది.

**భూతం సరశ్చ మహదాహ్వాయి భట్టనాథ శ్రీ భక్తిసారకులశేఖర యోగివాహన్ ।**

**భక్తాంఘ్రి రేణుపరకాల యతీంద్ర మిశ్రానన శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥**

నేను భూదత్తాళ్వార్, పొయ్గై ఆళ్వార్, పేయాళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్, తిరుమళిశై ఆళ్వార్, కులశేఖర ఆళ్వార్, తిరుప్పాణాళ్వార్, తొణ్డరడిప్పొడి ఆళ్వార్, తిరుమంగైయాళ్వార్, శ్రీరామానుజులు, మధురకవి ఆళ్వార్, నమ్మాళ్వార్ల పాదపద్మములను ఎల్లప్పుడు సేవించుచుందును అని పైశ్లోకం తాత్పర్యము. ఈ దివ్యశ్లోకం శ్రీపరాశర భట్టర్‌చే రచించబడినది. ఇందులో 12మంది ఆళ్వార్లతోబాటు, శ్రీరామానుజులవారి పేరు కూడా చెప్పబడినది. ఆళ్వారులు భగవత్ కైంకర్యరూపమైన భక్తియే భగవదనుగ్రహమునకు మూలమని తెలియజేశారు. వీరి పాశురాల ద్వారా మోక్షమునకు సులభ ఉపాయమైన ప్రపత్తిమార్గమును బోధించి, ప్రజలందరికీ పరమ పురుషార్థమును చేరువ చేశారు.

12మంది ఆళ్వార్లలో మధురకవి ఆళ్వారు, తొండరడిప్పొడి ఆళ్వారు అనే యిరువురు తప్ప మిగిలిన పదిమంది ఆళ్వార్లు, తిరువేంగడం గురించి, ఆ కొండకి అధిష్టానదైవమైన శ్రీనివాసుని గురించి పరిపరి విధములు 202 పాశురాలలో కీర్తించారు.

1. పొయ్గై ఆళ్వారు రచించిన ముదల్ తిరువందాదిలోని 26వ పాశురంలో "వినైచ్చుదురై నందు విక్కుం వేంగడమే...' పాపములనే అగ్నిని నాశనము చేయు తిరువేంగడమనే పర్వతమే నిత్యసూరులు విచ్చేసి నివసించు తిరుమలగా అలరారుచున్నది అని తిరుమల పర్వతాన్ని కీర్తించాడు. 37వ పాశురంలో తెల్లని పాంచజన్యశంఖాన్ని తన పగడంవంటి పెదవులతో ఊదిన శ్రీవారికి తిరుమల ఎంతో ప్రీతిపాత్రమైనదని స్వామిమూర్తిని వర్ణిస్తాడు.

2. పూదత్తాళ్వార్ రచించిన రెండవ తిరువందాదిలో 25వ పాశురములో, పరమపదమున నిత్యసూరులచే స్తుతింపబడుచున్న



పరవాసుదేవుడే తిరుమలలో వేంకటాద్రియందు వెలసియున్నాడని స్తుతించాడు. 75వ పాశురములో శ్రీనివాసుడు జలధరశ్యాముడని కీర్తించాడు.

3. పేయాళ్వారు రచించిన మూడవ తిరువందాదిలోని 63వ పాశురంలో 'తాళ్ సడైయుమ్, నీళ్ముడియుం, ఒణ్మళువుం.. కురుచయైన జడలను, పొడవాటి కిరీటమును, అందమైన ఆయుధము, శ్రీహస్తంతో చక్రాయుధాన్ని, ఉదరబంధంగా సర్పాభరణాలు, బంగారు మొలత్రాటిని ధరించిన శ్రీమన్నారాయణుడుగా, శంకరునిగా రెండు రూపాలు – తిరుమలలో నివాసమున్న శ్రీనివాసునకు ఏకరూపమై వెలసింది. ఇది మహా అద్భుతం అని కీర్తించాడు. ఆళ్వార్ అంతరంగంలో ఈ రెండు రూపాలు వేరు వేరు అయినప్పటికినీ, ఒకరూపం (శివుడు) తపస్సుద్వారా సాధించేది, మరోరూపం (విష్ణువుది) అద్భుత సౌందర్యరూపం కలిసి ఒకే రూపంగా ఏర్పడి, శ్రీమహావిష్ణువుయొక్క సర్వవ్యాపకత్వాన్ని రుజువు చేస్తున్నదని భావం. మరొక భావనలో శ్రీమన్నారాయణుడు సమస్త ప్రాణికోటిలో అంతర్యామి రూపంగా ఉన్నట్లు, శంకరునిలో కూడా అంతర్యామిగా ఉన్నాడని పెరియతిరుమొళి 7.10.7 (తిరుమంగైయాళ్వార్) కీర్తిస్తుంది.

4. తిరుమళిశైయాళ్వారు రచించిన నాన్ముగన్ తిరువందాదిలోని 39వ పాశురములో 'అఱైప్పన్ తిరువేంగడత్తానైక్కణ" వేంకటాచలపతిని సేవించుటకు పిలుతును అని, 40వ పాశురములో 'వెఱ్ప్రెను వేంగడం పాడినేన్' – పర్వతమను ప్రసక్తి వచ్చినప్పుడల్లా శ్రీవేంకటాద్రిని, శ్రీవేంకటేశ్వరస్వామిని గురించి సంకీర్తనము చేసితిని అని స్తోత్రం చేశాడు.

5. నమ్మాళ్వారు రచించిన తిరువాయ్‌మొళిలో 'ఉలగముండు పెరువాయా' అను 6పదిలో (శతకములో)– "అగలగిల్లేన్ ఇఱైయుమెన్రు

అలర్‌మేల్ మంగైయురైమార్ బా" క్షణకాలమైనను ఎడబాసియుండజాలనని మనవి చేసుకొనుచు తామరపుష్పముపై నివసించుచున్న యౌవనవతియగు లక్ష్మీదేవి (అలర్‌మేల్‌మంగ) నిత్యనివాసము చేయుచున్న వక్షఃస్థలము గలవాడా!" అని శ్రీనివాసుని వర్ణించాడు.

6. పెరియాళ్వార్ రచించిన తిరుమొళిలో 1–9–8 పాశురములో నిత్యము, జాజ్వల్యమానమూ అయిన కాంతులను వెదజల్లే కిరీటాన్ని ధరించిన శ్రీనివాసా అని వర్ణించాడు.

7. ఆండాళ్ రచించిన నాచ్చియార్ తిరుమొళిలో శ్రీనివాసుడు విశాలవక్షస్కుడూ, మనోహరాకారుడూ అని వర్ణించింది.

8. కులశేఖరాళ్వార్ రచించిన పెరుమాళ్ తిరుమొళిలో, మెరుపుతీగలను చుట్టగా చుట్టినట్లు అమిత తేజస్సుతో ప్రకాశించే చక్రాయుధాన్ని ధరించి, ఎర్రని పగడంవంటి పెదవిగల శ్రీనివాసుడు అని శ్రీవారిని వర్ణించాడు. 'పడియాయ్ క్కిడందు ఉన్ పళవాయ్ కాణ్బేనే' – సర్వాధికా! వేంకటాచలపతి! నీ దేవాలయపు ద్వారముయొక్క గడపగా ఉండునట్లు అనుగ్రహింపుము. అట్లైనచో ఎల్లప్పుడు మిమ్ము దర్శించు భాగ్యము నాకు కలుగును అని శ్రీవారిని ప్రార్థించాడు.

9. తిరుప్పాణాళ్వార్ రచించిన అమలనాది పిరాన్‌లో శ్రీవారిని వర్ణిస్తూ, స్వామివారు ఎర్రని ఆకాశాన్ని పోలిన పట్టుపీతాంబరాలు ధరించియున్నాడు అని కీర్తించాడు.

10. తిరుమంగైయాళ్వారు రచించిన పెరియతిరుమొళిలో సమున్నతమైన భుజస్కంధాలను కలిగినవాడునూ, నీలమణిని పోలిన శరీరవర్ణంగలవాడూ అని శ్రీవేంకటేశ్వరుడిని వర్ణించాడు.

అనన్య విష్ణుభక్తులు, రామానుజాచార్యులకు పూర్వులు, రెండవ ఎనిమిదవ శతాబ్దముల మధ్యకాలం నాటివారైన పదిమంది ఆళ్వార్లు,



తిరువేంగడనాథుని దర్శించి, తిరువేంగడం విష్ణుక్షేత్రమని, వేంకటాచలపతి సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే అని, చతుర్భుజుడు, శంఖచక్రధారిగా, శ్రీనివాసుడు దర్శనమిస్తున్నాడని వర్ణించారు.

## ధృవబేర వర్ణన

ఈ సువిశాల ప్రపంచంలోని 'ఆనందం' మొత్తాన్ని ఒకచోట ప్రోదిచేస్తే అటువంటి మహత్తరమైన, దివ్య ఆవాసాన్నే 'ఆనందనిలయం'గా వర్ణించవచ్చు. కాదు కాదు, మానవపరిమితులను దృష్టిలో ఉంచుకుని మనం సువిశాల ప్రపంచం అన్నాం, వాస్తవమైతే ఈ విశాలసృష్టిలో, భూలోక వైకుంఠంగా 'ఆనందనిలయం' భాసిల్లుతున్నది. ఈ ఆనందం సువిశాల విశ్వంలో సమస్త బ్రహ్మాండాలలో వ్యాప్తి చెంది, కేవలం మనకోసమే, మనలను తరింపజేయడానికే, ఈ వేంకటాచలం కొండలలో, వేదాలలో ప్రస్తుతించిన పరబ్రహ్మగా శ్రీనివాస భగవానుడి అర్చారూపంలో కొలువై ఉన్నది. స్వయంవ్యక్తంగా ఆవిర్భవించిన సాలగ్రామ దివ్యశిలావిగ్రహరూపంలో, అమిత తేజస్సుతో శ్రీవారు ప్రకాశిస్తూ ఉంటారు. తిరుమల యాత్రకు విచ్చేసే ప్రతిభక్తుడి అంతిమ లక్ష్యం, ముగ్ధమోహన దివ్యరూపంతో, పరమకరుణారూపంతో, విచ్చేసి దర్శించినవారందరినీ తన దివ్యాశీస్సులతో, శుభానుగ్రహాన్ని వర్షించే శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యదర్శనమనే మహద్భాగ్యంకోసమే, తండోపతండాలుగా, లక్షలాదిగా భక్తులు తిరుమలకు విచ్చేస్తూ ఉంటారు.

తిరుమల అన్నా, తిరుమలయాత్ర అన్నా మనందరి మనస్సు లోతులలో నుండి తిరుమలతో, శ్రీవారితో పెనవేసుకున్న అనేక జ్ఞాపకాలు, మధుర అనుభవాలు గుర్తుకువస్తాయి. శ్రీవారి భక్తులందరికీ, మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర మొదలైన ప్రాంతాలలో ఉన్న భక్తులందరికీ తిరుమలకి

విచ్చేసి శ్రీవారిని దర్శించడం అనేది, నెలకోసారో లేదా కనీసం సంవత్సరాని కొకసారి తప్పనిసరిగా ఆచరించే నియమం ఉన్నది. 90 ఏళ్ళ వృద్ధులైన, ఊహతెలిసిన పసివారైన ఆబాలగోపాలానికి శ్రీవారు వారివారి జీవితాలలో పెద్దదిక్కుగా నిలిచి, ప్రతి ఒక్కరు శ్రీవారితో ఎంత సన్నిహితంగా ఉంటారంటే ఆయనని వారి కుటుంబంలో పెద్దవాడిగా, తాతగారిగా భావించి పూజిస్తారు. నిర్మలమైన భక్తితో మనసారా 'గోవిందా' అని పిలిస్తే, ఆ పిలుపుకే ఆయన పొంగిపోతాడు. తన భక్తుల మొర ఆలకించి ఆ కొండలరాయుడు కురిపించే కరుణారస ప్రవాహంలో ఆ పండితులు, పామరులు, జిజ్ఞాసులు, వేదవేత్తలు, మఠాలు, పీఠాలయొక్క అధిపతులు, అర్థులు, దేశాధినేతలు, న్యాయాధికారులు అయిన భక్తజనం, తమ మనస్సు, తనువు ఆయనమీద లగ్నం చేసి, గుండెలనిండా ఆయన రూపాన్ని పదిలపరచుకుంటారు. ఒక్కక్షణకాలంపాటు దర్శనంతో పులకించిపోతారు. ఆ దివ్యమైన ఆనందమూ, శ్రీవారి విచిత్ర లీలలవలన కలిగే అనుభూతులూ అనుభవైక వేద్యం. అది ఎవరికివారూ స్వయంగా అనుభవించి అనుభూతి చెందాల్సిందే. ప్రతిభక్తుడు శ్రీవారిదృష్టిలో ప్రత్యేక స్థానాన్ని అలంకరించిన వాడే. ఆ విషయంలో ఆడ, మగా తారతమ్యం లేదు, బీద, గొప్ప తేడా లేదు, చిన్నాపెద్దా అనే వ్యత్యాసం లేదు, కుంటి, గుడ్డి, మూగా, చెవిటీ అన్న భేదములేదు, ఏ భాషవాడైన, ఏ ప్రాంతంవాడైన, కుల, మత, వర్గ, వర్ణ విచక్షణ మొదలైనవి లేనేలేదు. వారు చేయవలసిందల్లా భక్తితో 'గోవిందా' అని ఆయనను పిలవడమే. మహాభారతంలో కృష్ణుడు ఇలా అంటాడు.

**గోవిన్దేతి యదాక్రన్దత్ కృష్ణాయామ్ దూరవాసినమ్ ।**
**ఋణం ప్రవృద్ధమివ మే హృదయాన్నాపసర్పతి ॥**

ద్రౌపదీదేవి, నన్ను – 'గోవిందా! రక్షించు' అంటూ చేసిన ఆక్రన్దన, నా హృదయంలో ఋణం (అప్పు) పెరిగినట్లుగా పెరిగిపోతున్నది.



ద్రౌపదీదేవి కేవలం ఒక్కసారి మాత్రమే, నిర్మలమైన భక్తితో, 'గోవిందా' అంటూ నోరారా ఆర్తితో పిలిస్తే, అది శ్రీకృష్ణుని హృదయంలో, ఋణంపై వడ్డీ పెరిగినట్లు పెరిగిపోతున్నదట. అలాంటప్పుడు ప్రతిరోజూ అన్ని లక్షలమంది భక్తులు 'గోవిందా! గోవిందా!' అని శ్రీవారిని ఆర్తితో పిలుస్తూ ఉంటే వారి కష్టాలు తీర్చకుండా స్వామి ఉండలేడు.

మనసారా పిలిచిన అందరి కష్టాలూ తీరుస్తాడు, అందరి మాటలూ వింటాడు. ఆయన పొరపాటున వినకపోయిన, ఆయన వక్షఃస్థలంలో కొలువై ఉన్న పట్టపుదేవేరి లక్ష్మీదేవి ఊరుకోదు. భక్తుల మొర ఆలకించమని స్వామికి గుర్తుచేస్తుంది. అందరి సమస్యలూ చిటికెలో పరిష్కరిస్తాడు, వారి బాధను పంచుకుంటాడు. కష్టాల కడలిలోనుండి వెనువెంటనే తేలిగ్గా ఒడ్డున పడేస్తాడు. వారి మనస్సులోతులలోకి వెళ్ళి వారు కోరినా, కోరకపోయినా, వారికి ఆ సమయానికి ఏది యుక్తమో అది వెనువెంటనే ప్రసాదిస్తాడు. అటువంటి సర్వజగద్రక్షకుడైన శ్రీవేంకటేశ్వరుడు, తన భక్తులను తానే స్వయంగా పిలిపించుకుని, వారి మనస్సులలో ప్రేరణ కలిగించి, వారి ఇళ్ళనుండి బయల్దేరదీసి, తన దివ్యదర్శనాన్ని అనుగ్రహించి కృతార్థుని చేస్తాడు. అందుకే చాలామంది భక్తులనోట మనం వింటూ ఉంటాం, "ఎందుకో ఇంట్లో ఉండాలనిపించలేదు! అందుకే ఉన్నపళంగా అన్నీ పనులు విడిచిపెట్టి, ముందుగా శ్రీవారిదర్శనం చేసుకున్నాకగానీ నా మనస్సు కుదుటపడలేదు" అని వారి అనుభవాన్ని చెప్తూ ఉంటారు. శ్రీవారు ప్రేరణ కలిగించడం మూలాన్నే, వారి ఆకస్మిక తిరుమల ప్రయాణం జరుగుతూ ఉంటుంది.

ఇలా ఆ శ్రీవారి గురించి, ఆయన మహిమల గురించి, ఆయన భక్తులతో జరిపే లీలల గురించి ఎంత చెప్పుకున్నా తనివితీరదు, ఇంకా ఎంతో చెప్పుకోవలసినది మిగిలే ఉంటుంది. ఇప్పుడు ఈ రచనలోని ప్రధాన అంశం ధృవబేరం గురించి తెలుసుకుందాం.

ఆగమశాస్త్రంలో 'బేరం' అంటే 'విగ్రహం' అని అర్థం. 'ధృవము' అంటే కదిలించడానికి వీలులేనిది. స్థిరమైనది అని అర్థం. 'ధృవబేరం' అంటే ఆయా ఆలయాలలోని మూలవిరాట్టుని సూచిస్తుంది. ప్రాచీన సంస్కృత వాఙ్మయంలో, తిరుమలయాత్ర ఎలా చెయ్యాలి, శ్రీవారి ఆలయం ఎలా ఉంది, శ్రీవారి మూర్తివర్ణన ఇలాంటి అంశాలతో, అద్భుతమైన శ్లోకాలతో రచించబడిన 'శ్రీవేంకటేశ సేవాక్రమం' అనే గ్రంథం ఉన్నది. ఇది తిరుపతి గ్రామానికి చెందిన శ్రీవైష్ణవ భక్తుడు 'గర్గ్యశఠారి' రచించాడు. ఈ గ్రంథ రచనాకాలం ఎప్పటిది అని ఖచ్చితంగా చెప్పలేము కానీ ఈ గ్రంథంలో చెప్పిన విధంగా ఉన్న తిరుమల ఆలయ భౌగోళిక స్థితినిబట్టి ఇది సుమారు 15వ శతాబ్దంలో రచింపబడిన గ్రంథంగా చెప్పవచ్చు. ఎందుకు శ్రీవారి గురించి తెలుసుకోవడానికి ఈ 15వ శతాబ్దపు రచన 'శ్రీ వేంకటేశ సేవాక్రమం' ఎంచుకున్నామంటే, ముఖ్యంగా రెండు కారణాలు. ఇది ప్రాచీనమైనది. ఇక రెండవది, శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు అందరూ ఎప్పుడూ వారి పెద్దవారు తిరుమలతో తమకున్న అనుబంధాన్ని చెప్తూ, ఆ (మా)రోజుల్లో, శ్రీవారి ఆలయంలో రద్దీనే లేదు (సుమారు 1960/70 ప్రాంతంలో), శ్రీవారిని దర్శించుకునే వరుసక్రమం కూడా మహద్వారం వద్దనే ఉండేది. స్వామివారి ముందుకూర్చుని ఎంతసేపయినా దర్శించుకునేవాళ్ళం. ఎన్నిసార్లైనా దర్శనానికి వెళ్ళేవాళ్ళం. అని చెప్పేవారి అనుభవాలు, ప్రస్తుత కాలంలో ఉన్నవారికి కర్ణపేయంగా ఉంటుంది. ఎందుకంటే భక్తులందరికీ ఒక కలలాంటి ఆ పాత అనుభవం అపురూపమైనది మళ్ళీ తిరిగివచ్చేది కాదు కనుక, 15వ శతాబ్దపు రచనలో శ్రీవారిని వర్ణించిన విధం, 'శ్రీ గర్గ్యశఠారి' మాటలలో తెలుసుకుందాం.

**వేంకటేశ సేవాక్రమః**

**యశ్చక్రే వేంకటేశస్య సేవాక్రమమనుత్తమమ్ ।**
**తం శఠారిగురుం వందే గార్గ్యం శ్రీపురవాసినమ్ ॥**



అనే ప్రారంభ శ్లోకంలో తిరుపతికి ప్రాచీనమైన పేరు శ్రీపురం – శ్రీపదపురీగా పేర్కొనబడినది. ఇంకా ఈ గ్రంథప్రారంభంలో ఆళ్వార్‌తీర్థం (కపిలతీర్థం)లో స్నానమాచరించి అలిపిరి కాలినడకమార్గం గుండా భక్తుని తీర్థయాత్ర తిరుపతికి చేరుకుని, అక్కడ స్వామిపుష్కరిణిలో స్నానం, ముందుగా వరాహస్వామిదర్శనం, నాలుగు మాడవీధులు, శ్రీవారి ఆలయం రెండవ ప్రాకారం, మొదటి ప్రాకారం తర్వాత బంగారువాకిలిలో ప్రవేశించి స్నపనమండపం, అర్థమంటపం, (శయనమంటపం) గుండా ప్రవేశించి భక్తుడు స్వామిదర్శనానికై ఆతృతగా ఎదురుచూస్తూ ఉంటాడు అని వివరించబడినది. (మన ప్రస్తుత అంశం శ్రీవారి మూర్తిగురించి తెలుసుకోవడం కనుక మనం నేరుగా శయనమండపంలోకి వచ్చేశాము).

**ఉపసృత్య చ సోపానం కులశేఖరనామకమ్ ।**
**భయభక్తిసమాక్రాంతః పార్శ్వం దక్షిణమాస్థితః ॥ 64**

భక్తుడు, శయనమండపంలోనికి ప్రవేశించిన తర్వాత గర్భాలయ మొదటిగడప – కులశేఖరపడి వద్ద, గర్భగృహానికి కుడివైపు నిలబడి, మనసంతా భక్తితో, విస్మయచకితుడై, అద్భుతమైన సౌందర్యంతో అలరారుతున్న శ్రీవారిని దర్శించటం ప్రారంభిస్తాడు. తర్వాత స్వామివారిముందు పఠింపదగిన శ్లోకాలు, స్తోత్రాల గురించి చెప్పబడింది. రచయిత శ్రీవైష్ణవ సంప్రదాయానికి చెందటంవలన, సహజంగానే ఆళ్వార్ల పాశురాలు, సూక్తులు, రామానుజులవారి శరణాగతి గద్యశ్లోకాలు పఠించాలని పేర్కొన్నాడు.

**శఠారికలిజిత్సూక్తిం శరణాగతివాచికాః ।**
**శ్రీవేంకటేశవిషయః శ్రీనివాసమనః ప్రియాః ॥**
**తదీయ ప్రవరైః సార్థం గద్యం చాప్యనుసందధత్ ॥**

వేంకటేశ సేవాక్రమ గ్రంథరచయిత చక్కగా స్వామిని దర్శించుకుని, నెమ్మదిగా స్తోత్రాలు పఠించే విషయం గురించి తెలియజేశాడు. కానీ ఈ కలియుగంలో, శ్రీవారిమీద భక్తితో, తండోప తండాలుగా, ఊహించని సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేస్తారని ఊహించలేకపోయాడు. గంటలతరబడి, ఒకరి తర్వాత ఒకరు, వరుసక్రమంలో తమవంతు వచ్చేవరకు అమితమైన భక్తితో వేచిఉండి, కేవలం కొన్ని క్షణాలపాటు స్వామివారిని దర్శించే భాగ్యాన్ని భక్తుడు పొందుతాడు. కానీ ఇక్కడ రచయిత పేర్కొన్నట్టు స్తోత్రాలు పఠించడానికి, ప్రస్తుతకాలంలో సమయం ఉండదు.

అనంతరం, రచయిత గర్భగృహంలో వేంచేసియున్న మూల విరాట్‌ని, సాంప్రదాయం ప్రకారం, 'ఆపాదమౌళి పర్యంతం', అనగా పాదములనుండి శిరస్సువరకు వర్ణిస్తాడు. భక్తుడు అదృష్టవంతుడైతే, ప్రవాహంలా వచ్చే భక్తజనసంద్రం మధ్యలో, స్వామివారి అనుగ్రహంతో కొన్ని క్షణాలు అదనంగా, గర్భగృహ మధ్యన, ఠీవిగా వేంచేసిన, మహిమాన్వితమైన శ్రీవారి ధ్రువబేరాన్ని దర్శించుకుంటాడు. గర్భగృహం మధ్యన మూలవిరాట్టు నిలబడి ఉన్న స్థానం గురించి కొంతవివరణ అవసరం. మామూలుగా ఇతర శ్రీవైష్ణవక్షేత్రాలలో మూలవిరాట్ గర్భగృహం వెనుక ఉన్న గోడని ఆనుకుని ఉంటాడు.

## గర్భాలయ వాస్తు పదవిన్యాసం

ఆగమశాస్త్ర మరియూ శిల్పశాస్త్ర ప్రకారం, గర్భగృహం మొత్తం ముఖ్యమైన వాస్తుమండలంగా పిలువబడుతుంది. గర్భగృహం మొత్తం ఒక చతురస్రం అనుకుంటే, దానిని మరిన్ని చిన్న చతురస్రాలుగా సమానంగా విభజిస్తే, అది శిల్పశాస్త్రం ప్రకారం 'పదం' అవుతుంది. మానసార శిల్పశాస్త్రం ప్రకారం, 32 రకాలుగా మండలాన్ని పదాలుగా



విభజించే వీలున్నా, తిరుమల ఆలయానికి సంబంధించి, రెండు విధానాలు ముఖ్యమైనవి.

**పద్మగర్భ –** గర్భగృహ చతురస్రాన్ని మొత్తం 256 చిన్నపదాలుగా విభజించడం. మరియు

**స్తండిల –** గర్భగృహాన్ని 49 పదాలుగా విభజించడం.

అలాగే ఈ వాస్తుమండలం, లోపల మధ్యలో ఉన్న చతురస్రాన్ని 'బ్రహ్మ' మండలం అని, దాని తర్వాత ఉండే చతురస్రాన్ని 'దైవిక' దాని తరువాతది 'మానుష', బయటివైపున్న చతురస్రాన్ని 'పైశాచ' అని పిలుస్తారు.

వైఖానస ఆగమం, గర్భగృహ వాస్తు పదవిన్యాసం కొరకు, ఈ రెండు పద్ధతుల్ని అనుమతిస్తుంది. కేవలం ధ్రువబేరాన్ని మాత్రం గర్భగృహంలో స్థాపించాలనుకుంటే, అది బ్రహ్మస్థానంలో లేక దైవికస్థానంలో ప్రతిష్ఠించాలి. ఇక ఆలయంలో లోహంతో తయారుచేసిన మూలవిరాట్టుకి నకలు ప్రతిమయైన కౌతుకబేరంతో కలిపి ప్రతిష్ఠించాలంటే, అప్పుడు కౌతుకబేరం బ్రహ్మస్థానంలో ఉంటుంది. ధ్రువబేరం మాత్రం దైవికభాగంలో కొద్దిగా వెనుకగా ప్రతిష్ఠింపబడుతుంది. ఎందుకంటే ఏ ఆలయంలో అయినా, కౌతుకబేరం ప్రతిష్ఠించబడితే, కర్మార్చన అంతా ఆ బేరానికే జరుపాలి. అందుకే కౌతుకబేరాన్ని బ్రహ్మస్థానంలో ప్రతిష్ఠించాలి. తిరుమలలో శ్రీవారి గర్భగృహంలో ధృవబేరం, కౌతుకబేరం శ్రీభోగశ్రీనివాసమూర్తి ఉన్నారు కాబట్టి, బ్రహ్మస్థానంలో భోగశ్రీనివాసుడు, ఆయన వెనుక దైవికభాగంలో మూలవిరాట్టు ప్రతిష్ఠించబడినారు. ఇంకా ఒక్కొక్క స్థానంలో మూర్తిని ప్రతిష్ఠించి ఆరాధిస్తే ఒక్కొక్క ఫలితం వైఖానస ఆగమంలో చెప్పబడినది.

**బ్రహ్మస్థానం –** శాంతి, సౌభాగ్యం, పుష్టి, ఆధ్యాత్మిక ఉన్నతి (మోక్షం)వంటి ఫలితాలుకోరే సాధకుడు బ్రహ్మస్థానంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆరాధించాలి.

**దైవికస్థానం –** ఆరోగ్యం, పోషణ, భౌతిక అవసరాలు, సుఖసంతోషాలు.

**మానుషస్థానం –** విజయం, పరాక్రమము.

**పైశాచస్థానం –** విపత్కరం, నాశనం (శత్రువులకి). (ఇది సర్వత్రా నివారించదగినది).

## బేరములు – రకములు

తిరుమల ఆలయం ప్రాచీనకాలం నుండి కూడా 'ఏకబేర ఆలయం'గా ప్రసిద్ధి చెందినది. అంటే ఆలయంలో కేవలం ఒకేమూర్తి మూలవిరాట్టుగా పూజలందుకుంటారు. ఈ స్వామిని ప్రాచీన తమిళసాహిత్యంలో 'వేంగడత్తాన్', 'వెంగడవా', 'తిరువేంగడముడైయాన్' అని పేర్కొన్నారు. అనగా వేంకటపర్వతానికి అధిపతియైన దేవుడు. అదే సంస్కృతంలో వేంకటాచలపతి, వేంకటేశ, వేంకటేశ్వర, వేంకటరమణ అయింది. రామానుజులవారు శ్రీవారిని 'శ్రీనివాసుడనే' పేరుతో స్తుతించారు తన శ్రీభాష్యగ్రంథం ప్రారంభ ప్రార్థనా శ్లోకంలో –

**అఖిల భువన జన్మస్థేమ భంగాదిలీలే ।**
**వినత వివిధ భూత వ్రాతరక్షైకదీక్షే ।**
**శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే ।**
**భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥**

ఎవరు సమస్త విశ్వము, సృష్టియొక్క సృష్టి, స్థితి, లయకారకులో, తనను శరణాగతి చేయు సర్వప్రాణికోటిని రక్షించుచున్నాడో, అటువంటి పరబ్రహ్మ స్వరూపమైన శ్రీనివాసునికి నమస్సులు అని స్తుతించాడు. తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారికి జరిగే నిత్య, నైమిత్తిక, కాలోత్సవాదులలో సంకల్పంలో, వైఖానస అర్చకులు 'శ్రీ శ్రీనివాస స్వామినే నమః' అని చెప్పే సంప్రదాయం ఉన్నది. 'శ్రీ–నివాసుడు' అనగా తన దివ్య పట్టమహిషి, నిత్యానపాయినీ అయిన లక్ష్మీదేవి నివాసస్థానం, స్వామివారు కుడివక్షస్థలంలో లక్ష్మీదేవిని ధరించినవాడు అని అర్థం. శ్రీ వేంకటేశ్వరస్వామి లేక శ్రీ శ్రీనివాసస్వామి ధ్రువబేరం, రూపం మనకు లభించిన ఆగమ, శిల్పశాస్త్ర గ్రంథాలలోని విష్ణుమూర్తి విగ్రహవర్ణనలకు సరిపోలటం లేదన్నది నిజం. బహుశా స్వామివారి అర్చావిగ్రహం ఆగమ, శిల్పశాస్త్రాల కన్నా ప్రాచీనమైనదిగా భావించాలి. తిరుమల గర్భగృహంలోని సుమారు 8 అడుగుల ఎత్తైన, గంభీరమైన, మంత్రముగ్ధమైన సమ్మోహనరూపం, విష్ణువుయొక్క ముఖ్య ఆయుధాలైన శంఖ, చక్రాలను కలిగిలేదు. మనము ఇప్పుడు చూస్తున్న మూర్తిలో పైహస్తాలకు, శంఖ, చక్రాల బంగారు కవచాలు తొడిగియున్నారు. నిజరూపంలో ఆయుధాలు లేవు. ఇది రామానుజులవారి కాలంలో జరిగిందని ఆలయఐతిహ్యం చెప్తున్నది. కానీ వైఖానస ఆగమరీతిగా ఉన్న విష్ణువు అర్చారూపాలలో, ఆయుధరహితంగా ఉన్న రూపాలు కూడా ఉన్నాయి.



వైఖానస సంహితల ప్రకారం, ఆలయంలో విష్ణువు విగ్రహం మూడు విధాలుగా ఉండవచ్చు. అవి స్థానక – నిలబడి ఉన్న, ఆసీన – కూర్చుని ఉన్న, శయన – పడుకుని ఉన్న రూపాలు ఒక్కొక్క విధంలో మళ్ళీ నాలుగు రకాల విగ్రహాలు చెప్పబడినాయి. అవి కాశ్యప జ్ఞానకాండ ప్రకారం యోగ, భోగ, వీర, విరహ. మరీచి విమానార్చనాకల్పం ప్రకారం యోగ, భోగ, వీర మరియూ అభిచారిక రకాలుగా ఉండొచ్చు. ఏయే రకంగా విగ్రహాన్ని స్థాపిస్తే, వాటిననుసరించి ఫలితాలు చెప్పబడినాయి.

**యోగ** – మోక్షాన్ని కాంక్షించే సన్యాసులు, ఏకాంతులు, సర్వసంగపరిత్యాగులు ఇటువంటి మూర్తిని ప్రతిష్ఠించాలి, పూజించాలి.

**భోగ** – భౌతికమైన సుఖసంతోషాలను కోరుకునేవారు, శ్రేయస్సు, ఆనందం కోరేవారు ఆరాధించాలి.

**వీర** – బలము, అధికారము, విజయం కోరేవారు ఆరాధించాలి.

**అభిచారిక** – మంత్రగాళ్ళు, మాంత్రికులు, వశీకరణ, శతృసంహారం మొదలైన క్షుద్ర ఉపాసకులు ఆరాధించే రూపం. ఇది సర్వత్రా నివారించదగినది.

తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారు స్థానకభంగిమలో నిలబడి, ఏకబేరమూర్తిగా ప్రారంభంలో పూజింపబడినారు.

**ఏకబేర ప్రతిష్ఠాయాం దేవ్యౌ న స్థాపయేత్పునః ।**

**(భృగు క్రియాధికారం)**

స్వామివారు స్వయంవ్యక్తంగా ఆవిర్భవించినారు, ప్రతిష్ఠింప బడలేదు. కాశ్యప జ్ఞానకాండ (అధ్యా.53) ప్రకారం 'యోగమూర్తియైన విగ్రహమునకు శ్రీ, భూదేవేరులు లేక ఏకమూర్తిగా ఉండును, కానీ కుడివైపు మార్కండేయుడు, ఎడమవైపు భృగువు విగ్రహాలు ఉండాలి. 'భోగ'మూర్తికి ఇరువైపులా లక్ష్మీదేవి, భూదేవి, మార్కండేయ, భృగుసహితంగా ఉంటారు. 'వీర' మూర్తి – దేవీభ్యాం రహితం అంటే అమ్మవార్లు లేకుండా అలాగే ఆయుధాలు – శంఖ, చక్రాలు లేకుండ (శంఖచక్రాభ్యాం రహితం) ఉంటారు. కనుక తిరుమల శ్రీవారు వైఖానసాగమం ప్రకారం వీరస్థానకమూర్తిగా పరిగణించవచ్చు. అలాగే ఆగమాల ప్రకారం యోగమూర్తి ప్రతిష్ఠ పర్వతాలపైన, అరణ్యమధ్యంలో ఉంటుందని తెలుపబడింది. ఈ ఆగమ అంశాల ఆధారంగా



శ్రీవారిమూర్తి స్వరూపం, "స్థానక యోగ విరహమూర్తి"గా, చెప్పవచ్చును. ధృవబేరము ఒకవిధంగా చెప్పాలంటే వేదాంతములో నిర్వచించిన పరబ్రహ్మస్వరూపం. సంపూర్ణమైనది, అతీతమైనది మరియు అర్థం చేసుకోలేని, అంతుచిక్కనిది పరబ్రహ్మతత్త్వము.

**బ్రహ్మాదయోపి తద్రూపలక్షణ నిశ్చయం జ్ఞాతుమశక్తాః**
**తద్రూపం భక్తితూలికయా సంకల్ప్య ।**
**వర్ణైరాలిప్యాలోకయన్తి తస్మాద్భక్తిరేవ కారణమ్**
**తత్రాతోభీక్షణ దర్శనయోగ్యం భగవద్రూపం కల్పయేత్ ॥**

**(కాశ్యప జ్ఞానకాండ–అ.51)**

సాక్షాత్తూ చతుర్ముఖబ్రహ్మకానీ, మరి ఏ ఇతర దేవతయైనా శ్రీమహావిష్ణువు రూపలక్షణములను పరిపూర్ణముగా తెలుసుకొనుటలో అశక్తులైనవారవుతూ, స్వామివారి స్వరూపమును భక్తియను తూలికతో ఆయా వర్ణములను సంకల్పించి రూపకల్పనచేసి సాక్షాత్కరింపచేసుకుని ఆనందించెదరు. ఈ సృష్టికి భక్తియే మూలము. ఈ సృష్టివలన భగవానుని దివ్యమంగళవిగ్రహము మరుగునపడక నిరంతరము దర్శనమివ్వుటకు అనువగును.

అందుకే తిరుమల శ్రీవారు, అందరికీ ఒకేవిధమైన అనుభూతితో దర్శనమివ్వడు. ప్రతిభక్తుడు, తనకే ప్రత్యేకమైన, దర్శన దివ్యాను భూతులను, తన మనస్సులో, హృదయంలో అనుభవిస్తాడు. ఇది తిరుమల శ్రీవారి ఆలయానికి మాత్రమే ఉన్న ఒక ఏకైకలక్షణం. గర్భగృహంలో ఏదో ఒక రహస్యం ఉంది. అది మనోహరముగా మరియూ అంతుచిక్కని విధంగా, ఉండే అనుభూతిని ఏకకాలంలో కలిగిస్తుంది. శ్రీవారి విగ్రహం ఉందని అనుభూతి చెందుతున్నాము కానీ గ్రహించలేము, స్వామిమూర్తి ఇలా ఉందని భావిస్తారు. కానీ

మనస్సులో పదిలపరచుకోలేము. స్వామిదర్శనం పరిపూర్ణంగా సంతృప్తి కలిగిస్తుంది. మన మనస్సులో అన్ని కలతలను రూపుమాపుతుంది కానీ మళ్ళీ మళ్ళీ చూడాలి, ఇంకా కావాలి అని అనిపిస్తుంది. స్వామివారిమూర్తి మానవుల ఊహకుకూడా అందనటువంటి సర్వశక్తివంతమైన ఆధ్యాత్మిక చైతన్యంతో నిండివుంటుంది. అందుకే శ్రీవారిని నేరుగా పూజించడం ఆగమరూపంగా కష్టసాధ్యం. దీనికోసమే ఆగమశాస్త్రం ధృవబేరానికి, భక్తునికి మధ్య, కౌతుకబేరం ఉండాలని పేర్కొంటోంది.

**ధృవస్య శక్తిం తత్కాలే సమావాహ్య చ కౌతుకే ॥**

**(భృగువు ఖిలాధికారం)**

ఆరాధన సమయంలో, ధృవబేరంలో ఉన్న శక్తిని కౌతుక బేరంలోనికి మళ్ళించాలి. శ్రీవారి ఆలయంలో ఉన్న పంచ బేరాలు, ఇతరబేరాలు గురించి ముందుముందు క్లుప్తంగా తెలుసుకుందాం.

## శ్రీనివాసుని దివ్యస్వయంవ్యక్త సాలగ్రామరూపం

**శ్రీభూమి నీళాదేవీనాం దివ్యహస్తోపలాలితౌ ॥ (97)**

**శరణ్యౌ చాశరణ్యానాం శంఖచక్రాది చిహ్నితౌ । (98)**

**విలాస విక్రమక్రాంత త్రైలోక్యౌ లోకపావనౌ ॥**
**ప్రాప్య ప్రాపక భావేన ప్రపన్నై పరభక్తితః ।**
**సేవేయ శ్రీనివాసస్య చరణౌ జలజోపమౌ ॥ (101)**

**కదలీకాండకాంతోరుయుగలం చాతిసుందరమ్ ।**
**దివ్యపీతాంబరాశ్లిష్టం దీపకాంచిగుణోజ్జ్వలం ॥ (103)**

**కటితటం చ రుచిరం కాంతఖడ్గవిరాజితమ్ ।**
**వందారు భవవారాశి కటిదఘ్నత్వసూచకమ్ ॥ (104)**



**కరం వామం కటిన్యస్తం కణత్కంకణభూషణమ్ ।**
**వైకుంఠమేతద్ధామేతి వ్యంజకం దక్షిణం కరమ్ ॥ (105)**

**రమ్యే లలాటే విలసదూర్ధ్వపుండ్రం లలాటికామ్ ।**
**లసద్రత్నకిరీటం చ జగన్నాథత్వసూచకమ్ ॥ (112)**

**(శ్రీవేంకటేశ సేవాక్రమః)**

గర్భగృహంలో కొలువై ఉన్న శ్రీవారి ధృవబేర శిల్పలక్షణముల గురించి నేరుగా చూసినట్లు వర్ణించబడినది. శ్రీవారిమూర్తి దర్శనం, ఎంతోకాలం నుండి ఎదురుచూస్తున్న గొప్పసదవకాశంగా భక్తుడు భావిస్తాడు. ఎంతో ఆతృతతో ఎదురుచూస్తూ, దీనిని నెరవేర్చుకోవడం కోసం, ఎన్ని కష్టనష్టాలైన ఓర్చుకుని ప్రయాణంచేసి వస్తాడు. అమితమైన ఉత్సాహంతో, భక్తిపారవశ్యంతో గర్భగృహం ముందు నిలబడతాడు. పొంగిపొరలుతున్న భక్త్యావేశంతో తన చిరకాల వాంఛ నెరవేరింది అన్న దివ్యభావనలో మునిగి ఉంటాడు.

భక్తుడు ఎటువంటి తొందరపాటు లేకుండా ప్రశాంతంగా శ్రీవారిముందు నిల్చుని, చూపు తిప్పుకోలేని అందంతో వెలిగిపోతున్న స్వామివారిని, తనివితీరా దర్శిస్తూ, స్వామి అర్చావిగ్రహంలోని అందమైన కళాఖండాలుగా వెలుగొందుతున్న వివిధభాగాలను, విప్పారిన నేత్రాలతో దర్శనం చేసుకొంటాడు. ఇప్పుడున్న పరిస్థితులలో ఇది ఎంతమాత్రం సాధ్యంకాదు. ఏదో అందరితోపాటు వరుసక్రమంలో వేగంగా దర్శనం చేసుకోవడం తప్ప, ప్రాచీన సంప్రదాయాన్ననుసరించి, ముందుగా స్వామివారి దివ్య శ్రీపాదపద్మాలతో ప్రారంభించి, కిరీటంవరకు, ఆపాదమౌళి పర్యంతం ఈ గ్రంథం వర్ణిస్తుంది. 'సర్వధర్మాన్ పరిత్యజ్య...' అనే చరమశ్లోకానికి ప్రతీకగా స్వామివారి దివ్య శ్రీపాదపద్మాలు, భక్తులు ఆశ్రయించి తరించడానికి ఏకైక మార్గంగా దర్శనమిస్తూ 'శరణ్యౌ చ

అశరణ్యానామ్' అని మనలను తరింపజేస్తున్నాయి. ఈ పాదపద్మములు భక్తుని హృదయపద్మములో వికసించాలి. భక్తుల శిరస్సుపై అనుగ్రహించాలి అందుకే శ్రీవారి సుప్రభాతంలో 'ప్రపత్తి' అను స్తోత్రం 'శ్రీవేంకటేశ చరణౌశరణం ప్రపద్యే' అని 15 శ్లోకాలలో వర్ణిస్తుంది.

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి స్వయంవ్యక్త దివ్యసాలగ్రామ శిలావిగ్రహసౌందర్యం నిస్సందేహంగా, ఈ భూమండలంలో ఎక్కడా కనీవినీ ఎరుగని అపురూపమైన శిల్పకళాసౌందర్యంతో అలరారుతూ ఉంటుంది. ఇది ఎటువంటి శిల్పిచేత చెక్కబడకుండా, స్వయంవ్యక్తంగా, స్వామివారే ఇచ్ఛాపూర్వకంగా ఇక్కడ వెలసారు అని భక్తుల విశ్వాసం. స్వామివారిమూర్తి, కొన్ని వేలసంవత్సరాల నాటి అపురూపమైన, అత్యంత ప్రాచీనమైన విగ్రహరూపం అని స్పష్టంగా తెలుస్తున్నది. స్వామిరూపం స్వయంవ్యక్తమని మనకు పురాణాలు, స్థానికచరిత్రలు, ఐతిహ్యాలు తెలుపుతున్నాయి. కానీ ఒకవేళ నిజంగా ఈ విగ్రహాన్ని ఏ శిల్పియైన చెక్కి ఉంటే, అది కేవలం దైవసంకల్పంతో మాత్రమే శిల్పిచాతుర్యం, నైపుణ్యంతో సంబంధం లేకుండా చేసినది అయి ఉంటుంది. ఆ చెక్కిన శిల్పి దైవం చేతిలో ఒక పావుగా మారి చెక్కి ఉంటాడు. ఈ మూర్తి ఒక గొప్ప శిల్పకళావైచిత్రితో నిండిన, పరిపూర్ణమైన భక్తివల్ల మాత్రమే సాధ్యమైన రూపం. ఇదంతా అసాధారణమైన తెలివి, కృషి, నైపుణ్యం, మేధస్సు ఉన్నా కూడ చెక్కలేని రూపం. ఈ సందర్భంగా, పాతతరం శ్రీవారి అర్చకులు అనూచానంగా చెప్పుకునే ఒక విషయం ప్రస్తావించదగినది. ద్వాపరయుగాంతమున శ్రీకృష్ణపరమాత్మ అవతార సమాప్తి అయిన తర్వాత దివ్యతేజోరూపంలో ఆయన శక్తి ఆకాశానికి ఎగిసిందిట. ఆ కాంతిపుంజం నెమ్మదిగా, ఒక సాలగ్రామ శిలాకృతిని సంతరించుకున్నది. ఆ సాలగ్రామశిలను, శ్రీమహావిష్ణువు తన సంకల్పంతో, పాలసముద్రతీరానికి రప్పించాడట. అక్కడ దేవశిల్పి విశ్వకర్మ, మయుడు ఇద్దరినీ తన రూపాన్ని చెక్కమని ఆదేశించాడట. వారిరువురూ ఉలితో చెక్కుదామని ఆ సాలిగ్రామశిలపై ఉలిని ఉంచగానే, అది వారి ప్రమేయం లేకుండా ఏదో మంత్రం వేసినట్లుగా, తనంత తాను శ్రీమహావిష్ణువు సంకల్పంతో, కదిలి శ్రీవారిరూపాన్ని అత్యద్భుత సౌందర్యంతో రూపుదిద్దినదట. విష్ణుశక్తి మయమైన ఆ సాలగ్రామ శిల, చతుర్భుజాలతో, కటివరదహస్తాలతో, వక్షస్థలంలో లక్ష్మీదేవిని ధరించిన శ్రీనివాసుడి రూపాన్ని సంతరించుకున్నదట. విశ్వకర్మ, మయుడు సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ ఉండగానే, శ్రీవారిమూర్తి అంతరిక్షంలోకి ప్రయాణంచేస్తూ నేరుగా వేంకటాద్రి పర్వతంపై వెలిసినదట. ఇది కేవలం అనూచానంగా అర్చక కుటుంబాలలో చెప్పుకునే కథేగాని దీనికి ఆధారంగా ఎటువంటి పురాణ ఇతిహాసాలలో కథనం లేదు.



శ్రీవేంకటేశ్వరుని ధృవమూర్తి, దాదాపుగా పురాణాలలో వర్ణించిన విధంగానే ఉంటుంది. ప్రశాంతమైన రూపంతో, చతుర్భుజాలతో స్వామివారు కనిపిస్తారు. సాధారణంగా శ్రీమహావిష్ణువుకి యిరువైపులా ఉండే, లక్ష్మీ, భూదేవి అమ్మవార్లు లేకుండా, ఏకబేరమూర్తిగా దర్శనమిస్తారు. పై రెండు చేతులలో, తన దివ్యాయుధాలైన సుదర్శనచక్రం, పాంచజన్యశంఖం ధరించి ఉన్నాడు. నీలమేఘశ్యాముడు అని పురాణాలలో వర్ణించినట్లుగానే, శ్రీవారిమూర్తి వర్ణం, వర్షించటానికి సిద్ధంగా ఉన్న నల్లటి మేఘఛాయలో కనిపిస్తుంది. క్రింది ఎడమచేయి నడుమువద్ద (తుంటి) మరియూ కుడిచేయి వరదముద్రలో, వరప్రదాయకునిగా స్వామివారి మహిమను సార్థకంచేస్తూ కనిపిస్తుంది. స్వామి పీతాంబరాన్ని ధరించి ఉన్నాడు. శ్రీవారి బాహువులు పొడవుగా, చక్కటి ఆకృతితో, కుదురైన, నిండైన విగ్రహరూపంతో కనిపిస్తుంది. శ్రీవారి కనులు అతి సుందరంగానూ, నాసిక కొనదేలి ఉంటుంది. శ్రీవారి వక్షఃస్థలం విశాలంగా, ప్రస్ఫుటంగా ఉంటుంది. కుడివక్షఃస్థలంలో శ్రీవారి దేవేరి, ఆయనను ఎన్నడు విడిచి ఉండలేని (నిత్యానపాయినీ) లక్ష్మీఅమ్మవారు, శ్రీవత్సం

అనే పుట్టుమచ్చ రూపంలో, త్రికోణమండలంలో కనిపిస్తారు. రెండు కర్ణములలో మకరకుండలాలు ధరించియున్నారు. శ్రీవారిమూర్తి సౌందర్యం వర్ణించలేనిది. ఇదే విషయం ప్రతినిత్యం శ్రీవేంకటేశ సహస్రనామావళిలో 972వ నామం "కోటి మన్మథలావణ్యాయ నమః" అని స్తోత్రం చేయబడినది. శ్రీవారి దివ్యరూపం కోటిమన్మథుల సౌందర్యంతో వెలిగిపోతూ ఉంటుంది.

**కందర్ప దర్పహర సుందరదివ్యమూర్తే ।**
**కాంతా కుచాంబురుహ కుట్మలలోలదృష్టే ॥**

**(శ్రీవేంకటేశ్వర సుప్రభాతమ్)**

మన్మథుని గర్వము అణచు దివ్యసుందర శరీరముకలవాడు శ్రీనివాసుడు అని సుప్రభాతం వర్ణిస్తున్నది.

తన ప్రియభక్తుల కోరికలు, కష్టాలు తీర్చడంకోసం స్వామివారు తన శంఖచక్రాలను కూడా విడిచి తిరుమలలో దర్శనమిస్తున్నారు. భక్తుడైన తొండమాన్ చక్రవర్తికి శంఖ, చక్రాలను శ్రీవారు ఇచ్చిన విషయం పురాణాలలో పేర్కొనబడింది. ప్రస్తుతం మూలవిరాట్ నిజరూపంలో పైహస్తాలలో శంఖ, చక్రపు బంగారు కవచాలున్నాయి. భగవద్రామానుజులు (1017-1137) వారు శ్రీవారి మూలమూర్తికి ఈ కవచాలను ధరింపజేశాడని భక్తుల విశ్వాసం. కానీ వైఖానస సంహితలలో చెప్పబడిన విధంగా, శ్రీవారిమూర్తి వీరస్థానకమూర్తి కనుక, ఆయన రెండు పైచేతులలో (నిజరూపంలో) శంఖచక్రాలు లేనంత మాత్రాన ఆయన విష్ణుమూర్తి కాదు అని చెప్పడానికి లేదు.

## వ్యూహలక్ష్మీ

భవిష్యోత్తర పురాణం (అ.13, శ్లో. 82-85) శ్రీవారివక్షఃస్థలంపై కొలువై ఉన్న లక్ష్మీ అమ్మవారి గురించి పేర్కొంటున్నది.



**పద్మావతీం విశాలాక్షీం భగవానాత్మవక్షసి ।**
**అరిశంఖవిహీనోఽసౌ కటిన్యస్తకరోత్తమః ॥**

**దర్శయన్ పాణినైకేన దక్షిణేన వృషాకపిః ।**
**పదపద్మం సురారాధ్యం గతిం చ పరమాం నృణామ్ ॥**

**కటిన్యస్తకరేణాపి నిజపాదాబ్జగామినామ్ ।**
**నృణాం భవపయోరాశిం కటిదఘ్నం ప్రదర్శయన్ ॥**
**విరాజతే వేంకటేశః సంప్రత్యపి రమాపతిః ।**

**(భవిష్యోత్తర పురాణం)**

తొండమాన్ చక్రవర్తి నిర్మించిన ఆనందనిలయవిమానంతో కూడిన ఆలయంలో శ్రీనివాసుడు దివ్యదర్శనమిచ్చెను. లక్ష్మీదేవి పద్మాసనమున, తామర రేకులవంటి కనులుగల పద్మావతిని తన వక్షఃస్థలమున ధరించి, శత్రుభయములేనివాడై, నడుమువద్ద ఎడమ చేతినుంచుకుని, కుడిచేతితో దేవతలకు తన పాదపద్మములు పూజింపతగినదియు, మానవులకు ఉత్కృష్టగతి కలిగించెనని తెలుపుచూ, నడుమున ఉంచుకొనిన చేతితో తన పాదారవిందముల నాశ్రయించిన మనుషులకు, సంసారసాగరము మొలబంటి లోతుమాత్రమే యుండునని చూపుచు, శ్రీనివాసుడు ప్రకాశించుచున్నాడు. లక్ష్మీదేవి వక్షఃస్థలమున కొలువై ఉన్నందువల్ల శ్రీవారు, 'శ్రీ'నివాసుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు. లక్ష్మీదేవి ఆవాసస్థలం శ్రీవారి కుడివక్షఃస్థలం ఈ విధమైన రూపంలోని లక్ష్మీదేవి, వైఖానసఆగమంలో ద్విభుజములతో, కమలంమీద పద్మాసనిగా ఉంటుందని, అటువంటి రూపాన్నే 'వ్యూహలక్ష్మీ' అనేపేరుతో పూజింపబడునని చెప్పబడింది.

**ద్విభుజ వ్యూహలక్ష్మీః స్యాత్ బద్ధపద్మాసనప్రియా ।**
**శ్రీనివాసాంగమధ్యస్థా సుతరాం కేశవప్రియా ॥**

**(వరాహపురాణం అ. 39-29)**

వైఖానససంహితయైన కాశ్యపజ్ఞానకాండలో

**పృథుతరనితంబ బింబాం శ్వేత కౌశేయవస్త్రాం దేవీం**
**దేదీప్యమానమేఖలాం అనాది యౌవన సౌభాగ్యం**
**ధృతహస్తసితపంకజయుగాం వరదైకహస్తాం ధృతమంజరీం**
**వా ద్వాభ్యాం హస్తాభ్యాం ధృతకమలాం హృద్యాం ....**
**....పుణ్యా ప్రజాధనాయూంషి యశః శ్రీః ప్రజ్ఞాయోగార్ధ**
**యశ్చ భవిష్యన్తి. (కాశ్యపజ్ఞానకాండ – అ.38)**

అమ్మవారిని పృథుతర నితంబ బింబము కలదిగా, తెల్లటి పట్టువస్త్రము ధరించినదిగాను, దేదీప్యమైన మేఖలాబంధము (నడుముకి ధరింపజేసే ఆభరణం–వడ్డాణం) కలదిగాను, అనాదియైన యౌవన సౌభాగ్యము కలదిగాను, రెండుచేతులయందు ధరించిన శ్వేతపంకజములు గలదిగాను, లేక ఒక హస్తము వరదముద్ర లేదా ఏదేని ఆభరణముతోను లేక ఉభయహస్తములలో కమలములు ధరించినదిగాను, మనోహర రూపము కలదిగాను ఉండునట్లు లక్ష్మీ అమ్మవారి రూపమును నిర్మించి, ప్రతిష్ఠించి పూజించవలెను. ఇట్లు సంస్థాపించబడి, అర్చించిన దేవి కృపవలన అభూతి, అసమృద్ధి, అలక్ష్మీయను నవ లక్షణములు నశించి ధనం, సంతానం, ఆయుష్షు, యశస్సు, కీర్తి, తెలివి, సంపద, రాజయోగము లభించునుయని చెప్పబడింది. వ్యూహలక్ష్మిని ప్రతిష్ఠించి ఆరాధించటం వలన, అపరిమితమైన సంపద, శాశ్వతమైన యశస్సు కలుగుతుంది – నిరవధిక సమృద్ధి సిద్ధయే ॥ ప్రతినిత్యం ప్రాతఃకాలంలో శ్రీవారి తోమాలసేవ కొలువు అనంతరం జరిగే శ్రీవేంకటేశ సహస్రనామార్చనలో స్వామివారిని తులసీదళములతో అర్చించిన తర్వాత వైఖానస అర్చకులు శ్రీవారి వక్షఃస్థలంపై కుడివైపున వేంచేసియున్న సువర్ణలక్ష్మీదేవి ప్రతిమకు, ఎడమవైపున వేంచేసియున్న సువర్ణ పద్మావతీదేవి ప్రతిమకు, శ్రీవారి పాదతులసితో, వరాహపురాణాంతర్గత లక్ష్మీచతుర్వింశతి నామావళి



సహితంగా అర్చన జరుగుతుంది. అలాగే శ్రీవారి మూలవిరాట్ కంఠాభరణంలో వేంచేసియున్న ఈ సువర్ణలక్ష్మీదేవికి, శుక్రవారంనాడు మూలవిరాట్టుకి జరిగే అభిషేకం అనంతరం, ప్రత్యేకంగా శ్రీసూక్తపఠనంతో హరిద్రా, చందనసహితంగా ఏకాంతతిరుమంజనం జరుపబడుతుంది.

భగవద్రామానుజులవారు యాదవరాజుకి ప్రేరణ కలిగించి, శ్రీవారికి ధరింపజేసే కంఠాభరణంగా, ఈ సువర్ణలక్ష్మీదేవిని సమర్పించారని వేంకటాచలేతిహాసమాల తెలుపుతున్నది. ఈ అమ్మవారిని, సంప్రదాయ కథనం ప్రకారం, ఒక శుక్రవారం, రత్నమాలికాయోగంలో (శుక్లపక్షంలో 12వతిథి, ఉత్తరఫల్గుణీ నక్షత్రం కలిసిన ఒక యోగం) ప్రతిష్ఠించినట్లు ఐతిహ్యం. అప్పటినుండి ఈ అమ్మవారికి ప్రత్యేక ఆరాధన, నివేదన, అభిషేకాదులు జరుపబడుతున్నాయి. తిరుమలలో ప్రతి శుక్రవారం, శ్రీవారి స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చావిగ్రహానికి అభిషేకం జరుపబడుతుంది. అభిషేకానంతరం అలంకారంలో నూతన పట్టువస్త్రాలు, విశేష ఆభరణాలు స్వామివారికి సమర్పిస్తారు. దీనినే ఆలయ పరిభాషలో 'సమర్పణ' అని అంటారు. సమర్పణ అయిన తర్వాత, శ్రీవారి వక్షఃస్థలంలో వేంచేసిన సువర్ణలక్ష్మీదేవి ప్రతిమకి, కులశేఖరపడి వద్ద ఏర్పాటుచేసిన స్నానవేదికపై, శ్రీసూక్త పఠనంతో అభిషేకం జరుగుతుంది.

**దేవీయుక్తం ధ్రువార్చాం చేద్దేవ్యా తత్స్నపనాంతరే ।**
**సంస్నాప్య శుద్ధతోయేన సహశేషం సమాచరేత్ ॥**
**(మరీచి విమానార్చనాకల్పం)**

అని చెప్పబడినందువలన, దేవీయుక్తంగా ఉన్న ధృవబేరమునకు తిరుమంజనం అయిన తర్వాత అమ్మవారికి ప్రత్యేకంగా (విడిగా) అభిషేకం చేయాలి. తిరుమలలో వక్షఃస్థలతాయార్లకు, మూలవిరాట్టుకి అభిషేకం అయిన తరువాతనే తిరుమంజనం జరుగుతుంది.

## సమ్మోహనం - ధ్రువబేరసౌందర్యం

తిరుమలలో శ్రీవారి ధ్రువబేరమును మనం దర్శించినప్పుడు, ప్రత్యేకంగా స్వామివారి దివ్యముఖమండలములో మంత్రముగ్ధమైన, నయనానందకరమై, ప్రస్ఫుటంగా కనిపించేది శ్రీవారి చిరునవ్వు, ప్రపంచంలో ఎక్కడైనా కూడా, ఇంత భారీపరిమాణంతో నున్న అర్చావిగ్రహాలలో, ఇంతటి మనోహరమైన చిరునవ్వు చూడలేము. స్కాందపురాణం.

**మందస్మితేన సకలం మోహయన్ భువనత్రయమ్ ।**
**స్వభాసా భాసయన్ సర్వా దిశో దశ విరాజయన్ ॥**
**సుభక్తసులభో దేవో వేంకటేశో దయానిధిః । (స్కాందపురాణం)**

తన చిరునవ్వుచే ముల్లోకములను మోహింపజేయుచు, పది దిక్కులను తన కాంతిచే ప్రకాశింపజేయుచు, దృఢమగు భక్తిగల భక్తులకు, సులభుడు, దయాసముద్రుడై, శ్రీవారు కరుణిస్తారని, శ్రీవారి చిరునవ్వు గురించి స్కాందపురాణం వర్ణిస్తున్నది. ఇంకా భవిష్యోత్తర పురాణంలో

**జగన్మోహనసౌందర్యలీలామానుషవిగ్రహః ।**
**నైతద్రూపం కృతం దేవైః న కృతం విశ్వకర్మణా ॥**
**స్వేచ్ఛయా క్రీడతే తత్ర స్వేచ్ఛారూపవిరాజితః ।**

శ్రీమన్నారాయణుడు, శ్రీనివాసుని రూపంలో సర్వజగత్తునూ మోహింపజేసే సౌందర్యము కలిగి, కేవలం మానవులకోసమే కరచరణాద్యవయవములతో మనుష్యరూపం ధరించినాడు. ఇట్టి రూపము (విగ్రహము), దేవతలుగానీ, విశ్వకర్మగాని నిర్మించలేరు. ఇది కేవలం శ్రీమన్నారాయణుడి సంకల్పం. ఈ భూలోకంలో తన సంకల్పముతో క్రీడిస్తూ, వివిధరూపములు ధరించుచూ ప్రకాశిస్తూ ఉంటాడు. తనకు తానుగా స్వయంవ్యక్తరూపమున తిరుమలలో వెలసియున్నాడు అని వర్ణిస్తుంది.



శ్రీనివాసుని ధ్రువబేరం సుమారు 8 అడుగుల ఎత్తుతో, చక్కటి పొందికైన అవయవసౌష్ఠవంతో కనిపిస్తుంది. శ్రీవారిమూర్తి శిల్పశాస్త్రాన్ని అనుసరించి 'సమ-భంగ' పద్ధతిలో నిటారుగా, సమతుల్యంగా నిలుచుని ఉన్నది. శ్రీవారి దివ్యసాలగ్రామ అర్చావిగ్రహం, 16 దళములతో కూడిన పద్మపీఠంపై స్థానకభంగిమలో ఉన్నది.

**తద్బేర పీఠోత్తుంగం...చతురశ్రం వృత్తం పద్మాకారం**
**వా తదుత్సేధం సప్తభాగం కృత్వా అధః పద్మం చతురంశ**
**మూర్ధ్వపద్మం త్ర్యంశమూర్ధ్వాధష్షోడశదళైర్యుక్తం దేవపాదౌ**
**పరితశ్చాష్టాంగులం నీత్వైవ పీఠం కారయేత్ ॥**
**(మరీచి విమానార్చనాకల్పం)**

ధ్రువబేరపీఠం, ఊర్ధ్వపద్మం, అధోపద్మంగా రెండు అంతస్థులుగా సుమారు 8 అంగుళాల ఎత్తుతో 16 దళముల పద్మపీఠంమీద స్వామివారి మూలవిగ్రహం ఉంచాలని మరీచి విమానార్చనాకల్పం పేర్కొంటోంది. ఈ పద్మపీఠంచుట్టూ దీర్ఘచతురస్రాకారంలో సుమారు 3×4 అడుగుల కొలతతో, 'గోముఖం' అనే ఏర్పాటు ఉన్నది. ఇది దాదాపు 4 అంగుళములు, గర్భగృహం నేలకన్నా దిగువకు ఉన్నది. అలాగే ఈ గోముఖ ఉపరితలం కూడా ఎగుడు దిగుడుగా ఉంటుంది. తూర్పువైపున్న గోముఖం అంచు సుమారు 2 అంగుళాల మందంతో, ఉత్తరంవైపు గోడలోకివెళ్తూ అక్కడున్న రంధ్రంనుండి బయటకు వెళ్తుంది. ఇది శ్రీవారి గర్భగృహానికి 'సోమసూత్రం' అనబడుతుంది. శ్రీవారికి జరిగే అభిషేకాదుల నీరు, గర్భగృహం శుద్ధిచేసినప్పుడు బయటికి వెళ్ళే నీరు, ఈ సోమసూత్రం గుండా, ఉత్తరంవైపు బయటికి వెళ్తుంది. ఇక్కడొక విశేషం గురించి చెప్పుకోవాలి. ప్రస్తుతం గర్భాలయంలో నేలను చూస్తే, అక్కడ పరిచిన బండలన్నీ కుదురుగా, సమతలంగా ఉండే విషయాన్ని గమనించవచ్చు. కానీ మూలవిరాట్ పద్మపీఠం చుట్టూ ఉన్న, 4 అంగుళాల లోతుకలిగిన

గోముఖంలో మాత్రం, పద్మపీఠం చుట్టూ ఉన్న బండలు, సమతలంగా కాక కొంత ఎగుడు దిగుడుగా కనిపిస్తుంది. దీనికి కారణం ఏమింటే, ఈ గోముఖంలో కనిపించే బండలే, నిజగర్భాలయనేల. అప్పట్లో గర్భాలయనేల ఇదేవిధంగా, కొంత ఎగుడు దిగుడుగా ఉండేది. దానితోపాటు సోమసూత్రం కూడా లేదని అప్పటి తరం వైఖానస అర్చకులు చెప్పేవారు. 1970వ సంవత్సరంలో ఈ సమస్యకు ఆగమోక్త పరిష్కారంగా గర్భాలయనేలలో, సమతలంగా ఉన్న బండలు పరచడం, గర్భాలయానికి 'సోమసూత్రాన్ని' (నీరు బయటికి వెళ్ళే తూమువంటి మార్గం) పునరుద్ధరణ / ఏర్పాటు చేయడం జరిగింది. అప్పట్లో జరిగిన బాలాలయ అష్టబంధన మహా సంప్రోక్షణలో, గర్భగృహంలో, ఈ మరమ్మత్తు కార్యక్రమాలు నిర్వహించారు. అందువల్లనే గర్భగృహం మొత్తం సమతలంగా ఉంటే, స్వామివారి పద్మపీఠం చుట్టూ దీర్ఘచతురస్రాకారంలో ఉండే 'గోముఖం'లో ఉన్న బండలుమాత్రం మార్పు చేయకుండా, పాతబండలను అలాగే ఉంచడంవలన, అక్కడ 4 అంగుళాల లోతులో నేల అసమతుల్యంగా ఉంటుంది.

ఇక ధృవబేరం విషయానికి వస్తే, పద్మపీఠంపై "స్వామివారి దివ్య శ్రీపాదపద్మములు చూసిన వెంటనే భక్తులు అప్రయత్నంగా చేతులు రెండు జోడించి,

**"విష్ణో పదే పరమ" ఇత్యుదిత ప్రశంసౌ ।**
**యౌ "మధ్వ ఉత్స" ఇతి భోగ్యతయాऽప్యుపాత్తౌ ॥**
**భూయస్తథేతి తవ పాణితలప్రదిష్టౌ ।**
**శ్రీవేంకటేశచరణౌ శరణం ప్రపద్యే ॥ (శ్రీవేంకటేశ ప్రపత్తిః)**

ఓ వేంకటేశ్వరా! నీ దివ్య శ్రీపాదపద్మములు 'విష్ణోః పదే పరమ' అని, 'శ్రీవైకుంఠంలోని శ్రీమహావిష్ణువు యొక్క దివ్యమైన తేనె ఊటలే యివి అని కీర్తింపబడి ఇవి భవయోగ్యములుగా చెప్పబడినది. 'ఆమాట వాస్తవము' అని తిరిగి నీవే నీ చేతిని పాదములవైపు చూపుతూ హస్తసంజ్ఞతో తెలుపుచున్నావు. అట్టి నీపాదములనే నేను శరణువేడెదను అని భక్తుడు పరిపరివిధాలుగా స్తోత్రాలు, ప్రార్థనలు చేస్తాడు. తిరుమలలో ప్రతినిత్యం వేకువజామున జరిగే సుప్రభాతసేవలో, స్వామివారు 'విశ్వరూపదర్శనంలో' భక్తులను అనుగ్రహిస్తారు. అప్పటికి పుష్పాలంకరణ (తోమాలసేవ) జరిగి ఉండదుకనుక, భక్తులు ఆ సమయంలో శ్రీవారి పాదాలను దర్శించుకోవచ్చు. అయితే పాదములపై బంగారు స్వర్ణకవచపు తొడుగులు ఉంటాయి. కనుక నిజరూపంలో పాదదర్శనం ఉండదు. అలాగే ఉదయం సహస్రనామార్చన తరువాత, పాదములు తులసీదళములచే కప్పబడి ఉంటాయి. ఆలయ సంప్రదాయం ప్రకారం, ఒకసారి అర్చన పూర్తి అయితే మళ్ళీ తరువాతి కైంకర్యం వరకు పుష్పములు, తులసీదళముల సడలింపు (తొలగించుట) జరుగదు. కనుక ఉదయం సుప్రభాతదర్శనంలో శ్రీవారి బంగారు పాదములను దర్శిస్తే, తిరిగి రాత్రి ఏకాంతసేవా సమయంలో మాత్రమే, సడలింపు సమయంలో పుష్పములు, తులసీదళములు తొలగించుట జరుగుతుంది. కానీ ఏకాంతసేవ, ప్రస్తుతం స్వామివారికి ఏకాంతకైంకర్యంగా జరుపుతున్నారు. ప్రతి శుక్రవారం, మూలవర్లకి జరిగే 'అభిషేక కైంకర్యం' సమయంలో మాత్రమే శ్రీవారి నిజపాదదర్శనం చేసుకుని తరించవచ్చు.

శ్రీవారి పాదములు రెండు పద్మపీఠంపై స్థిరంగా, ఠీవీగా నిలబడి ఉంటాయి. రెండు పాదములకు 'నూపురములు' అనే ఆభరణం విగ్రహగతంగా ఉన్నాయి. అలాగే కుడి, ఎడమ పాదముల మధ్యవ్రేలికి తప్ప, మిగతా అన్నివ్రేళ్ళకు ఉంగరాలు (పాదాంగుళీయకములు) ఉన్నాయి. భక్తుడు స్వామివారి దివ్యచరణాలకు భక్తితో నమస్కరిస్తూ అలా కొంచెంపైకి దృష్టిసారించి, శ్రీవారి దివ్యమంగళవిగ్రహం సౌందర్యాన్ని వీక్షిస్తాడు.

## శ్రీవారి పరుగు

స్వామివారి పాదములనుండి నడుముభాగంవరకు, శయన మంటపం మధ్యలో నిల్చుని పరీక్షగా చూస్తే ఒక విశేషం గమనించవచ్చు. స్వామివారు ముందుకు అడుగు వేయడానికి సిద్ధంగా ఉన్నట్టు, కొద్దిగా ముందుకి, సూక్ష్మంగా వాలి ఉంటారు. అయితే దీనిని కనుక్కోవడం కొద్దిగా కష్టమే. ఎందుకంటే అతిసూక్ష్మాతి సూక్ష్మంగా పరిశీలిస్తే కానీ, స్వామి ముందుకువాలిన విషయాన్ని కనిబెట్టలేము. దీనివెనుక మనల్ని ఆశ్చర్యచకితులను చేసే శ్రీవారి పరమదయాగుణం గురించిన విషయం ఉంది.

**వైకుంఠం వా పరిత్యక్షే....ఇతి సంకల్పవానసి ॥ (ఆదిత్యపురాణం)**
**నాహం వసామి వైకుంఠే న యోగిహృదయే రవౌ ।**
**మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారదా ॥**
**(పాద్మపురాణం)**

శ్రీవైకుంఠాన్నైనా విడిచి ఉంటానుగానీ నా భక్తులను విడిచి ఒక్కక్షణం కూడా ఉండను అని స్వామివారు ప్రతిజ్ఞ చేసారట. అలాగే 'నేను వైకుంఠంలో ఉండను, కఠోర తపస్సు చేసే యోగుల హృదయాలలో ఉండను, సూర్యమండలంలో ఉండను, నా భక్తులు, ఆర్తితో, భక్తితో నా నామస్మరణ చేస్తే అక్కడే ఉంటాను' అని శ్రీవారు స్వయంగా నారదుడితో చెప్పారట.

స్వామివారు ఎటువంటి ముఖ్యమైన లోకకళ్యాణానికి సంబంధించిన కార్యంలో ఉన్నా, భక్తుడు ఆర్తితో, నిర్మలమైన భక్తితో పిలిస్తే వెంటనే ఎక్కడ ఉన్నా, ఎలాంటి పనిలో ఉన్నా వదిలివేసి ఉన్నపళంగా తన భక్తులకష్టాలను తీర్చడానికి పయనమవుతాడట.

**సిరికిం జెప్పఁడు; శంఖచక్రయుగముం జేదోయి సంధింపఁ; డే పరివారంబునుఁ జీరఁ; డభ్రగపతిం బన్నింపఁ; డాకర్ణికాం**



**తర ధమ్మిల్లముఁ జక్కనొత్తఁడు; వివాదప్రోత్థిత శ్రీకుచో పరిచేలాంచలమైన వీడఁడు గజప్రాణావనోత్సాహియై.**
**(పోతనభాగవతం)**

గజేంద్రుడి ప్రాణాలు కాపాడాలనే ఆతృతలో విష్ణువు లక్ష్మీదేవికి చెప్పలేదు. శంఖచక్రాలను చేతులలో ధరించలేదు. సేవకులను ఎవరిని పిలవలేదు. వాహనమైన గరుత్మంతుని పిలవలేదు. చెవికుండలాలవరకు జారిన జుట్టుముడి కూడా చక్కదిద్దుకోలేదు. ఆఖరికి ప్రణయకలహంలో పుట్టిన లక్ష్మీదేవి పైటకొంగు కూడా వదిలిపెట్టలేదు. పోతనామాత్యుడు, శ్రీమద్భాగవతంలో గజేంద్రుని రక్షించడానికై స్వామివారు ఆతృతగా పయనమవ్వడాన్ని హృద్యంగా పద్యరూపంలో చెప్పాడు.

ఇలా – శ్రీనివాస ప్రభువు తన ప్రియభక్తులను రక్షించడానికై సదా సిద్ధంగా, అప్రమత్తతతో ఉంటాను అని సందేశమిచ్చినట్లు, స్వామివారి రూపం, కొద్దిగా ముందుకు వాలి ఉంటుంది. అంతేకాదు రెండు పాదాలను పరీక్షగా చూస్తే, కుడిపాదము కొద్దిగా ముందుకి అడుగువేసినట్లు, సూక్ష్మమైన దూరంతో ముందుకి ఉంటుంది.

పాదములపై నుండి నడుమువరకు, శ్రీవారు పీతాంబరాన్ని ధరించినట్లు (విగ్రహగతంగా) కనిపిస్తుంది. పీతాంబరం (ధోవతికి) సంబంధించిన మడతలు, నడుము చుట్టూ ధోవతిని చుట్టుకుని కట్టుకున్నట్టు, నడుముకి ముడివేసినట్లు, అక్కడున్న పెద్దవడ్డాణం వంటి ఆభరణం కటిసూత్రంతో ఈ ధోవతిని నడుముకి స్థిరంగా కట్టినట్లు కనిపిస్తుంది. మోకాలివద్ద మోచిప్పలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అలాగే ముందువైపు తొడలవద్ద, ధోవతి కుచ్చిళ్ళను పట్టి ఉంచటానికా అన్నట్లు, కనిపించే నిలువుగా వ్రేలాడే కుచ్చిళ్ళు యిరువైపులా చూడవచ్చు. రెండు పాదముల మధ్యలో నిలువుగా వ్రేలాడే కుచ్చిళ్ళు, పాదముల పైభాగంవరకు

కనిపిస్తుంది. ఈ పీతాంబరం లేక ధోవతి, శ్రీవైష్ణవ సంప్రదాయ పద్ధతిలో గోచిపోసి కట్టుకున్నట్టు, అది వెనుకవైపు నడుము మధ్యభాగంలో ముడివేసి చెక్కుకున్నట్టు విగ్రహగతంగా గమనించవచ్చు. నడుమువద్ద ఉన్న కటిసూత్రం మధ్యలో సింహలలాటం (సింహముఖం) ఉన్నది. శ్రీవారికి నడుముకి పైభాగాన, విగ్రహగతంగా ఎటువంటి ఆచ్ఛాదన ఉన్నట్లు కనిపించదు. కంఠంవద్ద మూడు హారాలు, లేక కంఠాభరణాలు (ఉప-గ్రీవా) ధరించి ఉన్నాడు. అలాగే శ్రీవారు శ్రీవైష్ణవ సంప్రదాయ విష్ణుముడి కలిగిన యజ్ఞోపవీతాన్ని ధరించి ఉంటాడు. ఛాతీక్రిందిభాగంలో, చుట్టూతా ఉదరబంధం అనే ఆభరణం కనిపిస్తుంది. విశాలమైన ఛాతీ, ముందుకు వచ్చినట్లు ఉంటుంది. వక్షఃస్థలంలో రెండు చనుమొనలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

## శ్రీవత్సం ప్రలంబసూత్రం

కుడివైపు వక్షఃస్థలంలో త్రికోణ మండలంలో 'వ్యూహలక్ష్మీ' అమ్మవారి స్వరూపం వేంచేసి ఉంటుంది. అత్యంత స్పష్టంగా కనిపించే వ్యూహలక్ష్మీరూపం, శ్రీ-నివాసుడనే పేరుని సార్థకం చేస్తున్నట్లు భక్తులకు దర్శనమిస్తుంది.

**అథ వక్ష్యే విశేషేణ లక్ష్మీస్థాపనముత్తమమ్ ।**
**అష్టధా ప్రోచ్యతే లక్ష్మీః ప్రథమాత్వనపాయినీ ॥**

**విష్ణోర్వక్షస్థలే కార్యా సర్వాలంకారసంయుతా ।**
**దక్షిణస్తన స్యోర్ధ్వభాగే వహ్న్యేశ్రే దివ్యమండలే ॥**

**పద్మమధ్యే సమాసీనాం పద్మద్వయకరాంచితాం ।**
**ఏవం రూపం ప్రకుర్వీత యోగలక్ష్మీస్తు సా మతా ॥**

**(భృగువు ప్రకీర్ణాధికారం)**



విష్ణువుయొక్క దివ్యపట్టమహిషీ, ప్రథమ అనపాయినీ లక్ష్మీదేవిని, వైఖానస ఆలయంలో ఎనిమిది విధములుగా ప్రతిష్ఠించి ఆరాధించవచ్చని భృగుమహర్షి పేర్కొంటున్నాడు. విష్ణువుయొక్క దక్షిణ వక్షఃస్థలమున, సర్వాలంకారములతో దివ్యత్రికోణమండలంలో, పద్మాసనీగా రెండు భుజములలో పద్మాలను ధరించిన లక్ష్మీరూపాన్ని ప్రతిష్ఠించి ఆరాధించాలి. ఇంకా,

**యోగలక్ష్మీం ప్రతిష్ఠాప్య శ్రీకామస్సమ్యగర్చయేత్ ।**
**కృత్వా శ్రీవత్సరూపం తు ధారయే ద్విష్ణుమవ్యయం ।**
**తత్తద్బింబానురూపం చ కుర్యాత్ శ్రీవత్సలక్షణమ్ ॥**

శ్రీవత్సచిహ్నము, ఆయా విష్ణువు విగ్రహమూర్తులను అనుసరించి ఉంటుంది గానీ అన్ని విష్ణువు అర్చామూర్తులకు ఒకేరకంగా ఉండదు. శ్రీవత్సము మూలప్రకృతిని, శ్రీదేవి అధిష్ఠానదేవతను ప్రతిబింబింపజేస్తుంది.

### ప్రలంబసూత్రం

శ్రీవారి ఛాతీభాగంలో ఉన్న యజ్ఞోపవీతం గురించి ఇక్కడ విశేషంగా చెప్పుకోవాలి. శ్రీవారు ధరించిన యజ్ఞోపవీతం శ్రీవైష్ణవ సంప్రదాయంగా 6ప్రోగులు కలిగి ఉంటుంది. అగ్రభాగాన విష్ణుముడి లేక బ్రహ్మముడి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ యజ్ఞోపవీతాన్నే 'ప్రలంబ యజ్ఞోపవీతం'గా పిలుస్తారు.

**ప్రలంబాసుర సంగ్రామే హ్యుపవీతం తు శార్ఙ్గిణః ।**
**తదాయుధపరిచ్ఛిన్నమేకసూత్రం ప్రలంబితమ్ ॥**

**తదభ్యర్థనయా తచ్చ తథైవ ధృతమేవ హి ।**
**ప్రలంబయజ్ఞోపవీతిత్వం తతః ప్రభృతి శార్ఙ్గిణః ॥**

**తదసాధారణం నామ లోకేఽస్మిన్ ప్రథితం పృథు ।**
**తత్సూత్రం లంబితం ఛేదాద్గత్వాధో దక్షిణస్తనాత్ ॥**

**వామా సాత్సవ్యగుల్ఫాంతం లంబితం తనుమధ్యతః ।**
**తద్బ్రహ్మసూత్రమిత్యుక్తం తదసాధారణం హరేః ॥**

**(భృగువు క్రియాధికారం)**

ఒకానొకకాలంలో లోకాలను పీడిస్తున్న ప్రలంబాసురుడనే రాక్షసుణ్ణి సంహరించడానికి, శ్రీమన్నారాయణుడు శారంగమనే ధనుస్సు – చేతపట్టి, ప్రలంబుడితో ఘోరమైన యుద్ధం చేశాడు. ప్రలంబాసురుడిని సంహరించేందుకు ధనుస్సుని శరవేగంతో చేపట్టి, బాణాన్ని సంధించినప్పుడు, ఆ తొందరలో, ఆ బాణం యజ్ఞోపవీతంలోని 6 ప్రోగులలో, ఒక ప్రోగుకి తగిలి, ఆ ప్రోగు తెగిపోతుంది. ప్రలంబుడిని వధించిన తర్వాత, స్వామివారిని ప్రలంబాసురుడు, 'స్వామి నా గుర్తుగా, ఆ తెగిపోయిన యజ్ఞోపవీతపు ప్రోగుని అలాగే ధరించమని' ప్రార్థించాడట. అంతటా, శ్రీమహావిష్ణువు ఆ అసురుని కోరికను మన్నించి, యజ్ఞోపవీతాన్ని అలాగే ధరించడం మొదలుపెట్టాడని వైఖానసీయ భృగుసంహిత క్రియాధికారం విశదీకరిస్తున్నది.

## విగ్రహవర్ణన – ఉపసంహారం

స్వామివారు చతుర్భుజములోని నాలుగు చేతులకు కేయూరములు, కటక, కంకణములనే ఆభరణాలను ధరించియున్నారు. బాహువుల పైభాగంలో ధరించిన కేయూరముల శిల్పశైలి ప్రాచీన పల్లవుల చెక్కడపు రీతిలో ఉన్నది. చాలాసార్లు, ఈ కేయూరములను చూసి, ఇది నాగాభరణమేమో అని అనేకమంది పొరబడుతూ ఉంటారు. కానీ ఇది ముమ్మాటికి పల్లవులశైలిలో కనిపించే కేయూర ఆభరణమే. విగ్రహగతంగా ఎటువంటి సర్పచిహ్నితమైన ఆభరణం శ్రీవారి నిజతిరుమేనిలో లేదు. అలాగే నాలుగు చేతులలో మణికట్టు వద్ద మూడేసి కంకణములు / కడియములను స్వామి ధరించియున్నాడు. ఈ కంకణము మరియూ



కేయూరము మధ్యన, ప్రతిచేతికి ముంజేయిభాగంలో 'వలయము' అనే మరొక ఆభరణాన్ని స్వామి ధరించియున్నాడు. కుడిచేయి వరప్రదాన ముద్రలో 'వరదహస్తం / వైకుంఠహస్తంగా' పిలువబడుతుంది. శ్రీవారి కుడి అరచేతిమీద హస్తసాముద్రికంలో ఉత్తమమైన, మహోత్కృష్టమైన హస్తరేఖలు కనిపిస్తాయి. శ్రీవారి ఎడమచేయి కట్యవలంబిత ముద్రతో, నాలుగువేళ్ళు ఎడమతొడని తాకుతూ ఉండగా, బొటనవేలు పైకి చక్రంవైపు చూస్తూ ఉంటుంది.

శ్రీవారి రెండు చెవులలోనూ, మకరకుండలాలు వదులుగా భుజాలవరకు వ్రేలాడుతున్నట్లుగా ధరించియున్నాడు. ముందువైపు భుజములవద్ద, యిరువైపులా మెలికలు తిరిగినట్లున్న స్వామివారి శిరోజాలు వ్రేలాడుతూ కనిపిస్తాయి. వెనుకవైపు మెడమీదనుండి వ్రేలాడుతున్న, మెలికలు తిరిగిన శిరోజాలుంటాయి. శిరస్సుమీద పొడవైన, సన్నటి కిరీటం చూడవచ్చు. లలాటం వద్ద 'ముఖపట్టీ' లేదా 'తిరుక్కోలం' అనే ఆభరణం విగ్రహగతంగా ఉన్నది.

శ్రీవారి శిరస్సుపై కిరీటం, శిల్పశాస్త్ర గ్రంథాలలో చెప్పబడిన 'వేణుకర్ణాభ' పద్ధతిలో కనిపిస్తుంది. పొడవుగా ఉన్న వెదురు చెట్టుకాండంవలె ఉంటుంది. కిరీటం క్రిందిభాగంలో 'రత్నపట్ట' అనే ఆభరణం ఉన్నది. స్వామివారినుదురు పైన, కిరీటం మధ్యభాగంలో, కళాసౌందర్యంతో నిండిన 'పురిమ' లేక 'రత్న–బంధ' ఉంది. కిరీటం పైభాగంలో 'శిఖామణి' అనే ఆభరణమును, దానిక్రింద కొద్దిగా ముందుకు వచ్చినట్లు కనబడే 'ముకుల' అనే ఆభరణాన్ని ధరించాడు. మిగతా కిరీటభాగంలో నిలువుగా, అడ్డంగా వరుసలుగా చిన్నచిన్న చతురస్రాలలాగా ఆకృతి ఉంది. కిరీటానికి అక్కడక్కడా ముత్యాలతో అలంకరించినట్లున్న 'పత్ర–దామ' అనే ఆకృతి కనిపిస్తుంది. ఈ కిరీటం పూర్తిగా ప్రాచీన పల్లవులు ధరించిన కిరీటాన్ని పోలి ఉన్నది. స్వామివారి నుదురుభాగం ఖాళీగా, ఏ విధమైన ఊర్ధ్వపుండ్రం

లేక కనిపిస్తుంది. విగ్రహగతంగా ఎటువంటి నామచిహ్నం లేకపోయినప్పటికీ, అలంకరణలో భాగంగా శ్రీవారికి ఊర్ధ్వపుండ్రధారణ చేస్తారు. స్వామివారి నాసిక సూటిగా, కొనదేలి ఉంటుంది. పుష్టిగా ఉన్న బుగ్గలు, చిన్ని గడ్డం, అందమైన పెదాలు, పెదాలమీద మంత్రముగ్ధులను చేసే చెదరని చిరునవ్వు, అలా చూస్తుంటే, కాలం ఎంతసేపైనా వెళ్ళిపోతూ ఉంటుంది. కనులు కలువలవలె ఉండి, మధ్యలో కనుపాప గుండ్రంగా కనిపిస్తుంది. కనుబొమ్మలు చక్కటి ఆకృతితో నాసిక ప్రారంభమయ్యేచోట కలుస్తుంది. శ్రీవారి కనులను దగ్గరినుండి చూస్తే, వచ్చిన ప్రతి భక్తుడినీ ఆయనే స్వయంగా పలకరిస్తున్నారా! అన్నట్లుగా, విప్పారిత నేత్రాలతో, భక్తులను చూస్తున్నానన్న ఆనందంతో, నిరంతర కరుణారస ప్రవాహాన్ని వర్షిస్తూ కనిపిస్తాయి. 'జగన్మోహక సౌందర్య దర్మిణే నమః' అని సహస్రనామావళిలో కీర్తించినట్లు, మన కనులు ఎప్పుడూ చూడని సౌందర్యంతో అలరారుతూ ఉన్న వచ్చిన భక్తులందరినీ లాలించి, ఆడించి, మురిపించి సంతోషింపజేసే మన బంగారుస్వామి ఆ శ్రీ శ్రీనివాస భగవానుడి దర్శనం సర్వదా ఆనందప్రదం, మోక్షప్రదం, జ్ఞానప్రదం.

**ఏవం సర్వాంగసౌందర్యమియక్తారహితం ప్రభుమ్ ।**
**ఆపాదమౌళి లావణ్యమఖిలాభరణాదికం ॥ 113**

**సర్వాంగసుందరం పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్ ।**
**మహనీయోపవీతేన వైజయంత్యాది భూషితమ్ ॥ 115**

**అన్యై కమలకల్హారైరసంఖ్యేయైరలంకృతమ్ ।**
**సౌశీల్యాశ్రితవాత్సల్యసౌలభ్యాది గుణార్ణవమ్ ॥ 117**

**వేంకటాచలశృంగాగ్రసేకం హరిమ్ ।**
**పశ్యన్ పశ్యన్ ప్రశాంతాత్మా భవేయం నిత్యకింకరః ॥ 120**

**(శ్రీవేంకటేశ సేవాక్రమ)**



గర్భగృహంలో శ్రీవారు వర్ణింపశక్యంకాని సౌందర్యంతో, అధిగమించలేని అందంతో దర్శనమిస్తున్నాడు. స్వామివారి దివ్యతిరుమేనిలో ప్రతిభాగం, శిరస్సునుండి పాదములవరకు, అత్యద్భుతంగా, కుదురైన సౌష్ఠవంతో అలరారుతూ, సున్నితమైన నవయవ్వనరూపంలో, కనులకు చూడముచ్చటగా కనిపిస్తూ, శ్రీవారి దివ్య అర్చావిగ్రహం సుమనోహరంగా మన మనస్సుని కట్టిపడేస్తుంది. శ్రీవారిని దర్శించినవారూ ఎవరైనాసరే, విస్మయచకితులై, స్వామివారిమీద చూపు త్రిప్పుకోలేక అలాగే ముందు నిలబడిపోతారు. స్వామివారి మూర్తి అందమూ, ఆకర్షణ మన ఆధ్యాత్మిక తృష్ణతీరుస్తూ ఉండగా, దర్శిస్తున్న భక్తుడి హృదయంలో ఆనందం పరవళ్ళు త్రొక్కుతుంది. కొద్దిసేపటికి మనసంతా అన్నీ బాధలు తీసివేసినట్లు ప్రశాంతంగా మారిపోతుంది. ఈ ప్రశాంతత, స్థితప్రజ్ఞత, ప్రపంచంలో ఇంకెక్కడా అనుభవించలేము. అందుకే దర్శనమై వెళ్ళిపోతున్న వాళ్ళు కూడా తిరిగి, తిరిగి చూస్తూ వెళ్తారు. మళ్ళీ ఈ అవకాశం ఎప్పుడు లభిస్తుందో అనే బెంగతో, తన జన్మధన్యమైందన్న ఆనందంతో, విడువలేక విడువలేక, శ్రీవారికి వీడ్కోలుపలికి, మళ్ళీ ఈ దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించు స్వామీ! అని వేడుకుంటూ బంగారువాకిలి బయటకు వస్తాడు.

## ధృవబేరం - కైంకర్యాలు

తిరుమల దివ్యక్షేత్రంలో కలియుగ ప్రత్యక్షదైవంగా వెలసిన శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, శ్రీ శ్రీనివాస భగవానుడి మూలవిరాట్టుకి, నిత్యనైమిత్తిక కాలోత్సవాదులనే భేదంతో, భగవాన్ విఖనస మహర్షులవారు ప్రవచించిన శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా, ఏడాది పొడవున వివిధకైంకర్యాలు ఆయాసందర్భాలలో నిర్వహించబడుతుంది.

**ప్రత్యూషశ్చ ప్రభాతశ్చ మధ్యాహ్నశ్చాపరాహ్ణకః ।**
**సాయంకాలో నిశీథశ్చ పూజా కాలాస్తు షట్ స్మృతాః ॥**

**షట్కాలం వా త్రికాలం వా ద్వికాలం కాలమేవ వా ।**
**పూజనం దేవదేవస్య త్వైహికాముష్మికప్రదమ్ ॥**
**(భృగువు ప్రకీర్ణాధికారం)**

వైఖానస సంహితయైన భృగువు ప్రకీర్ణాధికారంలో, ఆలయంలో వేంచేసిన, శ్రీమన్నారాయణుడికి మూడు సంధ్యలు, మూడు ఉపసంధ్యలలో – మొత్తం 6 కాలాలలో అర్చన (ఆరాధన/పూజ) చేయడంవలన, స్వామివారి కృపతో ఐహిక ప్రాపంచిక అవసరాలు మరియూ ఆముష్మిక (మోక్షం) ఫలాలు అనుగ్రహించబడుతాయి అని పేర్కొన్నాడు. ఈ ఆగమ ప్రమాణాన్ని అనుసరించి ప్రత్యూషం, ప్రాతఃకాలం, మధ్యాహ్నం, అపరాహ్ణం, సాయంకాలం, అర్ధరాత్రి అనే ఆరు కాలాలలో శ్రీనివాస భగవానుడికి ఆరాధన జరుపబడుతుంది. మూడు ప్రధాన సంధ్యలైన ప్రాతఃకాలం, మధ్యాహ్నం సాయంకాలాలలో హవిస్సు (మహానైవేద్యం/అన్నప్రసాదాలు)తో కూడిన అర్చన చేయబడుతుంది. మూడు ఉపసంధ్యలలో ప్రత్యూషం, అపరాహ్ణ అర్ధరాత్రి సమయాలలో అపక్వములు (పాలు, పండ్లు మొదలైనవాటి)తో ఆరాధన జరుగుతుంది.

తిరుమల శ్రీవారి ఆలయంలో, సుప్రభాతం (ప్రత్యూష), ప్రాతఃకాలార్చన (ఉదయం తోమాలసేవ), మధ్యాహ్నికార్చన (రెండవ గంట), సాయంకాలార్చన అపరాహ్ణార్చన (రాత్రి తోమాలసేవ, తిరువీశం గంట), అర్ధరాత్ర్యర్చన (ఏకాంతసేవ) మొదలైన కైంకర్యాలు షట్కాలములలో శ్రీవారికి జరుపబడుతుంది. 8వ శతాబ్దానికి చెందిన వైఖానస మహాపండితుడు శ్రీమన్నృసింహ వాజపేయయాజులవారు, 'శ్రీమద్భగవదర్చా ప్రకరణమ్' అనే గ్రంథాన్ని రచించారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ గ్రంథం 8వ శతాబ్దంలో తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే నిత్యకైంకర్యాలను ఆగమశాస్త్ర మంత్ర, క్రియా, వివరణాసహితంగా పొందుపర్చారని పేర్కొనబడినది. ఇది పంచ ఖండ



తిరువారాధనాక్రమంగా, వైఖానసక్షేత్రాలలో ప్రసిద్ధి చెందింది. తిరుమల శ్రీవారి ఆలయ పరిభాషలో, ప్రతిరోజూ ఉదయం సుప్రభాతం నుండి రాత్రి ఏకాంతసేవ వరకు జరిగే కైంకర్యాలను, 'నిత్యకట్ల' కైంకర్యాలుగా పిలుస్తారు. నిత్యకట్ల పూజ ఆరు విధములుగా విభజింపబడినది.

1. మంత్రాసనము 2. స్నానాసనము 3. అలంకారాసనము 4. భోజ్యాసనము 5. యాత్రాసనము 6. పర్యంకాసనము.

అలాగే తిరుమల శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమంలో చెప్పబడిన విశిష్టమైన 'పంచబేర' ఆరాధన జరుగుతున్నది. పంచ బేరములు అంటే ఐదు విగ్రహములు. తిరుమలలో శ్రీనివాసుడి అయిదు విగ్రహములు, ధృవబేరం – మూలవిరాట్, కౌతుకబేరం – శ్రీభోగశ్రీనివాసమూర్తి, ఉత్సవబేరం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు, స్నపనబేరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి, బలిబేరం శ్రీకొలువు శ్రీనివాసమూర్తి పూజలందుకుంటున్నాయి.

తిరుమల శ్రీవారి ఆలయం, ప్రాచీనకాలంలో ఏకబేర ఆలయంగా వినుతికెక్కింది. ఆలయంలో ధృవబేరంగా శ్రీశ్రీనివాస భగవానుడు మాత్రమే శ్రీవైఖానస శాస్త్రోక్తంగా ఆరాధనలు అందుకునేవాడు. ఇలా ధృవబేరానికి మాత్రమే జరిపే నిత్యార్చన వైఖానస ఆగమంలో 'ధృవార్చా విధానం' అని చెప్పబడినది. శ్రీవైఖానస నిత్యార్చనా విధానం ధృవార్చాయజనవిధి ప్రకారం, నిత్యార్చనాంగ స్నపనం ప్రతిరోజూ నిర్వహించాలి. కనుక ప్రతిరోజూ మూలవిరాట్‌కి స్నపన (అభిషేకం) చేయడం, అనేకవిధాలుగా కష్టసాధ్యంగా ఉండేది ఆకాలంలో. అందువల్లనే ఆగమ విధిని అనుసరించి 6వ శతాబ్దంలో, శ్రీవారి ఆలయంలో కౌతుకబేరంగా శ్రీభోగ శ్రీనివాసమూర్తి వారి వెండివిగ్రహం ప్రతిష్ఠింపబడింది. ఖచ్చితంగా, 6వ శతాబ్దం కాలంలో, అప్పటి స్థానిక శ్రీవైఖానస అర్చకులు, శ్రీవైష్ణవ ఆచార్యులు (ఆచార్య

పురుషులు), ఆలయానికి యాత్రగా విచ్చేసిన పల్లవరాణి సామవై పెరుందేవి దృష్టికి ఈ విషయం తెలియపరిచి, విగ్రహం వితరణకు ప్రేరేపించి ఉంటారు. ఇంకా కాశ్యపజ్ఞాన కాండలో

**ఐహికాముష్మికాపేక్షీ ధృవ కౌతుక సంయుక్తమ్ ।**
**కేవలాముష్మికాపేక్షీ ధృవార్చనం కుర్యాత్ ॥**

అని చెప్పబడినందువలన, కేవలం ధృవార్చనం అంటే మూలవిరాట్టుని (ధృవబేరం) అర్చించటం వలన ఆముష్మిక ఫలితాలు మాత్రమే స్వామివారు అనుగ్రహిస్తారు. ఆముష్మికం అంటే మోక్షం (లేదా మోక్షాన్ని అందుకోవటానికి ఫలవంతమైన మార్గం). ధృవబేరం మోక్షాన్ని మాత్రమే అనుగ్రహిస్తారు. సాధారణంగా మోక్షం అనేది మానవజీవితంలో సాధించదగిన అత్యున్నత, అంతిమ లక్ష్యమైనప్పటికినీ, ఆలయానికి ప్రతినిత్యం విచ్చేసే భక్తులందరూ మోక్షాపేక్షులుగా ఉండరు. వారి వారి జీవితాలలో, కర్మవశాత్తు అనుభవించే అనేక కష్టాలు, సమస్యలను తీరుస్తాడని నమ్మకంతో ఏదేవుడినైనా కొలుస్తారు. అందుకే వైఖానస ఆగమం 'ఐహికాముష్మికాపేక్షీ' – అంటే నిత్యజీవితంలో ప్రాపంచిక అవసరాలూ, మోక్షం రెండూ ప్రసాదించగల విధానం, ధృవ కౌతుక బేరాలను పూజచేసే విధానాన్ని పేర్కొన్నది. శ్రీభోగ శ్రీనివాసమూర్తిని కౌతుకబేరంగా ప్రతిష్ఠించడానికి ఇది కూడా ఒక కారణం.

**ధృవకౌతుకసంయుక్తం ధృవార్చనమితి స్మృతమ్ ।**
**ధృవకౌతుకయోరైక్యే ధృవార్చనముదాహృతమ్ ॥**
**(భృగువు క్రియాధికారం)**

భృగువు క్రియాధికారం, ధృవబేర అర్చన ఎల్లప్పుడు కౌతుక సంయుక్తంగానే ఆచరించాలి అని నిర్దేశిస్తున్నది. అందువల్ల తిరుమల దేవాలయంలో కౌతుకబేరాన్ని ప్రతిష్ఠించారు. ఆలయం ప్రారంభంలో



ఏకబేరంతో ఉన్నప్పటికినీ, కాలక్రమేణా ఇతర బేరాలను ప్రతిష్ఠించి, వైభవోపేతంగా అర్చన, ఉత్సవాదులు నిర్వహించవచ్చుని వైఖానస ఆగమం తెలియజేస్తున్నది. మన ప్రస్తుత అంశం, ధృవబేరానికి కైంకర్యాల సమయంలో చేసే ప్రత్యేక ఆరాధన గురించి కనుక ముందుగా సుప్రభాతసేవ గురించి తెలుసుకుందాం.

ప్రతినిత్యం ఉదయం సుప్రభాత సేవా సమయంలో, శ్రీవారికి ప్రత్యూషకాల కైంకర్యాలలో భాగంగా మొదటి నివేదనగా, 'గోక్షీరం' అంటే పచ్చి ఆవుపాలను, ధారోష్ణంతో నివేదన చేస్తారు. ఈ సమయంలోనే శ్రీవారి దివ్యముఖమండలానికి పునుగు తైలంతో సున్నితంగా మర్దన చేస్తారు. పునుగు తైలం, ఒక ప్రత్యేకమైన ద్రవ్యంగా, ముఖ్యంగా మూలవిరాట్టుకి, వివిధ కైంకర్యాల సందర్భాలలో వినియోగించబడుతుంది. సాలగ్రామశిలకు పునుగుతైలం పూయడం అనేది, ఆ శిలకి పుష్టిని కలుగచేస్తుందని, అందుకనే మూలవిరాట్టుకి పునుగుతైలం సమర్పణ చేయడం అనూచానంగా వస్తున్న సంప్రదాయం. సుప్రభాతపఠనం పూర్తయిన తర్వాత, శ్రీవారికి 'నవనీతం' (వెన్న) నివేదన చేస్తారు.

ఇక ప్రాతఃకాల ఆరాధన లేదా తోమాలసేవలో అర్చనాంగంగా చేసే నిత్య స్నపనం భోగశ్రీనివాసమూర్తికి చేస్తారు. అలాగే ఆరాధన ప్రారంభించే ముందు భూశుద్ధి ఆవాహన కార్యక్రమాన్ని అర్చకులు నిర్వహిస్తారు. ఆగమ సంప్రదాయాన్ననుసరించి, ముందుగా అర్చకస్వామి ఆత్మశుద్ధికొరకు న్యాసకర్మలను ఆచరించి, అనంతరం ప్రణిధి పాత్రలోకి మూలవిరాట్టునుండి విష్ణువుయొక్క సాన్నిధ్యశక్తిని ఆవాహన చేస్తాడు. ఈ ప్రణిధి పాత్రలో విష్ణ్వాది పంచ మూర్తులకు సంబంధించిన శక్తిని మంత్రపూర్వకంగా కౌతుక, ఉత్సవ, స్నపన, బలిబేరాలలోకి ప్రసరింపజేస్తారు (ఆవాహన చేస్తారు). ధృవమూర్తి అచలం (కదలించడానికి వీలులేని) అయితే, కౌతుకమూర్తి,

'చలం' అంటే కదిలించడానికి వీలైనది. ఈ ఒక్కతేడా తప్ప, ధ్రువ – కౌతుక బేరములు రెండూ ఆగమశాస్త్ర దృష్టిలో ఒకే ప్రాముఖ్యత కలిగినవిగా చెప్పబడినాయి. అందుకే మూలవిరాట్టు, కౌతుకబేరంతో ఎప్పుడూ సంధానం కలిగి ఉండాలని ఆగమం నిర్దేశిస్తోంది.

సాలగ్రామ ఆరాధనలో సంప్రదాయకంగా పాటించే ఒకవిధి, ఏమిటంటే, సాలగ్రామాలు స్వయం విష్ణుసంబంధిత సాన్నిధ్యంతో విరాజిల్లుతూ ఉంటాయి. అందువలన, సంప్రదాయంగా సాలగ్రామాలను నేరుగా భూమిపై (నేలపై) ఉంచరాదు. ఏదైన పళ్ళెంలో మెత్తటి నూలువస్త్రం లేదా తులసీదళములను పరిచి దానిపై సాలగ్రామాలను ఉంచాలి. తిరుమల గర్భాలయంలో ప్రాచీనకాలంనుండి అనేక దివ్యసాలగ్రామాలు నిత్యపూజలందుకుంటున్నాయి. ఒక పెద్ద వెండిపాత్రలో అడుగున, నూలువస్త్రం, తులసీ ఉంచి దానిపై సాలగ్రామాలను ఉంచుతారు. శ్రీవారి ధ్రువబేరం కూడా దివ్య సాలగ్రామమూర్తి కనుక, నిత్యం భోగమూర్తి స్నపన తర్వాత రెండు ఎర్రటి నూలు వస్త్రములనూ (10×10 అంగుళాలు) శ్రీవారి దివ్యపాదములపై ఉంచి, ఆ వస్త్రంపై తులసీదళముల నుంచి, అటుపై స్వర్ణపాదకవచములతో అలంకరిస్తారు. ఇది అత్యంత ప్రాచీనకాలంనుండి, ఆలయంలో ఆచరింపబడుతూ ఉన్నది. దీనినే 'శ్రీపాదవస్త్రం' అని వ్యవహరిస్తారు. ఇలా అనేక ప్రాచీనమైన, ఉత్కృష్ట సంప్రదాయాలు శ్రీవారి ఆలయంలో నేటికీ ఆచరణలో ఉంది.

అనంతరం కొలువు, సహస్రనామార్చన జరుగుతుంది. మొదటిగంట నివేదనలో అనేకరకాల అన్నప్రసాదాలు శ్రీవారికి నివేదింపబడుతాయి. తదుపరి బలి, శాత్తుమొఱ అయిన తర్వాత సర్వదర్శనం ప్రారంభ మవుతుంది. మాధ్యాహ్నిక ఆరాధనలో భాగంగా, ఉదయం 10 గం॥లకు మూలవిరాట్టుకి, రెండవ అర్చన, రెండవ గంట నివేదన, తాంబూల సమర్పణం జరుగుతుంది. తదనంతరం ఉత్సవర్లు మలయప్ప



స్వామి, ఆర్జితసేవలకొరకు, గర్భాలయం నుండి కళ్యాణమంటపానికి వేంచేపు చేయబడుతారు. తిరుమల శ్రీవారి ఆలయంలో అనాది కాలంనుండి పాటింపబడుతున్న ఆగమ సంప్రదాయం ప్రకారం, గర్భాలయంలో పంచ బేరాలూ, ఆరాధన, నివేదన సమయంలో ఉండాలి. ఉత్సవరీత్యా గర్భాలయం బయట వేంచేస్తే, మళ్ళీ ఉత్సవర్లు వచ్చిన తరువాతనే రాత్రి కైంకర్యాలు జరుగుతాయి. కొన్ని ఉత్సవాలు (బ్రహ్మోత్సవం, పవిత్రోత్సవం) సమయాలలో తప్ప మిగిలిన అన్ని సందర్భాలు ఈ ఆగమ నిబంధన ఖచ్చితంగా పాటింపబడుతుంది.

సాయంత్రం యథావిధిగా రాత్రి తోమాలసేవ, రాత్రి అర్చన, రాత్రి గంట, తిరువీశం నివేదన జరుపుతారు. రాత్రి ఏకాంతసేవా సమయంలో మూలవిరాట్టుకి ప్రతినిధిగా శ్రీభోగశ్రీనివాసమూర్తి వారిని, శయన మంటపంలో వ్రేలాడతీసిన, బంగారు నవారు మంచంపై శయనింప జేస్తారు. అంతకంటే ముందు, ప్రాతఃకాలం ముందు, ప్రాతఃకాల తోమాలసేవలో ధ్రువబేరం నుండి ఇతర బేరాలలోకి ఆవాహన చేయబడిన సాన్నిధ్య శక్తిని, తిరిగి అన్ని బేరాలనుండి ధ్రువబేరానికి పంపించటంతో, ఆ రోజు నిత్యకైంకర్యాలు పూర్తవుతాయి. ఇది నిత్యకట్ల కైంకర్యాలలో (ధ్రువబేరం) విషయాలు.

అలాగే వారంలో ఒకరోజు, ప్రతి శుక్రవారం, శ్రీవారి స్వయంవ్యక్త సాలగ్రామ దివ్య అర్చావిగ్రహానికి అభిషేకకైంకర్యం, వారకట్ల కైంకర్యంగా శోభాయమానంగా నిర్వహింపబడుతుంది. ప్రతి శుక్రవారం ఉదయం యథావిధిగా సుప్రభాతం, తోమాల, కొలువు, అర్చన, మొదటగంట, బలి, శాత్తుమొఱ అయిన తర్వాత, శ్రీవారికి అభిషేక కైంకర్యం నిర్వహిస్తారు. ఆగమ పరిభాషలో స్నానాసనం పిలువబడే, ఈ తిరుమంజన కైంకర్యం, అభిషేక, సుగంధద్రవ్యాలతో, సుమారు ఒకగంటసేపు నయనానందకరంగా నిర్వహిస్తారు. ఈ అభిషేక కైంకర్య

సమయంలో శ్రీవారి ధృవబేర పరిరక్షణకు ఉపయోగించే ద్రవ్యాలు మొదలుకుని, మిగతా అన్నీ విషయాలలో వైఖానస అర్చకులు అనేక జాగ్రత్తలు తీసుకుంటారు.

ముందురోజు గురువారం ఉదయం, ఈ అభిషేకానికి సన్నాహ సూచకంగా, మూలవిరాట్టుకి అలంకరించిన ఆభరణాలన్నింటినీ తీసి భద్రపరుస్తారు. ఈ కైంకర్యానికే, 'సడలింపు' లేక 'సళ్ళింపు' అని పేరు. అలాగే శ్రీవారి నొసటన ఉన్న పచ్చకర్పూర నామంయొక్క పరిమాణాన్ని కూడా చిన్నది చేస్తారు. ఈ రూపంలోని స్వామి దర్శనానికి 'నేత్రదర్శనం' అనిపేరు. సాయంత్రం శ్రీవారి దివ్యతిరుమేనిని ఆపాదమస్తకం సుగంధభరితమైన పుష్పాలతో అలంకరిస్తారు. దీనికే 'పూలంగిసేవ' అని పేరు. ఇది ప్రతి గురువారం సాయంత్రం, రాత్రి తోమాలసేవలో భాగంగా జరుపబడుతుంది.

శుక్రవారం తిరుమంజనంలో భాగంగా, శ్రీవారి దివ్య అర్చారూపానికి, ఆపాదమస్తకం-ముందువైపు, వెనుకవైపు కూడా 'పునుగుతైలం'తో 'తైలోద్వర్తనం'-అనగా పునుగునూనెతో చక్కగా మర్దన చేస్తారు. తరువాత మెత్తటినూలు వస్త్రంతో నిజరూపాన్ని సుతారంగా తుడుస్తారు. అభిషేకం నిర్వహించడానికి, అర్చక కైంకర్యపరుడిని ప్రత్యేకంగా, సన్నిధిగొల్ల అర్చకుల తిరుమాళిగ నుండి తోడ్కొని బయలుదేరి వస్తారు. స్వామి మూర్తి ఎత్తుగా ఉంటుంది కనుక, అభిషేకం నిర్వహించే అర్చకుడు సుమారు 3 అడుగుల ఎత్తైన బల్లమీద, స్వామికి ఎడమవైపున నిల్చుకుని అభిషేకం చేస్తాడు. ముందుగా ఆకాశగంగ నుండి తీసుకురాబడిన తీర్థంతో (శుద్ధోదకం) అభిషేకాన్ని ప్రారంభించి, అనంతరం సన్నిధి వైష్ణవ పరిచారకులు అప్పటికే పెద్దపెద్ద గంగాళాలలో సిద్ధంచేసిన బంగారుబావి తీర్థంతో అభిషేకం చేస్తారు. అనంతరం సుమారు 300 లీటర్ల స్వచ్ఛమైన



దేశవాళీ ఆవుపాలతో అభిషేకాన్ని నిర్వహిస్తారు. ఆ సమయంలో శ్రీవారి నిజరూప సౌందర్యాన్ని దర్శించి తరించవలెనే కానీ మాటలలో వర్ణింపశక్యం కానిది. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారికి కేవలం గోక్షీరంతో మాత్రమే అభిషేకం చేస్తారు. ఇతర ఆలయాలలో లాగ పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు మొదలైన ద్రవ్యాలను మూలవిరాట్ అభిషేకంలో ఉపయోగించరు. ఇది బింబ పరిరక్షణార్థం ఆచరింపబడుతున్న నియమం. స్వామివారికి పునుగుతైలం పూసిన తర్వాత పాలతో అభిషేకిస్తాము కనుక పాలబిందువులు విగ్రహాన్ని అంటిపెట్టుకోకుండా క్రిందికి జారిపోయి, విగ్రహం శుభ్రంగా ఉంటుంది. ఇదొక రకమైన విగ్రహ పరిరక్షణా విధానం.

గోక్షీరం తర్వాత శుద్ధోదకం, చందనం, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం కలిపిన మిశ్రమంతో చక్కగా, ఆపాదమౌళి పర్యంతం మరల ఉద్వర్తనం చేసి, అనంతరం మరల శుద్ధోదకంతో అభిషేకం జరిపి, వక్షఃస్థలంలో వేంచేసిన వ్యూహలక్ష్మీ అమ్మవారికి హరిద్రాభిషేకం (పసుపు), తిరిగి శుద్ధోదక అభిషేకం చేయడంతో తిరుమంజనం కైంకర్యం పూర్తి అవుతుంది.

## ధృవబేరం-అలంకారం-ఆభరణాలు

అభిషేకం పూర్తి అయిన తర్వాత, శ్రీవారి దివ్యతిరుమేనిని ఎక్కడా తడిలేకుండా, మెత్తని నూలు వస్త్రంతో తుడిచి, అలంకరణ ప్రారంభిస్తారు. ముందుగా శ్రీవారి నొసటన పచ్చకర్పూరంతో నామాన్ని తీర్చిదిద్ది, మధ్యన కస్తూరీ తిలకంతో ఊర్ధ్వపుండ్రాన్ని తీర్చిదిద్దుతారు. తర్వాత 24 మూరల పొడవున్న తెల్లటి ధోవతిని శ్రీవారికి అలంకరిస్తారు. ఇది సంప్రదాయంగా గద్వాల సంస్థానం (తెలంగాణ)వారు ఏటా బ్రహ్మోత్సవానికి ముందు సమర్పిస్తారు. దీనిని 'ఉల్-చాత్తు' వస్త్రం అని పిలుస్తారు. అంటే లోపల ధరించే వస్త్రం. ఈ ఉల్‌చాత్తు పైన 24 మూరలపొడవైన పట్టువస్త్రాన్ని ధోవతిగానూ, 12మూరల పొడవైన పట్టువస్త్రాన్ని ఉత్తరీయంగానూ

సమర్పిస్తారు. ఈ పట్టుధోవతి 24 మూరలు×12 మూరలు కొలుతగల ధోవతి అనబడుతుంది. (మామూలుగా మనం ధరించే ధోవతి 10×6, 9×5 మొదలైనవి). 24–మూరల పొడవున్న వస్త్రాన్ని పూర్ణవస్త్రం అని సంప్రదాయంలో పేర్కొంటారు. పూర్ణపురుషుడికి పూర్ణవస్త్రంతో అలంకరణ జరుగుతుంది. దీనిని 'మేల్–చాత్తు' వస్త్రం అని పిలుస్తారు. శ్రీవారు ధరించిన ఈ మేల్–చాత్తు శేషవస్త్రాన్ని పీఠాధిపతులు, మఠాధిపతులు దేశాన్ని పరిపాలించే రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి మొదలైనవారు దర్శనార్థం విచ్చేసినప్పుడు, వారికి ఆశీర్వచనంగా, స్వామి ప్రసాదంగా బహూకరిస్తారు.

శ్రీవారికి గద్వాల ఉల్–చాత్, పట్టు మేల్‌చాత్ వస్త్రములు ధరింపజేసి, ఆ వెంటనే వక్షఃస్థలంలో ముఖ్‌మల్ వస్త్రంతో తయారుచేసిన మెత్తటి చిన్నపాటి దిండును, దానిమీద పట్టువస్త్రంతో సహా సమర్పిస్తారు. తరువాత వరుసగా నడుముభాగంలో సాదావడ్డాణం, దశావతార వడ్డాణం కట్టి ఉంచుతారు. పాదాలపైభాగంలో ఆంగ్ల 'W' ఆకారంలో ఉన్న 'పాగాడాలు' అనే ఆభరణం సమర్పిస్తారు. ఈ పాగాడాలు మేల్‌చాత్తు వస్త్రపు అంచులను, చెదిరిపోకుండా పట్టి ఉంచుతుంది. నడుముభాగంలో 'సూర్యకతారి' అని పేరుగల 'నందక' ఖడ్గం, మరల రెండు పాదాలవద్ద 'అందెలు' (గజ్జెలు)ను కట్టి ఉంచుతారు. రెండు భుజములయందు నాగాభరణములు, కేయూర కటకములనూ, వైకుంఠ, కటిహస్త బంగారు కవచములను, కటిహస్త పైభాగంలో బంగారు రేకులను సమర్పణ చేస్తారు. కిరీటం భాగంలో రెండు చెవులకు కర్ణపత్రాలనూ, అటుపై కిరీటమునకు ఒంటిపేట వస్త్రాన్ని '7 వరుసలుగా చుట్టి రెండు అంచులను శంఖ, చక్రాలవద్ద వదిలి ఉంచుతారు. ఈ వస్త్రాల అంచులలోనుండి కఠారి వస్త్రాన్ని (12 మూరల మేల్–చాత్ ఉత్తరీయం) తీసుకుని, దానిని వక్షఃస్థలంలో ఆంగ్ల 'V' అక్షర ఆకారంలో సూర్యకతారి పిడికి చుడతారు. దానిపై, 12 మూరలపట్టు



మేల్–చాత్తు ఉత్తరీయాన్ని అలంకరిస్తారు. ఇక వరుసగా వివిధ ఆభరణాలైన చిన్న కంఠి, పెద్దకంఠి (మెడభాగంలో), పులిగోరు గొలుసు, శ్రీవత్సం, కౌస్తుభం, గోపుహారము, అశ్వత్థ పతకహారము, అష్టోత్తర కాసులహారము, చతుర్భుజ లక్ష్మీహారము, తులసీపత్రహారము, శంఖచక్ర కవచములు, అయిదు పేటల సహస్రనామహారము, యిరువైపులా సాలగ్రామహారాలు, తామరపువ్వులహారాలు, శిరస్సుపై 'ముఖపట్టీ లేక తిరుక్కోలం', దానిపైన కిరీటం, కిరీటం మధ్య 'పచ్చమణి', కర్ణపత్రాలపైన 'బావులీలు' అనే లోలాకులు, శ్రీవారి మూలమూర్తికి ధరింపజేస్తారు. సుమారు గంటసేపు పైగా జరిపే ఈ సమర్పణ సమయంలో కేవలం అర్చకులు, జియ్యర్ స్వామివారి బృందం, సర్కారు తరపున ఒకరు మాత్రమే ఉంటారు. సమర్పణ పర్యంతము, (స్తోత్రం పూర్తిఅగువరకు) శ్రీఆండాళ్ రచించిన 'నాచ్చియార్ తిరుమొళి' జియ్యంగార్ స్వామి ఆధ్వర్యంలో అధ్యాపకులు పఠిస్తారు. శుక్రవార కైంకర్యం బహుజాగ్రత్తగా చేయవలసి ఉంటుంది. అందుకనే ఈ కైంకర్యాన్ని (అలంకారం, సమర్పణ మొదలైనవి) చేయడానికి బాగా అనుభవం ఉన్న, సుశిక్షితులైన అర్చకుల ద్వారా సమర్పణ కార్యక్రమం జరుపబడుతుంది.

సమర్పణ అయిన తర్వాత, వక్షఃస్థలంలో కంఠాభరణంగా ఉండే సువర్ణ లక్ష్మీదేవి ప్రతిమకి, కులశేఖరపడి వద్ద ఉంచిన స్నానపీఠంపై, శ్రీసూక్తపఠనంతో హరిద్రా, పరిమళయుక్తంగా అభిషేకించి, తిరిగి అమ్మవారిని శ్రీవారి కంఠాభరణంగా యథాస్థానానికి వేంచేపు చేస్తారు.

(శ్రీవైష్ణవ క్షేత్రాలలో మూలవర్లకి లేదా ఉత్సవర్లకి అలంకారం చేసేటప్పుడు, వక్షఃస్థలం ఎత్తుగా కనిపించడానికి, మెత్తటి చిన్నపాటి దిండును, లేక మెత్తటినూలు వస్త్రాన్ని కావలసిన ఎత్తు వచ్చేటట్లు నాలుగైదు మడతలు మడచి, వక్షఃస్థలంలో సమర్పించే సంప్రదాయం ఆచరణలో ఉన్నది).

అలాగే శ్రీవారి నిజరూపం ఎన్నోవేల సంవత్సరాల నాటిది కనుక స్వామివారి స్వయంవ్యక్త బింబానికి, ఆభరణాలు అలంకరించేటప్పుడు నేరుగా తగలకుండా, బింబపరిరక్షణ కోసమే ఉల్–చాత్తు నూలువస్త్రం లోపల సమర్పించి, దానిపైన మేల్–చాత్తుని అలంకరిస్తారు. ఆభరణాల క్రింద కూడా వస్త్రాన్ని సమర్పించి, దానిపై కవచాలు, ఆభరణాలు సమర్పిస్తారు. ఇది శ్రీవారి ధృవబేరమునకు జరిగే వారకట్ల కైంకర్యం. (పక్షోత్సవాలు, మాసోత్సవాలలో చెప్పుకోదగిన అంశాలు లేవు).

ఇక సంవత్సర ఉత్సవాలైన ఉగాది ఆస్థానం, ఆణివర ఆస్థానం (దక్షిణాయన ప్రారంభం), బ్రహ్మోత్సవం, దీపావళీ ఆస్థానం, వైకుంఠ ఏకాదశి – ఇవీ తిరుమల ఆలయంలో అతి ముఖ్యమైన సంవత్సరోత్సవాలుగా ఆచరింపబడుతాయి. మనము పైన చెప్పుకున్నది (మూలవిరాట్ అలంకరణ) సాధారణ రోజులలో (ఆలయంలో ఎటువంటి విశేషం, ఉత్సవంలేని రోజులలో) చేసే సమర్పణ. దీనికి 'నిత్యకట్ల సమర్పణ' అని పేరు. పైన చెప్పిన పర్వదినాలలో బంగారు పీతాంబరంతో వజ్రఖచిత ఆభరణాలను శ్రీవారి మూలమూర్తికి అలంకరిస్తారు. దీనినే ఆలయ పరిభాషలో 'విశేష సమర్పణ' అని పిలుస్తారు. ఈ విశేష సమర్పణ సమయంలో, కొన్ని ఆభరణాలు, వజ్రాలు పొదిగినవి అలంకరిస్తారు. వజ్రఖచిత కిరీటం, వజ్రాల తిరుక్కోలం, వజ్రాల కర్ణపత్రములు, వజ్రాల శంఖ, చక్ర, వైకుంఠ, కటిహస్త కవచములు, వజ్రాల సూర్యకఠారి, వజ్రాల పులిగోరు, అశ్వత్థపతకహారం, వజ్రఖచిత మకరకంఠి (రెండు అంతస్థులుగా), వజ్రాల చిన్నకంఠి, కటిహస్త పైభాగంలో వజ్రాల రేకులు మొదలైన ఆభరణాలతో విశేష సమర్పణ జరుగుతుంది. పై చెప్పబడిన ఈ అయిదు పర్వదిన సమయాలలో వజ్రఖచిత ఆభరణాలు స్వర్ణపీతాంబరంతోసహా విశేష సమర్పణ చేస్తారు.



అలాగే ఈ పర్వదినముల సమయంలో, ఒక్క దీపావళీ ఆస్థానం తప్ప, మిగిలిన నాలుగు పర్వదినాలకు ముందువచ్చే మంగళవారంనాడు, 'కోవిల్ – ఆళ్వార్ తిరుమంజనం' అనే ఆలయ శుద్ధికార్యక్రమం జరుగుతుంది. ఈ తిరుమంజన సమయంలో గర్భాలయంలో ఉన్న అన్ని విగ్రహమూర్తులను, అఖండ దీపాలను, ఆరాధన పాత్రలను, స్వామివారి మూర్తులను ఉంచే సింహాసనాలను, సమస్త సామగ్రిని బంగారువాకిలికి తరలిస్తారు. భోగశ్రీనివాసమూర్తిని, మూలవిరాట్ పాదములవద్ద సంధానంచేసి, మూలవిరాట్ మూర్తిపైన 'మళై గుడారం' అనే వస్త్రంతో కప్పి ఉంచుతారు. గర్భాలయం అణువణువు వేడినీరుతో శుద్ధి చేస్తారుకనుక శ్రీవారిమూర్తిమీద ఎటువంటి దుమ్ము, ధూళీ పడకుండా ఈ ఏర్పాటు జరుగుతుంది.

ఇక హోమంతో కూడిన ముఖ్యమైన సంవత్సర ఉత్సవాలైన పవిత్రోత్సవం, పుష్పయాగం, బ్రహ్మోత్సవం వంటి సందర్భాలలో వైఖానస ఆగమంలో చెప్పబడిన విధివిధానాల ప్రకారం, మంత్రపూర్వకంగా అనేక వైదిక క్రియలను మూలవిరాట్టు వద్ద ఆచరిస్తారు. ఈ ఉత్సవాలలో, యాగశాలలో ఒక ప్రధానకుంభం ప్రతిష్ఠించి, అందులోకి వేదమంత్ర పురస్సరంగా విష్ణ్వాది నవ మూర్తులను – విష్ణు, పురుష, సత్య, అచ్యుత, అనిరుద్ధ, కపిల, యజ్ఞ, నారాయణ, పుణ్యలను ఆవాహన చేసి, ఉత్సవాంతంలో పూర్ణాహుతి తర్వాత, ప్రధాన కుంభమును, ప్రధానాచార్యులు శిరస్సుపై ధరించి, ఛత్రచామర, బాజాబజంత్రీ, పంచముఖాది ఆలయ మర్యాదలతో గర్భాలయంలోనికి ప్రవేశించి, అక్కడ పుణ్యాహవాచనం – స్థలశుద్ధి జరిపి, వివిధన్యాస కర్మలను ఆచరించి, ఆ కుంభంలో ఉన్న శక్తిని మంత్రపూర్వకంగా శ్రీవారి మూలవిరాట్టులోనికి ప్రవేశపెడతారు. మూలవిరాట్టులోని సాన్నిధ్యశక్తి క్షీణించకుండా, ప్రధానకుంభంలో మంత్రసహితంగా పరిరక్షించిన సాన్నిధ్యశక్తిని ధృవబేరంలో ప్రవేశపెట్టాలని

ఆగమశాస్త్రవచనం. అయితే తిరుమలలో స్వామివారు స్వయంవ్యక్తంగా ఆవిర్భవించడం వలన ఆయన విషయంలో క్షీణత అనేది లేనప్పటికినీ, ఆగమశాస్త్రబద్ధంగా నిర్దేశించిన వైదికక్రియలను తప్పక ఆచరించాలనే నియమం ఉన్నది.

తిరుమల క్షేత్రంలో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి 'బాలాలయ అష్టబంధన మహాసంప్రోక్షణ' అనే వైదికక్రతువు, పంచాహ్నిక దీక్షతో ఐదు రోజులపాటు వైఖానస భగవచ్ఛాస్త్రవిధిగా జరుగుతుంది. ఈ సంప్రోక్షణ సమయంలోనే, ఆలయంలో ఎక్కడైన చిన్నపాటి మరమ్మత్తులు చేయవలసివస్తే, ఆ మరమ్మత్తులు పూర్ణాహుతి లోపల పూర్తిచేసే సంప్రదాయం ఉన్నది. 1970లో మనం ఇదివరకే చెప్పుకున్నట్లు, గర్భాలయంలో సోమసూత్రం ఏర్పాటు, సమతలంగా ఉన్న బండలు పరచు కార్యక్రమం, మహాసంప్రోక్షణలో భాగంగా నిర్వహించారు. ఈ అయిదు రోజుల సంప్రోక్షణలో నాలుగవ రోజు సాయంత్రం 'మహాశాంతి తిరుమంజనం' అనే వైదికమైన అభిషేకం నిర్వహించబడుతుంది. ఈ తిరుమంజనంలో మూలవిరాట్టుతోపాటు ఏకకాలంలో పంచ బేరాలకు, ఆలయంలోని ఇతరమూర్తులకు అభిషేకాన్ని నిర్వహిస్తారు. ఈ ఒక్కసందర్భంలో మాత్రమే శ్రీ వేంకటేశ్వరస్వామివారి ధృవబేరానికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనాదులతో మహాశాంతి అభిషేకం జరుగుతుంది. ప్రతిశుక్రవారం కేవలం గోక్షీరంతో మాత్రమే ధృవబేరాన్ని అభిషేకించగా, ఈ 12 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే సంప్రోక్షణలో మాత్రం అన్ని ద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది.

ఈ సంప్రోక్షణలో మూడవ రోజు ఉదయం, శ్రీవారి పద్మపీఠానికి, శ్రీవారిమూర్తికి సంధానం చేయబడిన 'అష్టబంధనం' అనే ఎనిమిది మూలికలతో మంత్రపూర్వకంగా తయారుచేసిన మిశ్రమాన్ని, ధృవ బేర



పీఠ దృఢీకరణకోసం పాత అష్టబంధనం తీసివేసి, కొత్త అష్టబంధనాన్ని లేపనం చేస్తారు.

1957-58 సంవత్సరాలలో ఆనందనిలయం విమానమునకు బంగారు తాపడంకోసం 'విమాన సంప్రోక్షణ' నిర్వహించారు. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో ఏవైన మరమ్మత్తులు దీర్ఘకాలం చేయవలసివస్తే, అప్పుడు మూలవిరాట్‌లోని కళలను (సాన్నిధ్యశక్తిని) ఒక అత్తి కొయ్యతో చేసిన శ్రీవారి విగ్రహములో ప్రవేశపెట్టి, ప్రధాన ఆలయమునకు ప్రక్కన అనువైన ప్రదేశంలో 'బాలాలయం' అనే పేరుతో తాత్కాలిక గర్భగృహమును నిర్మించి అందులో ఈ అత్తి వేంకటేశ్వరుని ప్రతిష్ఠిస్తారు. కైంకర్యాలు, ఆరాధనలన్నీ యథావిధిగా బాలాలయంలోనే జరుపబడుతాయి. కానీ శ్రీవారి మూర్తి స్వయంవ్యక్తం కావటంవలన, మూలవిరాట్ సన్నిధిలో కూడా అన్ని కైంకర్యాలూ మంత్రరహితంగా జరుగుతాయి. అందుకే ఆ సందర్భంలో చేసే ఆరాధనలకి 'మూగ తోమాలసేవ' అనిపేరు. అంటే కేవలం క్రియాభాగం మాత్రంచేసి, యథావిధిగా నైవేద్యాలను సమర్పించుతారు. ఇది ఒక్క తిరుమల శ్రీవారి ఆలయంలో మాత్రమే ఆచరించే విశిష్టసంప్రదాయం. ఇతర ఆలయాలలో మొదటిరోజు 'కళాపకర్షణ' – అనగా మూలబేరంలోని కళలను కలశంలోగానీ, చిత్రపటం / అత్తి విగ్రహంలోకి ఆరోపించిన తర్వాత, గర్భగృహం తాళంవేసి, అక్కడ ఆరాధనలన్నీ నిలిపివేసి, బాలాలయంలో మాత్రమే నిత్యార్చన చేస్తారు.

విమాన సంప్రోక్షణ – 1957 సమయంలో శ్రీవారు అత్తివిగ్రహంలో వేంచేసి, 1957 నవంబరు నుండి 1958 ఆగష్టువరకు సుమారు 10 నెలలపాటు విమాన ప్రాకారంలోని పాతకళ్యాణమంటపంలో ఏర్పాటు చేయబడిన బాలాలయంలో కొలువై పూజలందుకున్నారు. ఈ 10 నెలలకాలంలో విమానంపైన స్థపతులు, శిల్పులు, నూతన స్వర్ణకవచ రేకులను విమానం మీద అమర్చే పని చేసారు. ఆ సమయంలో విమానం

నుండి దుమ్మూ, ధూళీ, మట్టిపెళ్ళలు శ్రీవారి స్వయంవ్యక్త ధృవబేరం మీద పడకుండా, స్వామివారికి ఆరాధన అయిన తర్వాత, ఆగమశాస్త్రంలో చెప్పబడిన, 'పంజరం' అనే చెక్కతో తయారుచేసిన పెట్టెతో, మూలవిరాట్టు మూసి ఉంచి, బింబరక్షణ చేసారు.

ఇలాంటి విశిష్ట సంప్రదాయాలెన్నో, శ్రీవారి ఆలయంలో, ఆగమయుతంగా సంప్రదాయం, ఆచారయుతంగా కొన్ని వందల సంవత్సరాలుగా పటిష్టంగా ఆచరింపబడుతూ ఉన్నాయి. తిరుమలకు సంబంధించి, శ్రీవారికి సంబంధించి ఏ విషయమైన తెలుసుకోవడానికి వీనులవిందుగానే ఉంటుంది. ఆ స్వామి గురించి ఎంత చెప్పుకున్న తనివితీరదు. ఎంత మాట్లాడుకున్న సమయం తెలీదు. (గ్రంథవిస్తరణ భీతిచే ఈ అధ్యాయం ఇంతటితో ముగించడమైనది).

## ధృవబేరం - అపోహలు - వాస్తవాలు

తిరుమల కొండలలో నెలకొన్న కోనేటిరాయుడిగా, ఆశ్రిత భక్తజనవత్సలుడిగా, శ్రియఃపతియైన శ్రీవేంకటేశ్వరస్వామివారు కలియుగంలో తనను ఆశ్రయించిన భక్తులందరికీ, అభయప్రదాతగా, వరప్రసాదిగా అనుగ్రహిస్తాడు. ఏడుకొండలస్వామి విషయంలో కుల, మత, వర్గ, వర్ణ విషయాలు చిన్నాపెద్దా ఆబాలగోపాలం, పండితుడి నుండి పామరులవరకు, పీఠాధిపతులు, మఠాధిపతులు, మహాశాస్త్ర కోవిదులు, ఒకరేమిటీ, ఎవరైనా స్వామివారిని చూస్తే సమ్మోహనానికి గురికావలసిందే, ఆయన అనుగ్రహం కటాక్షానికి సంభ్రమాశ్చర్యాలకు లోనుకావలసిందే. ఈ క్రమంలో ప్రాచీనకాలంనుండి, ఆస్తిక సమాజంలో అనేక సందేహాలు, అపోహలు, అవాస్తవాలు, అయోమయానికి గురిచేసే తామరతంపర కథనాలు, మావాడంటే మావాడని అన్ని సంప్రదాయాల వారూ వాదించుకోవడం ఇలా ఇదంతా ఎందుకు జరుగుతున్నది అంటే,



శ్రీవారిమీద ఆయా వర్గాలవారికి అమితమైన భక్తి, ప్రేమ, నమ్మకం ఇంతింతై వటుడింతై అని పెరిగిపోవడమే.

సహజంగా వైఖానస అర్చకుడిని కావడంవలన గత 25 సంవత్సరాలు, శ్రీవారి ధృవబేరానికి, స్వామి అనుగ్రహంతో, అనేక కైంకర్యాలు చేయడంవలన, ముఖ్యంగా శుక్రవార అభిషేకం సమయంలో కైంకర్యానికి అనేకసార్లు వెళ్ళి, శ్రీవారి మూలవిరాణ్మూర్తిని నఖశిఖ పర్యంతం అతిసమీపం నుండి చూసి, తాకిన, ఆరాధించిన, అర్చించిన అనుభవంతో, ఇటువంటి అవాస్తవాలకు నిజమైన సమాధానం ఇవ్వడానికి అందరికంటే నాకు ఎక్కువ అవకాశం ఉందని భావిస్తూ, సాధ్యమైనంతవరకు, తెలుసుకోదగిన అన్నీ విషయాలను క్లుప్తంగా ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

1) శ్రీవేంకటేశ్వరస్వామివారి రూపం శ్రీమహావిష్ణువుదే అని చెప్పడానికి ఆధారాలు.

2) ఏ ఆలయ చరిత్రైన ముందుగా, అర్చకుడిని వరించడంతోటే ప్రారంభమవుతుందని ముందు అధ్యాయాలతో చెప్పుకున్నాం. అత్యంత ప్రాచీనకాలంనుండి, సాక్షాత్తూ శ్రీవారే పిలిపించుకుని ఆరాధన ప్రారంభింపజేసిన గోపీనాథదీక్షితులు వైఖానసుడుకావడం. 10వ శతాబ్దానికి చెందిన వైఖానస మహాపండితుడు, శ్రీవారి అర్చక స్వామియైన శ్రీనివాసదీక్షితులు 'దశవిధహేతు నిరూపణం' అన్న వ్యాఖ్యానంలో అఖిల జగదేక కారణభూత శ్రీమన్నారాయణైకపరత్వాత్ ॥అని చెప్పబడినందు వలన, వైఖానస ఆగమంలో చెప్పబడిన సూత్రాలు అఖిలజగత్సృష్టికి కారణమైన శ్రీమన్నారాయణుడియందే పరములు కావటంచేత వైఖానసులు విష్ణువును ఉత్తమోత్తముడైన వేదప్రోక్తదైవంగా ఆరాధిస్తారు. అన్యదేవతలను ఆరాధించరు.

3) విష్ణుపురాణంలో శ్రీమహావిష్ణువుయొక్క మూర్తి స్వరూపవర్ణన ఉన్నది. ఏ మూర్తినైనా విష్ణువుగా నిర్ధారించాలంటే ఇది అత్యంత ప్రామాణికం. ఇందులో విష్ణువుని అయిదు దశలలో ధ్యానించాలని పేర్కొనబడింది. ప్రథమదశలో విష్ణువు–సర్వాభరణ భూషితుండు, సర్వాయుధోపేతుడుగా, అష్ట లేక చతుర్భుజుడుగా ఉంటాడు. రెండవ దశలో దివ్యాయుధాలను విస్మరించి మూర్తిధ్యానం చేయాలి. మూడవ దశలో దివ్యాయుధములేగాక, సర్వాభరణాలను కూడా విస్మరించి ధ్యానించాలి. తరువాతి దశలో ప్రసన్నవదనము, తామర పూరేకులవంటి సుందరనేత్రములు, దివ్యకర్ణములు, విశాలమైన నుదురు, కర్ణాభరణములు, దక్షిణావర్త శంఖమువంటి కంఠము, విశాలమైన ఛాతి, శ్రీవత్సచిహ్నము, త్రివళీయుత ఉదరము, నిమ్ననాభి, దీర్ఘమైన చతుర్బాహువులు, చక్కటి సౌష్ఠవంతో ఉన్న యూరువులు, పట్టుపీతాంబరము, కిరీట హారకేయూర, కటక, పాదాంగుళీయక, కరాంగుళీయకములు, దివ్యాయుధములు, వరదాభయ హస్తములు గల రూపాన్ని పురాణం వర్ణించింది. ఐదవ దశ ధ్యానంలో ఆయుధములన్నీ విస్మరించి ధ్యానించవలెను. ఇక్కడ తెలిపిన లక్షణాలన్ని విగ్రహగతంగా శ్రీవారిమూర్తితో సరిపోలుతున్నది.

4) ఇదివరకే చర్చించిన విషయం, శ్రీవారి కుడివక్షఃస్థలంపై చనుమొన పైభాగంలో శ్రీవత్సరూపంలో విగ్రహగతంగా వ్యూహలక్ష్మీదేవి కొలువై ఉన్నది.

5) శ్రీవారి మూలవిరాణ్మూర్తి నిజరూపంలో ప్రలంబయజ్ఞోప వీతమున్నది. ఇంకనూ ఆ యజ్ఞోపవీతములోని ఆరు ప్రోగులలో ఒక ప్రోగు తెగిపడినట్లు చిత్రించబడియుండి, మిగిలిన ఐదు ప్రోగులు, చేతితోతాకి చూస్తే (అర్చకులు) 5ప్రోగులను ఎంచవచ్చు. స్పష్టముగా 6 ప్రోగులున్న యజ్ఞోపవీతం వైష్ణవసంప్రదాయమునకు చెందినది.



6) శ్రీవారి మూర్తి లక్షణములన్నియూ పురుషవిగ్రహలక్షణములు.

7) ఆగమశాస్త్రం ప్రకారం కౌతుకబేరం ముమ్మూర్తులా ధృవబేరాన్ని పోలి ఉండాలి. 6వ శతాబ్దం నాటిదిగా శాసనాలలో పేర్కొనబడిన శ్రీభోగ శ్రీనివాసమూర్తివారి రూపంలో విగ్రహలక్షణములన్నీ, ధృవబేరంలో ఉన్న విధముగా ఉన్నది. 6వ శతాబ్దికాలంలో అర్చకులే విగ్రహములను, ఆగమ శిల్పశాస్త్ర విధివిధానములతో తయారుచేసేవారని తిరుమల పాతతరం అర్చకులు చెపూ్త ఉంటారు. ఈ భోగశ్రీనివాసమూర్తిని కూడా అప్పటితరం వైఖానస అర్చకులు తయారుచేసినారు.

8) తిరుమల శ్రీవారి ఆలయ నిర్మాణంలో ఒక విశేషమున్నది. అదేమిటంటే గర్భాలయ బయటివైపు గోడలు శాశ్వతంగా చూడటానికి వీలులేని విధంగా మూసివేయబడినది. ఇప్పుడు మనం వైకుంఠ ప్రదక్షిణ మార్గంలో చూస్తున్న లోపలివైపు గోడ, నిజగర్భాలయ గోడకాదు. దీనిని తిరుమల గురించి పరిశోధించిన నిపుణులు నిర్ధారించారు. అసలు విషయం ఏమిటంటే భోగశ్రీనివాసమూర్తికి చెందిన శాసనం నిజగర్భాలయ బయటి గోడలపై చెక్కబడి ఉన్నది. గర్భాలయ జీర్ణోద్ధారణ జరిగిన 12వ శతాబ్దంలో, ఈ శాసనమును అప్పటి రాజైన వీరనరసింగ యాదవరాయలు ముందుచూపుతో విమానప్రాకారం లోపలి గోడలపై ఉత్తరంవైపు చెక్కించినాడు. దీనిని బట్టి భోగశ్రీనివాసుడి ప్రతిష్ఠాకాలానికే శ్రీవారు మహావిష్ణువు అని, ఆ విషయం కనుమరుగుకాకూడదని, ఆ శాసనాన్ని తాను క్రొత్తగా కట్టిన ప్రాకారంపై పునర్ముద్రించాడు.

9) భగవద్రామానుజులవారు అన్ని సందేహములను పటాపంచలు చేసూ్త శంఖచక్రములు ధరింపజేసి, తిరుమలస్వామి విష్ణువే అని నిశ్చయం చేసి తీర్మానించినాడు.

1) పై కారణాలన్నింటివలన నిస్సందేహంగా స్వామి మనలను తరింపజేయడానికి వైకుంఠం నుండి విచ్చేసిన మహావిష్ణువే అని అర్థమవుతుంది. ఇంకా శ్రీవారు శివుడా, శక్తా, కుమారస్వామా అన్న విషయాల గురించి ఇదివరకే పరిశోధకులు ఎన్నో పుస్తకాలలో, స్వామివారు విష్ణువే అని నిర్ధారణచేస్తూ ప్రకటించి ప్రచురించారు. ఆయా అంశలు చర్చల జోలికిపోకుండా క్లుప్తంగా ఇక్కడ ప్రస్తావించబడుతుంది.

2) రామానుజులవారికి పూర్వులైన 63మంది నాయనారులు (శివభక్తులు) ఆంధ్రప్రాంతంలోని శ్రీకాళహస్తీశ్వరుని, శ్రీశైలమల్లికార్జుని స్తుతించి, తిరుమలేశుని స్మరించకపోవడం, స్వామి శివుడు కాదనే విషయం స్పష్టం చేస్తున్నది.

3) ఆదిశంకరాచార్యులు రచించిన తిరుమలేశుని స్తోత్రం ఏదీ లేకపోవడం, శంకరులవారు, ధనాకర్షణ, జనాకర్షణ యంత్రాలను తిరుమలలో ప్రతిష్ఠించినట్లు ప్రచారంలో ఉన్న విషయం పూర్తిగా అవాస్తవం.

4) విమాన వేంకటేశ్వరుని వలె శివాలయాలలో, శక్తి ఆలయాలలో ధృవమూర్తి ప్రతిమ, ఆలయవిమానం మీద లేకపోవడం.

5) శ్రీవేంకటేశ్వర శబ్దములోని ఈశ్వర శబ్దము ప్రాణేశ్వరుడు, బసవేశ్వరుడు, నందీశ్వరుడు మొదలగు పదములందు వలె అధిపతి వాచకమే కాని శివవాచకము కాకపోవడం.

6) శివునికి అర్చనలో ఉపయోగించని తులసీదళాలు ప్రత్యేకంగా వేంకటేశ్వరుని నిత్యార్చనలో ప్రధానంగా ఉండడం. ఒక్క ధనుర్మాసంలో 30 రోజులపాటు, ధనుర్మాస ఆరాధనలో వక్షఃస్థల లక్ష్మీయుతుడైన శ్రీనివాసుడికి బిల్వపత్రపూజ జరుగుతుంది. ఇది వైఖానసాగమంలో విష్ణుపూజకు అర్హమయిన పత్రపుష్పములలో ఉంది.



7) తి.తి.దే. శాసనాలలోకానీ, ప్రాచీన తమిళ సాహిత్యంలోకానీ, ఆంధ్రసాహిత్యంలో, అన్నమాచార్య కీర్తనలలో, 'బాలాజీ' పదము లేకపోవడం. దేవీభాగవతంలో 'వేంకటేశ్వరి' దేవతప్రస్తావన లేదు.

8) దేవస్థానంవారు సేకరించిన అన్ని తమిళ శాసనాలలో చివర్న 'శ్రీవైష్ణవ రక్ష' అని ఉండడం. ఆనాటి శివాలయ శాసనాలలో 'మహేశ్వర రక్ష' అని ఉన్నది.

9) శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శరన్నవరాత్రులలో జరుగుతుండటం చేత స్వామి స్త్రీదేవత – శక్తిదేవత అనే వాదన నిజంకాదు. శ్రీవారు సౌరమానరీత్యా కన్యామాసంలో శ్రవణానక్షత్రంనాడు తిరుమలలో అవతరించాడు. ఆ అవతార దినము పురస్కరించుకుని, దానికి 9 రోజులముందు ఈ బ్రహ్మోత్సవాలు జరుపబడుతున్నాయి. సౌరమానరీత్యా సూర్యుడు కన్యారాశిలో సంచరించునప్పుడు చాంద్రమాన ఆశ్వయుజ మాసం), శ్రవణా నక్షత్రంనాడు అవభృథ స్నానముతో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. అధికమాసం వచ్చినప్పుడు మొదటి బ్రహ్మోత్సవం కన్యాభాద్రపదంలో, రెండవ బ్రహ్మోత్సవం శరన్నవరాత్రి – ఆశ్వయుజ మాసంలో జరుగుతున్నాయి. ఇందులో ప్రధానమైనది కన్యామాసంలో జరిగేవే, రెండవసారి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ధ్వజారోహణం, ధ్వజావరోహణం, మహారథం, అంకురార్పణ ఉండవు. నిజానికి ప్రాచీన కాలంలో దీనిని నవరాత్రి ఉత్సవాలనే పిలిచేవారు. కానీ ఇటీవలికాలంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలని పిలవడం పరిపాటి అయినది.

10) వేంకటేశ్వరస్వామివారికి విగ్రహగతంగా జటాజూటం ఉందని, అందువలన ఆయన శివుడని ఒక వాదన. జటాధరత్వము స్త్రీ, పురుషుల సహజలక్షణము. అగస్త్యముని, శంఖరాజాదుల ఎదుట అవతరించిన శ్రీనివాసుడి రూపాన్ని వామనపురాణం ఇలా వర్ణించింది.

**మూర్ధజై కుంచితైశ్చాపి నీలైః మృదుతరైస్తథా**
**లంబమానైర్వినిష్క్రాంతైః కిరీటాత్ శుభదర్శనాత్**
**ప్రచ్ఛాద్యమానవదనం మేఘైరివ నిశాకరమ్ ॥**

కుటిలములు, వినీలములు, మృదువులు శుభదర్శనమైన కిరీటము నుండి బయలువెడలి, వ్రేలాడుచున్నట్టి కేశములచేత ఆచ్ఛాదింపబడి యుండుటవలన, మేఘావృత్తమైన చంద్రబింబము పోలు ముఖము గలవాడు అని వామనపురాణం శ్రీవారి జటాధరత్వమును వర్ణించినది. ఇదేగాక శ్రీవేంకటేశ సహస్రనామావళిలో 'జటావాన్' (233) అనే నామము ఉన్నది. కేశసంపద, ముఖసౌందర్యానికి నేపథ్యంగా, ఆలంబనగా ఉంటుంది. కనుక జట (జులపాలు) ఉన్నంత మాత్రంచేత, శ్రీవారిమూర్తి శివుడని, శక్తిదేవతయని చెప్పడం సరికాదు.

* * *

## ఉపయుక్త గ్రంథములు


1) The Hill slurine of Vengadam - Sri S.K.Rama chandra Rao.

2) తిరుపతి చరిత్రము – శ్రీదేవి రఘునాథాచార్యులు.

3) కాశ్యపజ్ఞానకాండ – తి.తి.దే. ప్రచురణ.

4) భృగువు ప్రకీర్ణాధికారం – తి.తి.దే. ప్రచురణ.

5) భృగువు ప్రకీర్ణాధికారం – తి.తి.దే. ప్రచురణ.

6) భగవదారాధనా చంద్రిక – శ్రీనారాయణం రామానుజాచార్యులు.

7) శ్రీమద్భృగవదర్చా ప్రకరణమ్ – శ్రీమన్నృసింహ వాజపేయయాజి.

8) శ్రీశాస్త్రవైభవము (వ్యాససంపుటి) – పరాశరపబ్లికేషన్స్.

9) శ్రీవేంకటేశ్వరవైభవము – శ్రీ K.V. రాఘవాచార్య.

10) మరీచి విమానార్చనాకల్పం – తి.తి.దే. ప్రచురణ.

11) స్నపనవిధి – షడ్భుజ పబ్లికేషన్స్.

12) శ్రీ వేంకటాచల మాహాత్మ్యము – తి.తి.దే.ప్రచురణ.

13) శ్రీ వేంకటాచల మాహాత్మ్యము (ఆంధ్ర తాత్పర్యము) – శ్రీ రొంపిచర్ల పార్థసారథి భట్టాచార్యులు.

14) T.T.D. Inscriptions - A Report - Srisadhu Subrahmanya Sastry.

15) విద్వన్మణి – పరాశర పబ్లికేషన్స్.

16) శ్రీ వేంకటేశ్వరస్వామివారి కైంకర్యాలు – శ్రీ అర్చకం రామకృష్ణ దీక్షితులు.

17) Kasyapa's Book of Wisdom - Sri T. Goudriaan.

18) శ్రీ వేంకటాచలేతిహాసమాల – శ్రీ NCV నరసింహాచార్య.

* * *